ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 10.08.2025 | సంపుటి :12 సంచిక : 22 | పేజీలు :12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్




## 334 రాజకీయ పార్టీలకు
# ఈసీ ఝలక్

రిజిస్టర్ పొలిటికల్ పార్టీల జాబితా నుంచి తొలగిస్తూ కీలక నిర్ణయం

బీహార్ ఓట్ల రివిజన్‌ను సమర్థించుకున్న ఎన్నికల సంఘం

**ఢిల్లీ(జనంసాక్షి):** ఎన్నికల ప్రక్రియలో పారదర్శకతే లక్ష్యంగా కేంద్ర ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. దేశ ఎన్నికల వ్యవస్థ క్రమబద్దీకరణలో భాగంగా గుర్తింపు పొందని 334 రాజకీయ పార్టీలకు కేంద్ర ఎన్నికల సంఘం ఝలక్ ఇచ్చింది.ఆ పార్టీలను రిజిస్టర్ పొలిటికల్ పార్టీల జాబితా నుంచి తొలగిస్తూ ఈసీ కీలక నిర్ణయం తీసుకుంది. వరుసగా ఆరేళ్లపాటు ఎన్నికలలో పోటీ చేయని పార్టీలను ఈసీ తొలగించింది. రాజకీయ పార్టీలకు వర్తించే ప్రయోజనాలేవీ వర్తించని స్పష్టం చేసింది. ఏపీకి చెందిన మిగతా 2లో..

# రాష్ట్రంలో ఎన్టీపీసీ భారీ పెట్టుబడులు

## రూ.80 వేల కోట్లతో ముందుకొచ్చిన సంస్థ


జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసిన ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం

- సీఎం రేవంత్ రెడ్డితో సీఎండీ గురుదీప్ సింగ్ బృందం భేటీ
- సోలార్, పవన విద్యుత్ పాజెక్టుల్లో పెట్టుబడులకు సంసిద్ధత
- రాష్ట్రంలో 6700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తికి అవకాశం ఉందని సీఎంకు వివరణ
- ఎన్టీపీసీకి అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి హామీ

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణలో రూ. 80వేల కోట్లు పెట్టుబడులు పెట్టేందుకు నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) సంసిద్ధత వ్యక్తం చేసింది. ఎన్టీపీసీ సీఎండీ గురుదీప్ సింగ్ బృందం శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసింది.రాష్ట్రంలో పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి రంగంలో పెట్టుబడులు పెట్టనున్నట్లు వివరించింది. సోలార్, పవన విద్యుత్ ప్రాజెక్టుల్లో పెట్టుబడులకు ఎన్టీపీసీ సుముఖత తెలిపింది. మిగతా 2లో..



## 2025-30 పర్యాటక పాలసీ అమలుకు
# రూట్ మ్యాప్

### అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తెలంగాణను తయారుచేస్తాం

- అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుండి రూ.15 వేల కోట్ల పెట్టుబడులకు ప్రణాళికలు
- రానున్న రోజుల్లో పర్యాటక రంగంలో 3 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తాం
- 27 ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాల ఏర్పాటు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణా రాష్ట్రాన్ని అంతర్జాతీయ పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.అందుకనుగుణంగా అంతర్జాతీయ పారిశ్రామిక వేత్తల నుండి 15000 కోట్లు పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రభుత్వం ప్రత్యేక విధానం రూపొందించిందని ఆయన తెలిపారు.తద్వారా పర్యాటక రంగంలో 3 లక్షల ఉద్యోగాలు సృష్టిస్తామని ఆయన వెల్లడించారు. శనివారం హైదరాబాద్ లోని లకిడికాపూల్ వద్ద సదరన్ ట్రావెల్స్ ప్రాంతీయ కార్యాలయాన్నీ సహచర మంత్రి పొన్నం ప్రభాకర్‌తో మిగతా 2లో..

# ఆధారాలతోనే రాహుల్ ఆరోపణలు

- ఈ విషయమై ఈసీ మాట్లాడాలి
- ఓట్ల దొంగతనం, ఫేక్ ఓటర్ల లిస్ట్ గురించి సమగ్రంగా పరిశీలించాలి
- రాహుల్‌కు శరద్ పవార్ ,



**ఢిల్లీ(జనంసాక్షి):**మహారాష్ట్ర రాజకీయాల్లో అనేక మార్పులు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత శరద్ పవార్ తాజాగా రాహుల్ గాంధీకి మద్దతుగా నిలిచారు. రాహుల్ గాంధీ ఇటీవల ఓ ప్రెజెంటేషన్ ద్వారా ఓట్ల దొంగతనం, ఫేక్ ఓటర్ల లిస్ట్ గురించి ప్రస్తావించారు. దీనిపై శరద్ పవార్ తనదైన శైలిలో స్పందించారు. ఈ విషయాన్ని భారత ఎన్నికల కమిషన్ సమగ్రంగా పరిశీలించాలని, ఇది చిన్న విషయం కాదన్నారు. వాటిలో కర్ణాటక, మహారాష్ట్రలలో ఎన్నికలు మిగతా 2లో..

## అన్ని ప్రభుత్వ భవనాలపై
# సోలార్ ప్లాంట్లు

గ్రామపంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని అన్నారు. వార్త 3 లో

- ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి
- ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ఓఎఫ్ఆర్ భూముల వివరాలు పంపండి
- విద్యుత్ శాఖపై జిల్లా కలెక్టర్లతో డిప్యూటీ సీఎం భట్టి వీడియో కాన్ఫరెన్స్





## పదవీకాలం ముగిసింది..
# జోక్యం చేసుకోలేం

రమేశ్ పౌరసత్వ వివాదంలో కీలక పరిణామం

హైకోర్టు తీర్పునే సమర్థించిన సుప్రీంకోర్టు

ఆది శ్రీనివాస్ పిటిషన్ కొట్టివేత

**హైదరాబాద్,ఆగస్టు9(జనంసాక్షి):**వేములవాడ నియోజకవర్గానికి సంబంధించి పదిహేనేళ్లుగా కొనసాగుతున్న పౌరసత్వ వివాదానికి సుప్రీంకోర్టు శుక్రవారం ముగింపు పలికింది. బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ పౌరసత్వంపై తెలంగాణ హైకోర్టు ఇచ్చిన తీర్పును సవాలు చేస్తూ ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం కొట్టివేసింది. రమేశ్ పోటీ చేసిన ఎన్నికల పదవీకాలం ఇప్పటికే ముగిసిపోయినందున, ఆ విషయాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేమని ధర్మాసనం స్పష్టం చేసింది.జస్టిస్ ఎం.ఎం. సుందరేశ్, జస్టిస్ ఎన్.కె. సింగ్‌లతో కూడిన ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. హైకోర్టు తీర్పులో జోక్యం చేసుకోవడానికి నిరాకరించింది. మిగతా 2లో..

## రిజర్వేషన్లపై కావాలనే బీజేపీ రాద్ధాంతం

హైకోర్టు ఆదేశాలకనుగుణంగా స్థానిక ఎన్నికలు : మంత్రి పొన్నం వార్త 2లో




## రాజ్యాంగం మార్చాలని
# బీజేపీ కుట్ర

**క్విట్ బీజేపీ నినాదంతో ముందుకు వెళ్లాల్సిందే**

**ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర**

- పాదయాత్రకు పెద్దఎత్తున స్పందన వచ్చింది
- బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉంది
- గాంధీభవన్ క్విట్‌ఇండియా కార్యక్రమంలో టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్

**హైదరాబాద్(జనంసాక్షి):** రాజ్యాంగం మార్చాలని బీజేపీ ప్రభుత్వం కుట్ర చేస్తోందని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బిజెపి చర్యలన్నీ ఈ కోవలో భాగంగానే సాగుతున్నాయని అన్నారు. శనివారం గాంధీభవన్‌లో క్విట్ ఇండియా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జెండా ఎగరవేశారు. క్విట్ బిజెపి నినాదంతోనే దేశానికి రక్ష అన్నారు. అలాగే.. ఎలక్షన్ కమిషన్‌పై ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఇచ్చిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ప్రదర్శించారు. ఈ సమావేశంలో మిగతా 2లో..

## కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ జరగలేదని ప్రమాణం చేయాలి

కేటీఆర్‌కు బండి సంజయ్ సవాల్

తన వ్యాఖ్యలు వెనక్కు తీసుకోనని స్పష్టం చేసిన కేంద్రమంత్రి



**కరీంనగర్(జనంసాక్షి):** ఎప్పటికైనా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ జైలుపాలు కావల్సిందేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. కేసీఆర్, కేటీఆర్ బీఆర్ఎస్ నేతలందరి ఫోన్లు ట్యాప్ చేశారని ఆరోపించారు. సొంత పార్టీ నేతలపై కేసీఆర్‌కు నమ్మకం లేదన్నారు. తాను నోటీసులు ఇచ్చుకుంటూ పోతే.. తండ్రీ కొడుకులు ఇద్దరూ జీవితాంతం జైల్లోనే ఉంటారంటూ మండిపడ్డారు. మావోయిస్టు సానుభూతిపరులమంటూ తన పేరును, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేరును పోలీసుల లిస్టులో చేర్చారని చెప్పారు. శనివారం కరీంనగర్‌లో ఆయన మీడియాతో మిగతా 2లో..

## బండికి కేటీఆర్ లీగల్ నోటీసులు

48 గంటల్లో క్షమాపణ చెప్పకుంటే కోర్టుకు ఈడుస్తానని హెచ్చరిక

చవకబారు పబ్లిసిటీ కోసం, మీడియా దృష్టిని ఆకర్షించడానికే అడ్డగోలు మాటలని ఆగ్రహం



**హైదరాబాద్(జనంసాక్షి):**ఫోన్ ట్యాపింగ్ అంశంపై నిరాధార ఆరోపణలు చేస్తూ అన్ని హద్దులు దాటిన కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర స్థాయిలో స్పందించారు. మినిమం కామన్ సెన్స్ లేకుండా, వాస్తవాలు తెలుసుకోకుండా, అసంబద్ధమైన, దిగజారుడు, థర్డ్‌క్లాస్ స్థాయి ఆరోపణలు చేయడం బండి సంజయ్ అలవాటుగా మార్చుకున్నారని కేటీఆర్ మండిపడ్డారు. రాజకీయాల్లో చవకబారు పబ్లిసిటీ కోసం, మీడియా దృష్టిని ఆకర్షించడానికే ఈ అడ్డగోలు మాటలు మాట్లాడుతున్నారన్నారు. కేంద్ర మంత్రిగా ఉన్న బండి సంజయ్‌కు నిఘా వ్యవస్థల పనితీరు, విధానాలపై కనీస అవగాహన, పరిజ్ఞానం, ఇంగిత మిగతా 2లో..




## గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌గా
# హైదరాబాద్

'ఈయాప్‌సిస్' ప్రారంభోత్సంలో మంత్రి శ్రీధర్‌బాబు

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రపంచ సాంకేతిక, ఇన్నోవేషన్ కేంద్రంగా హైదరాబాద్ స్థానం మరింత బలపడిందని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. హైదరాబాద్ 'ఈయాప్‌సిస్' సంస్థ విస్తరించిన మిగతా 2లో..

## ట్రంప్, పుతిన్ భేటీ
# 15న



- అమెరికా, రష్యా అధ్యక్షుల మధ్య కీలక సమావేశం
- ఉక్రెయిన్ యుద్ధం ముగింపుపై చర్చించే అవకాశం
- భేటీని స్వాగతించిన భారత విదేశాంగ శాఖ
- భారత్‌కు సుంకాల ఊరట లభించే అవకాశం

**న్యూఢిల్లీ,ఆగస్ట్9(జనంసాక్షి):**ప్రపంచ రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శిఖరాగ్ర సమావేశం జరగనుంది. ఆగస్ట్ 15న అలస్కాలో ఈ భేటీ జరగనున్నట్లు ట్రంప్ స్వయంగా ప్రకటించారు. గత కొంతకాలంగా ఉద్రిక్తంగా ఉన్న ఉక్రెయిన్ యుద్ధానికి ఈ సమావేశం ఒక ముగింపు పలుకుతుందని ప్రపంచ దేశాలు ఆశిస్తున్నాయి. గత మూడు రోజులుగా చోటుచేసుకున్న వేగవంతమైన పరిణామాల అనంతరం ఈ భేటీ ఖరారైంది. "ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న సమావేశం ఆగస్ట్ 15, శుక్రవారం నాడు అలస్కాలో జరుగుతుంది" అని ట్రంప్ తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్'లో వెల్లడించారు. ఈ సమావేశం భారత్‌కు కూడా ఎంతో కీలకం కానుంది. మిగతా 2లో..

## ఆపరేషన్ సిందూర్‌లో
# ఐదు పాక్ జెట్లను కూల్చేశాం

ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్‌ప్రీత్‌సింగ్ వెల్లడి



**ఢిల్లీ(జనంసాక్షి):** ఆపరేషన్ సింధూర్ సందర్భంగా పాకిస్తాన్‌కు చెందిన ఐదు ఫైటర్ జెట్లను కూల్చేశామని ఎయిర్ చీఫ్ మార్షల్ అమర్ ప్రీత్ సింగ్ తెలిపారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ సాయంతో ఐదు పాకిస్తాన్ జెట్లను పేల్చిపడేశాము. ఐదు జెట్లను మాత్రమే కాకుండా.. ఓ భారీ 'ఎయిర్‌బర్న్ ఎర్లీ వార్నింగ్ అండ్ కంట్రోల్ ఎయిర్ క్రాఫ్ట్'ను కూడా కూల్చేశాము. రెండు వైమానిక స్థావరాలు ధ్వంసం చేశాం. మే 9, 10 తేదీల్లో ఆపరేషన్ సిందూర్ నిర్వహించాం. మే 9వ తేదీ రాత్రి ఎక్కువగా పాక్ ఉగ్ర శిబిరాలపై దాడులు చేశాం. డ్రోన్, ఎస్ 400 గగనతల రక్షణ వ్యవస్థ బాగా పనిచేసింది. వారి యుద్ధ విమానాలు భారత గగనతలంలోకి ప్రవేశించకుండా అడ్డుకున్నాం. వాటిని ఎంతో సమర్థవంతంగా కూల్చిపడేశాం. మిగతా 2లో..

## ఒక్క యుద్ధవిమానం కూడా
# దెబ్బతినలేదు

ఇంత ఆలస్యంగా చేసిన వాదనలు నమ్మశక్యంగా లేవు

ఎయిర్ చీఫ్ మార్షల్ వ్యాఖ్యలపై స్పందించిన పాకిస్థాన్



**ఇస్లామాబాద్(జనంసాక్షి):**ఆపరేషన్ సిందూర్ సమయంలో పాక్‌కు చెందిన ఐదు యుద్ధ విమానాలను మన సైన్యం కూల్చేసినట్లు వాయుసేనాధిపతి ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ పేర్కొన్న విషయం తెలిసిందే. దీనిపై పాకిస్థాన్ మరోసారి నోరుపారేసుకుంది. ఉగ్రవాద శిబిరాలను భారత్ నేలమట్టం చేసినప్పటికీ.. తమ సైన్యానికి సంబంధించి ఒక్క విమానం కూడా దెబ్బతినలేదంటూ ప్రపంచం కళ్లకు గంతలు కట్టే మిగతా 2లో..

## భారీ వర్షాలతో ఢిల్లీ
# అతలాకుతలం

గోడకూలిన ఘటనలో 8 మంది మృతి


9 లో..

## ఆధారాలతోనే రాహుల్ ఆరోపణలు

లేకపోయినా, దేశవ్యాప్తంగా పద్ధతిగా జరిగే ఎన్నికల మీద ఇలాంటి అంశాలు ప్రభావం చూపుతాయని ఆయన హెచ్చరించారు. రాహుల్ గాంధీ ఈ విషయాలను ప్రస్తావించే ముందు స్పష్టమైన అధ్యయనం చేశారని పవార్ పేర్కొన్నారు. ఈ విషయాన్ని ఎన్నికల సంఘం సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేయాల్సిన అవసరం ఉందన్నారు. దీంతోపాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇండియాపై తిరిగి 25% నుంచి 50% వరకు దిగుమతి సుంకాలు పెంచే ప్రతిపాదన చేయడం పట్ల శరద్ పవార్ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది భారత్‌పై ఒత్తిడి తేవాలనే ప్రయత్నం అని ఆయన పేర్కొన్నారు. విదేశాంగ విధానాల్లో మన దేశం ప్రస్తుతం ఎదుర్కొంటున్న సమస్యలపై కూడా ఆయన స్వరం పెంచారు. పాకిస్తాన్ శత్రువుగా మారింది, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంకతో సంబంధాలు అంత మంచిగా లేవన్నారు. మనం ఈ సంబంధాలను మెరుగుపరచుకోవాలన్నారు. ప్రధాని మోదీ ఈ విషయాలను పట్టించుకోవాలని పవార్ హితవు పలికారు. అజిత్ పవార్‌తో శరద్ పవార్ కలిసి కనిపించడం, ప్రత్యేకించి కుటుంబ వేడుకల్లో కలిసి కనిపించడం రాజకీయంగా కొత్త చర్చకు తావిచ్చింది. ఇటీవల ముంబైలో జరిగిన యుగేంద్ర పవార్ నిశ్చితార్థ వేడుకల్లో శరద్ పవార్, అజిత్ పవార్ ఇద్దరూ కలిసి పాల్గొన్నారు. దీంతో శివసేన బీజేపీ కూటమికి శరద్ పవార్ మద్దతు ఇవ్వబోతున్నారా? అనే చర్చ మొదలైంది. కానీ శరద్ పవార్ తన పాత ధోరణి గురించి స్పష్టం చేశారు. బీజేపీకి ఎప్పటికీ మద్దతు ఇవ్వనని, రాజకీయాల్లో తన సిద్ధాంతాలకే కట్టుబడి ఉంటానని మరోసారి గుర్తు చేశారు.

## రాష్ట్రంలో ఎన్టీపీసీ భారీ పెట్టుబడులు

రాష్ట్రంలో 6,700 మెగావాట్ల ఫ్లోటింగ్ సోలార్ ఉత్పత్తి అవకాశం ఉందని సీఎంకు ఎన్టీపీసీ బృందం తెలిపింది. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అన్ని విధాలా సహకరిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఇచ్చారు.

## కుటుంబ సభ్యుల ఫోన్ ట్యాపింగ్ జరగలేదని ప్రమాణం చేయాలి

మాట్లాడుతూ.. 'బీఆర్ఎస్ నేతలకు సిగ్గుంటే పార్టీ నుంచి బయటకు రావాలన్నారు. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌పై అసెంబ్లీలో చర్చ ఎందుకు జరపడం లేదు?. ఫోన్ ట్యాపింగ్ కేసును సీబీఐ ఇస్తే కొల్లిక్కి వస్తుందని పేర్కొన్నారు. రాధాకిషన్ వాంగ్మూలంలో కేసీఆర్ పేరు ఉందని, కానీ విచారణ కోసం కేసీఆర్‌ను ఎందుకు పిలవడం లేదని ప్రశ్నించారు. నేను కూడా కుటుంబ సభ్యులపై ప్రమాణం చేస్తా. ఏ గుడికి రమ్మంటారో టైమ్, డేట్ చెప్పాలని సవాల్ విసిరారు. కేటీఆర్ లీగల్ నోటీసులకు నేను భయపడను' అని అన్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో బండి సంజయ్ చేసిన ఆరోపణలను కేటీఆర్ ఖండించారు. తాజాగా, బండి సంజయ్‌కి లీగల్ నోటీసు పంపించారు. రాబోయే 48 గంటల్లో తనపై చేసిన ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎక్స్ వేదికగా కేటీఆర్ డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రికి కనీస సాధారణ జ్ఞానం కూడా లేదని తీవ్ర వ్యాఖ్యలు చేశారు. బండి సంజయ్ నిర్లక్ష్యపు ప్రకటనలు హద్దులు దాటాయన్నారు.

## బండికి కేటీఆర్ లీగల్‌నోటీసులు

జ్ఞానం కూడా లేదని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బాధ్యత గల పదవిలో ఉండి ఇంత బేస్‌లెస్ ఆరోపణలు చేయడం ఆయన అజ్ఞానం, నిర్లక్ష్యానికి నిదర్శనమని అన్నారు. "కేంద్ర మంత్రిగా పనిచేయడం అంటే ఢిల్లీ బాసులకు చెప్పులు మోసినంత ఈజీ కాదని బండి సంజయ్ ఇప్పటికైనా గ్రహించాలి" అని ఎద్దేవా చేశారు. ఫోన్ ట్యాపింగ్ అంశంపై మాట్లాడిన ప్రతిసారి బండి సంజయ్ మరింత దిగజారుతున్నారని, తప్పుడు ప్రచారంతో ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారని కేటీఆర్ ధ్వజమెత్తారు. "రాజకీయాల్లో పెద్ద జోకర్‌గా మారిన బండి సంజయ్ మీడియా హెడ్లైన్ల కోసం, చీప్ పబ్లిసిటీ కోసం, వీధి నాటకాలు ఆడుతున్నాడు" అని ఘాటుగా విమర్శించారు. బండి సంజయ్ ఆరోపణల్లో ఒక్క శాతం నిజం ఉన్నా నిరూపించాలని కేటీఆర్ సవాల్ విసిరారు. తక్షణమే ఆ ఆరోపణలను ఉపసంహరించుకుని బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బండి సంజయ్ చేసిన ఆరోపణల పైన లీగల్ నోటీసు పంపిస్తున్నట్లు కేటీఆర్ తెలిపారు. ఈ డిమాండ్‌ను పట్టించుకోకపోతే, 48 గంటల గడువు తర్వాత కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు. ఫోన్ ట్యాపింగ్ అనే అంశం ఎంత సున్నితమైనదో, చట్టపరంగా ఎంత కఠినమైనదో కేంద్ర మంత్రి బండి సంజయ్‌కు తెలవకుండానే, కావాలనే వాస్తవాలను వక్రీకరిస్తూ, సాక్ష్యం లేకుండా ఆరోపణలు చేయడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. "తప్పుడు ఆరోపణలు, బజారు స్థాయి మాటలు, చవకబారు పబ్లిసిటీ కోసం చెప్పే అబద్ధాలు %-% ఇవన్నీ బండి సంజయ్ కు అలవాటు అయిన రాజకీయాలని, ఇక పైన ఇలాంటి చౌకబారు ఆరోపణలను సహించేది లేదని కేటీఆర్ ఘాటుగా హెచ్చరించారు.

## అది ఆక్రమణ కాదు..విముక్తి

### గాజా పూర్తి ఆక్రమణపై నెతన్యాహు స్పష్టత

టెల్‌అవీవ్(జనంసాక్షి):గాజాను పూర్తిగా స్వాధీనం చేసుకునే ప్రతిపాదనను ఇజ్రాయెల్ క్యాబినెట్ ఆమోదించిన సంగతి తెలిసిందే. దాదాపు 22 నెలలుగా కొనసాగుతున్న యుద్ధంలో ఇదో కీలక మలుపుగా మారనుంది. అయితే, టెల్‌అవీవ్ నిర్ణయంపై విదేశీ నేతలతోపాటు స్వదేశీ నేతల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమయ్యాయి. ఈక్రమంలో తమ ప్రణాళిక గురించి ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు స్పష్టతనిచ్చే ప్రయత్నం చేశారు. గాజాను ఆక్రమించాలనేది తమ ప్రణాళిక కాదని నెతన్యాహు ఎక్స్‌లో పోస్టు చేశారు. హమాస్ నుంచి దానికి విముక్తి ప్రసాదించనున్నాం అని స్పష్టం చేశారు. ఆ ప్రాంతంలో సైనిక కార్యకలాపాలు జరగకుండా చేస్తామన్నారు. శాంతియుత పౌర పరిపాలన ఏర్పాటుకు కట్టుబడి ఉన్నట్లు వెల్లడించారు. పాలస్తీనా, హమాస్ సహా మరే ఇతర ఉగ్రసంస్థలతో కూడిన పరిపాలన ఆ ప్రాంతంలో ఉండదన్నారు. ఈ చర్య హమాస్ చెరలో బందీలుగా ఉన్న తమవారిని విడిపించడంలో సహాయపడుతుందన్నారు. అంతేకాక.. భవిష్యత్తులో గాజా నుంచి కుడా తమ దేశానికి ఏ ముప్పు రాకుండా ఉంటుందని వ్యాఖ్యానించారు. గాజాతో యుద్ధం ముగించడానికి ఐదు సూత్రాలతో కూడిన ప్రణాళికను ఇజ్రాయెల్ భద్రతా క్యాబినెట్ ఆమోదించింది. ఈ నిర్ణయాన్ని బ్రిటన్, చైనా, సౌదీ ఆస్ట్రేలియా, బెల్జియంతో సహా అనేక దేశాలు ఖండించాయి.

# 2025-30 పర్యాటక పాలసీ అమలుకు రూట్ మ్యాప్

కలసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ సంవత్సరం మార్చి 17 నుండి అమలులోకి వచ్చిన 2025-2030 పర్యాటక రంగం పాలసీని అమలు పరచి అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణా రాష్ట్రాన్ని టాప్ 5 లో ఉంచడమే తమ ముందున్న లక్ష్యమని ఆయన చెప్పారు. ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడడంతో పాటు పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహించడం ఈ పాలసీలో భాగమని ఆయన తెలిపారు. ప్రస్తుతం గుర్తింపు పొందిన పర్యాటక స్థలాలలో మౌలిక సదుపాయాలను వృద్ధి చేయడం, జలపాతాలు, ఆధ్యాత్మిక కేంద్రాలు, వారసత్వంగా గుర్తింపు పొందిన ప్రాంతాలు, ఏకోటూరిజం కేంద్రాలు, వెల్నెస్ కేంద్రాలతో పాటు క్రాఫ్ట్ గ్రామాలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. ఇవి గాక మరో 27 ప్రాంతాల్లో పర్యాటక కేంద్రాల ఏర్పాటుకు రూట్ మ్యాప్ రూపొందించినట్లు ఆయన వెల్లడించారు. రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం సమీపంలో తెలంగాణాకు తలమానికంగా నిలిచిపోయేలా ప్రతిష్టాత్మక ప్రాజెక్టు, పాటు ప్రాంతీయ రింగ్ రోడ్ల వెంట డ్రై పోర్టులు, గోదావరి, కృష్ణా నదులపై రివర్ బెస్ట్ టూరిజం, నగరాలలో వాటర్ ఫ్రంట్ హబ్ లు వంటి ప్రత్యేకతలతో కూడిన పర్యాటక కేంద్రాలను రూపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోందన్నారు దేశీయ, అంతర్జాతీయ ట్రావెల్ సంస్థలు కుటుంబ సభ్యులతో నిర్వహించే యాత్రలకు తెలంగాణా రాష్ట్రం కేంద్రంగా నిలిచేలా పాలసి రూపొందించబడిందన్నారు. పర్యాటక కేంద్రాలను వేగవంతంగా పూర్తి చేసేందుకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందించడమే కాకుండా అంతర్జాతీయ స్థాయిలో పర్యాటక కేంద్రాల ప్రాముఖ్యతను వివరించి ప్రపంచస్థాయిలో నిలబడేలా చేయడం ప్రభుత్వ సంకల్పమన్నారు. అందుకు గాను పతిష్టమైన పర్యాటక కార్యవర్గాన్ని నియమించి డెస్టినేషన్ మేనేజ్మెంట్ బోర్డు ఏర్పాటుకు ప్రభుత్వం ప్రతిపాదించిందన్నారు. సదరన్ ట్రావెల్స్ గురించి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భారతదేశంలో అత్యంత నమ్మకమైన నెట్ వర్క్ కలిగి ఉండి యాత్రికుల మన్ననలు పొందిన సంస్థగా పేరొందినదన్నారు. అటువంటి సంస్థ హైదరాబాద్ కేంద్రంగా ప్రాంతీయ కార్యాలయాన్ని ప్రారంభించడం శుభపరిణామంగా ఆయన అభివర్ణించారు. రాష్ట్ర పర్యాటక రంగ అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. తాను రాష్ట్రపతి భవన్‌లో పనిచేస్తున్నపుడు ఈ సంస్థను దగ్గర ఉండి చూషనన్నారు. ఇప్పటికే ఢిల్లీ, జైపూర్, అమరావతి లలో కార్యకలాపాలు నిర్వహి స్తున్న ఈ సంస్థ హైదరాబాద్ లో ప్రాంతీయ కార్యాలయం ప్రారంభించడం ద్వారా రాష్ట్రంలో ప్రసిద్ధి చెందిన నాగార్జునసాగర్, రామప్ప, లక్నవరం వంటి పర్యాటక కేంద్రాల ప్రమోషన్ కు ఉపకరిస్తుందన్నారు. పర్యాటక రంగంలో అభివృద్ధికి గాను రూపొందించిన పాలసీలో సదరన్ ట్రావెల్స్ భాగస్వామ్యం కావాలని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిర్వాహకులకు సూచించారు.

# గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్ హైదరాబాద్



గ్లోబల్ ఇన్నోవేషన్ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. సర్వీస్ ఆధారిత కంపెనీలు నడపడం తేలిక కానీ, ప్రొడక్టు ఆధారిత కంపెనీలు ఎక్కువ సవాళ్లను ఎదుర్కొంటాయని అన్నారు. టెక్‌హబ్‌గా హైదరాబాద్‌కు పెరుగుతున్న గుర్తింపు ప్రశంసనీయమన్నారు. సాఫ్ట్‌వేర్‌ప్రొడక్ట్స్ ఎగుమతుల్లో తెలంగాణను అగ్రస్థానంలో ఉంచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని హామీ ఇచ్చారు. కంపెనీలు యూనికార్న్ స్థాయిని సాధించే లక్ష్యంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. ఏఐ సాంకేతికత ప్రభావాన్ని ఆయన వివరించారు. విద్యార్థులు, వృత్తి నిపుణుల కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోర్సులను, ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయనున్నట్లుగా ఆయన ప్రకటించారు. గతంలో మూడు మాత్రమే ఉన్న యూనికార్న్?లు ఇప్పుడు హైదరాబాద్‌లో 30%-%40కి పెరిగాయని ఆయన గుర్తుచేశారు. 400 ఉన్న ఈ కొత్త కార్యాలయం సామర్థ్యం భవిష్యత్తులో 4%-%6 రెట్లు పెరిగి రాష్ట్రం, నగరానికి మరింత గుర్తింపును తెస్తుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. యూకే ప్రధాన కేంద్రంగా ఉన్న ఈ గ్లోబల్ ఒరాకిల్ భాగస్వామి, ఐటీ సేవల సంస్థ, హైదరాబాద్‌లో ప్రస్తుతం ఉన్న 200 మంది సిబ్బందిని వచ్చే రెండు సంవత్సరాల్లో 500 మందికి పైగా పెంచాలని ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ విస్తరణలో భాగంగా అత్యాధునిక 400 సీట్ల సామర్థ్యంతో కూడిన కొత్త సౌకర్యాన్ని గ్లోబల్ డెలివరీ సెంటర్‌లో జోడించడం ద్వారా, హైదరాబాద్‌ను ఒరాకిల్ క్లౌడ్, ఈఆర్పీ, ఏఐ ఎంటర్‌ప్రైజ్ ట్రాన్స్‌ఫర్మేషన్ సర్వీసులకు వ్యూహాత్మక కేంద్రంగా మరింత బలపడనుంది. ఈ ఎన్నోవేషన్ సెంటర్ తమ ప్రయాణంలో ఒక పెద్ద మైలురాయి అని ఛైర్మన్ ప్రవీణ్‌రెడ్డి బద్దం అన్నారు. ఇది తమకు, గ్లోబల్ కస్టమర్లకు మరింత సమర్థవంతగా మద్దతు ఇవ్వడమే కాకుండా, కొత్త సాంకేతికతతో ముందుకు వెళ్లేందుకు అవకాశం కల్పిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కొత్త సెంటర్ ద్వారా ఒరాకిల్ క్లౌడ్/ఈఆర్పీ కన్సల్టెంట్లు, ఏఐ/ఎంఎల్ ఇంజినీర్లు, సొల్యూషన్ ఆర్కిటెక్టులు, ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టులు లాంటి వందలాది అధిక నైపుణ్యాల ఉద్యోగాల కల్పనకు అవకాశం ఏర్పడుతుంది. స్థానికంగా ఉన్న యువతను మరింత అభివృద్ధి చెందించేందుకు, ఈ ప్రాంత టెక్నాలజీ ఎకోసిస్టమ్‌ను బలోపేతం చేసేందుకు అప్స్కిల్లింగ్ ప్రోగ్రామ్‌లలో కూడా పెట్టుబడులు పెడుతోంది.

## పదవీకాలం ముగిసింది.. జోక్యం చేసుకోలేం

ఆది శ్రీనివాస్ తరఫున సీనియర్ న్యాయవాది గౌరవ్ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ, రమేశ్ దేశాన్ని మోసం చేసినట్లు హైకోర్టు గుర్తించినప్పటికీ ఆయన ఇప్పటికీ పింఛనుతో సహా ఇతర శాసనసభ ప్రయోజనాలను పొందుతున్నారని కోర్టు దృష్టికి తెచ్చారు. అయితే, సుప్రీంకోర్టు ఈ వాదనలను పరిగణనలోకి తీసుకోలేదు. చెన్నమనేని రమేశ్ జర్మన్ పౌరసత్వం కలిగి ఉండి, ఆ విషయాన్ని దాచిపెట్టి ఎన్నికల్లో పోటీ చేశారని ఆరోపిస్తూ ఆది శ్రీనివాస్ 2019లో హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై విచారణ జరిపిన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, నిబంధనలు పాటించలేదన్న కారణంతో 2019 నవంబరులో రమేశ్ భారత పౌరసత్వాన్ని రద్దు చేసింది. కేంద్రం నిర్ణయాన్ని సవాలు చేస్తూ రమేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై సుదీర్ఘ విచారణ జరిపిన తెలంగాణ హైకోర్టు, 2024 నవంబర్ 6న కీలక తీర్పు వెలువరించింది. రమేశ్ జర్మన్ పౌరుడేనని నిర్ధారిస్తూ, భవిష్యత్తులో ఎన్నికల్లో పోటీ చేయడానికి, ప్రజా పదవులు చేపట్టడానికి అనర్హుడిగా ప్రకటించింది. 15 ఏళ్లుగా కోర్టును తప్పుదోవ పట్టించినందుకు ఆయనకు రూ. 30 లక్షల జరిమానా కూడా విధించింది. ఇందులో రూ. 25 లక్షలు ఆది శ్రీనివాస్‌కు, రూ. 5 లక్షలు లీగల్ సర్వీసెస్ అథారిటీకి చెల్లించాలని ఆదేశించగా, రమేశ్ ఆ మొత్తాన్ని ఈ ఏడాది ఏప్రిల్‌లో చెల్లించారు. 2009 నుంచి 2018 వరకు జరిగిన నాలుగు ఎన్నికల్లోనూ రమేశ్ గెలుపొందగా, ఆది శ్రీనివాస్ రెండో స్థానంలో నిలిచారు. రమేశ్‌ను అనర్హుడిగా ప్రకటించినందున, ఆ పదవీకాలాలకు తనను ఎమ్మెల్యేగా ప్రకటించాలని శ్రీనివాస్ కోరారు. అయితే హైకోర్టు దీనిపై ఎలాంటి ఆదేశాలు ఇవ్వకపోవడంతో ఆయన సుప్రీంకోర్టును ఆశ్రయించారు. తాజాగా సుప్రీంకోర్టు కూడా ఆయన అభ్యర్థనను తిరస్కరించడంతో ఈ వివాదానికి తెరపడినట్లయింది. కాగా, 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ రమేశ్‌కు టికెట్ నిరాకరించగా, వేములవాడ కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన ఆది శ్రీనివాస్ విజయం సాధించారు.

## 334 రాజకీయ పార్టీలకు ఈసీ ఝులక్

ఐదు పార్టీలు, తెలంగాణలో 13 పార్టీలపై ఎన్నికల సంఘం వేటు వేసింది. కాగా, నిబంధనల ప్రకారం.. కేంద్ర ఎన్నికల సంఘం వద్ద నమోదైన రాజకీయ పార్టీలు ఆరేళ్లలో కనీసం ఒక్క ఎన్నికలోనైనా పోటీ చేయాల్సి ఉంటుంది. కానీ ఈ పార్టీలు 2019 నుంచి ఒక్క ఎన్నికలోనూ పోటీ చేయకపోవడంతో ఈసీ షాక్ ఇచ్చింది. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలకు చెందిన 334 పార్టీలను జాబితా నుంచి తొలగించినట్లు ఎన్నికల సంఘం వెల్లడించింది. పేరుకు మాత్రమే పార్టీలు పెట్టినప్పటికీ.. వీటికి ఎలాంటి కార్యాలయాలు లేవంటూ ఈసీ పేర్కొంది. ఇప్పటివరకు దేశంలో 2,854 గుర్తింపు పొందని పార్టీలు ఈసీ వద్ద రిజిస్టర్ అవ్వగా.. తాజా నిర్ణయంతో ఆ సంఖ్య 2,520కి తగ్గిపోయింది. ఎన్నికల సంఘం వద్ద ఉన్న డేటా ప్రకారం.. ప్రస్తుతం దేశంలో ఆరు జాతీయ పార్టీలుగా కొనసాగుతుండగా.. 67 ప్రాంతీయ పార్టీలు మనుగడలో ఉన్నాయి.

## ఆపరేషన్ సిందూర్‌లో ఐదు పాక్ జెట్లను కూల్చేశాం

ఆపరేషన్ సింధూర్‌తో పాక్‌కు స్పష్టమైన సందేశమిచ్చాం' అని ఆయన అన్నారు. కాగా, ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకాశ్మీర్, పహల్గామ్‌లోని బైసరన్ లోయలో ఉగ్రవాదులు కాల్పులకు తెగబడ్డారు. అమాయక పర్యాటకులను కాల్చి చంపారు. 26 మందిని బలి తీసుకున్నారు. పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతిగా భారత్ 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్తాన్, పాకిస్తాన్ ఆక్రమిత కాశ్మీర్‌లోని 9 ఉగ్రవాద స్థావరాలపై వైమానిక దాడులు చేసింది. దీంతో 100 మంది ఉగ్రవాదులు ప్రాణాలు పోగొట్టుకున్నారు. ఉగ్రవాదులు పెద్ద సంఖ్యలో ప్రాణాలు పోగొట్టుకోవటంతో పాక్ తట్టుకోలేకపోయింది. యుద్ధానికి దిగింది. యుద్ధంలో భారీ ఎత్తున నష్టపోయింది. చివరకు తోకముడిచింది.

## ఒక్క యుద్ధవిమానం కూడా దెబ్బతినలేదు

ప్రయత్నం చేసింది. "భారత్ చేసిన దాడుల్లో పాకిస్థాన్‌కు చెందిన ఒక్క యుద్ధ విమానం కూడా దెబ్బతినలేదు. మేం అంతర్జాతీయ మీడియాకు వివరాలు వెల్లడించాం. మూడు నెలలుగా ఎలాంటి వాదనలు లేవు. ఇంత ఆలస్యంగా చేసిన వాదనలు నమ్మశక్యంగా లేవు" అని పాక్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ పేర్కొన్నారు. బెంగళూరులో జరిగిన ఓ కార్యక్రమంలో ఎయిర్ చీఫ్ మార్షల్ ఏపీ సింగ్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్ సమయంలో మన గగనతల రక్షణ వ్యవస్థ, ఎస్-400 క్షిపణి వ్యవస్థలు సమర్థంగా పనిచేశాయని అన్నారు. పాక్ ప్రధాన ఎయిర్‌ఫీల్డ్‌లలో షహబాజ్ జకోబాబాద్ స్థావరం సగానికి పైగా దెబ్బతిందని.. కనీసం ఐదు యుద్ధ విమానాలు తీవ్రంగా దెబ్బతిన్నాయనే అంచనాకు వచ్చామని ఏపీ సింగ్ వెల్లడించారు. పక్కా ప్రణాళికతో ఆపరేషన్‌ను నిర్వహించామని, కేవలం 80-90 గంటల్లోనే లక్ష్యాలను సాధించామన్నారు. యుద్ధం ఇలాగే కొనసాగితే భారీ మూల్యం తప్పదని దాయాదికి అర్థమైందని, అందుకే కాళ్లబేరానికి వచ్చారన్నారు.

# రాజ్యాంగం మార్చాలని బీజేపీ కుట్ర



టీ-పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, పాల్గొన్నారు. మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. స్వాతంత్య్ర ఉద్యమం ఏ విధంగా జరిగిందో నేటి యువత తెలుసుకోవాలని మహేష్ కుమార్ గౌడ్ సూచించారు. 1942లో బ్రిటీ-ష్ పాలకులను తరిమి కొట్టాలని అనేక ఉద్యమాలు జరిగినప్పటికీ క్విట్ ఇండియా ఉద్యమం కీలకమైనదని ఉద్ఘాటించారు. డూ ఆర్ డై నినాదంతో మహాత్మా గాంధీ క్విట్ ఇండియా ఉద్యమం చేశారని కొనియాడారు. నేడు అధికారంలో ఉన్న బీజేపీ.. కాంగ్రెస్ చరిత్రను తుడిచివేయాలని చూస్తోందని ధ్వజమెత్తారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్.. నెహ్రూ, సర్దార్, సుభాష్ చంద్రబోస్ లాంటి నేతలను చరిత్రలో లేకుండా చేద్దామని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు.

**ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర**

ఏఐసీసీ ఆదేశాల మేరకే జనహిత పాదయాత్ర చేస్తున్నామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. ఈ పాదయాత్రకు పెద్దఎత్తున స్పందన వచ్చిందన్నారు. ప్రజలు కూడా నేరుగా వచ్చి కలుస్తున్నారని అన్నారు. గాంధీభవన్‌లో మీడియాతో చిట్‌చాట్‌లో ఆయన మాట్లాడారు. ప్రతినెల కొన్ని నియోజకవర్గాల్లో జనహిత పాదయాత్ర చేస్తానన్నారు. ఈ నెల చివరి వారంలో దీనికి రెండో దశ ఉంటుందని పేర్కొన్నారు. అనివార్య కారణాల వల్ల ఢిల్లీ ధర్నాకు ఖర్గే, రాహుల్ గాంధీ రాలేకపోయారని తెలిపారు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై ఏఐసీసీ పరిశీలన చేస్తోంది. కొండా మురళి వ్యవహారం త్వరలో ముగిసిపోతుంది. అనిరుద్‌రెడ్డికి షోకాజ్ నోటీసు ఇచ్చారు.. వివరణ కూడా తీసుకున్నాం. బీసీ రిజర్వేషన్ల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. బీసీల కోరిక న్యాయబద్ధమైన్నారు

## రిజర్వేషన్లపై కావాలనే బీజేపీ రాద్ధాంతం

హైదరాబాద్(జనంసాక్షి):బీసీల రిజర్వేషన్లపై బీజేపీ పార్టీ కావాలనే రాద్ధాంతం చేస్తుందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు. తెలంగాణ హైకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే స్థానిక ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. ముస్లిం రిజర్వేషన్ల అంశాన్ని తమ ప్రభుత్వం ఎక్కడా పేర్కొనలేదని స్పష్టంచేశారు. రాష్ట్ర అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్ల బిల్లు పెట్టినప్పుడు బీజేపీ నేతలు మద్దతు ఇచ్చారని గుర్తుచేశారు. ఇప్పుడు కావాలనే బీజేపీ నేతలు రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు.. రాష్ట్ర, దేశ ప్రజలకు రాఖీ పౌర్ణమి సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. శనివారం మినిస్టర్ క్వార్టర్స్‌లో వారి సోదరులకు మంత్రి సీతక్క రాఖీ కట్టారు. ఈ సందర్భంగా సీతక్కకు మంత్రి పొన్నం చీరను బహూకరించారు. సీతక్క నుంచి పొన్నం ప్రభాకర్ ఆశీర్వాదం తీసుకున్నారు. సీతక్కకు పొన్నం ప్రభాకర్ సోదరులు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే, రాఖీ పర్వదినం సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి మంత్రులు సీతక్క, కొండా సురేఖ రాఖీ కట్టారు. మినిస్టర్ క్వార్టర్స్‌లో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మంత్రి సీతక్క రాఖీ కట్టారు. సోదరి సీతక్క అంటూ ఆత్మీయంగా పలకరించి ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు బంజారాహిల్స్ మినిస్టర్ క్వార్టర్స్‌లో మంత్రి శ్రీధర్ బాబుకి మంథని నియోజకవర్గ మహిళలు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు.

## ట్రంప్, పుతిన్ భేటీ 15న

రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నందుకు వాషింగ్టన్, భారత్‌పై విధించిన 25 శాతం అదనపు సుంకాల భవిష్యత్తు ఈ భేటీతో తేలే అవకాశం ఉంది. ఈ పరిణామాన్ని భారత్ మనస్ఫూర్తిగా స్వాగతించింది. అమెరికా, రష్యా మధ్య కుదిరిన ఈ అవగాహనను అభినందిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ ఒక ప్రకటన విడుదల చేసింది. "ఈ సమావేశం ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికి, శాంతికి అవకాశాలు కల్పిస్తుందని ఆశిస్తున్నాం. ప్రధాని నరేంద్ర మోదీ అనేకసార్లు చెప్పినట్లుగా 'ఇది యుద్ధాల యుగం కాదు'" అని విదేశాంగ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ పేర్కొన్నారు. ఈ శాంతి ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని ఆయన స్పష్టం చేశారు. శిఖరాగ్ర సమావేశానికి ముందు రష్యా అధ్యక్షుడు పుతిన్, ప్రధాని నరేంద్ర మోదీతో శుక్రవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. ఉక్రెయిన్ అంశంపై అమెరికాతో జరిగిన చర్చల వివరాలను ఆయన మోదీకి వివరిం చారు. భారత్-రష్యా మధ్య ఉన్న ప్రత్యేక భాగస్వామ్యం దృష్ట్యా, అమెరికా అధ్యక్షుడి ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్‌తో జరిగిన సమావేశంలోని కీలక అంశాలను పుతిన్ పంచుకున్నారని రష్యా అధ్యక్ష కార్యాలయం తెలిపింది. పుతిన్ అందించిన వివరాలకు ధన్యవాదాలు తెలిపిన ప్రధాని మోదీ, వివాదానికి శాంతియుత పరిష్కారం కనుగొనాలన్నదే భారత్ స్థిరమైన వైఖరి అని పునరుద్ఘాటించారు. ఈ సమావేశానికి ట్రంప్ ప్రత్యేక దూత స్టీవెన్ విట్కాఫ్, పుతిన్‌తో మాస్కోలో జరిపిన చర్చలే పునాది వేశాయి. ఈ చర్చల అనంతరం ట్రంప్ మాట్లాడుతూ, పుతిన్‌తో సానుకూల చర్చలు జరిగాయని, శాంతి నెలకొనేందుకు మంచి అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేశారు. "ఇరు దేశాల ప్రయోజనాల కోసం కొన్ని భూభాగాల మార్పిడి కూడా ఉండొచ్చు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు

## ఉక్రెయిన్ ఉనికి దెబ్బతీసే చర్చలను ఆమోదించబోం

- శాంతి కోసం భూభాగాన్ని వదులుకోం
- ట్రంప్ వ్యాఖ్యలపై జెలెన్‌స్కీ మండిపాటు

**కీవ్(జనంసాక్షి):**మూడున్నరేళ్లకు పైగా కొనసాగుతోన్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తెర పడేలా చేసేందుకు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ శతవిధాలా ప్రయత్నిస్తున్నారు. ఇందులో భాగంగానే వచ్చేవారం రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో భేటీకి సిద్ధమవుతున్న ఆయన.. శాంతి ఒప్పందంలో భూభాగాల మార్పిడి ఉంటుందనే సంకేతాలిచ్చారు. అయితే దీన్ని ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ తోసిపుచ్చారు. శాంతి కోసం భూభాగాన్ని వదులుకోబోమని తేల్చిచెప్పారు. ఆగస్టు 15న అలస్కా వేదికగా పుతిన్‌తో భేటీ కానున్నట్లు ట్రంప్ తన ట్రూత్ ఖాతాలో వెల్లడించారు. దీనిపై తాజాగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రష్యా, ఉక్రెయిన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదురుతుందని ఆశాభావం వ్యక్తంచేశారు. "అందుకు (శాంతి ఒప్పందం కోసం) కొన్ని భూభాగాలు వెనక్కి తీసుకోవడం, మార్చుకోవడం జరుగుతుంది. ఇరుపక్షాలకు మేలు జరిగేలా ఈ భూభాగాల మార్పిడి ఉంటుంది" అని ట్రంప్ వెల్లడించారు.



అయితే, ఏయే ప్రాంతాలను మార్చుకుంటారు? ఎవరు ఏ భూభాగాలను తీసుకుంటారు? అనే వివరాలను ఆయన చెప్పలేదు. వాస్తవానికి అలస్కాలో పుతిన్, జెలెన్‌స్కీతో త్రైపాక్షిక భేటీ నిర్వహించాలని ట్రంప్ భావించారు. ఇటీవల యూఎస్ ప్రత్యేక రాయబారి స్టీవ్ విట్‌కాఫ్ రష్యా పర్యటన సమయంలోనూ ఇదే విషయాన్ని ప్రతిపాదించారు. కానీ, దీనిపై క్రెమ్లిన్ నుంచి ఏ స్పందన రాలేదని సమాచారం. దీంతో తొలుత పుతిన్‌తో ద్వైపాక్షిక భేటీ జరిపి కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పించాలని ట్రంప్ యోచిస్తున్నట్లు తెలుస్తోంది.

**అవి ఫలితం లేని చర్చలే: జెలెన్‌స్కీ**

ట్రంప్-పుతిన్ భేటీ వార్తలపై ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ స్పందిస్తూ ఆగ్రహం వ్యక్తం చేశారు. "ఉక్రెయిన్ ప్రాదేశిక సమగ్రతను దెబ్బతీసే చర్చలను ఆమోదించబోం. శాంతి స్థాపన కోసం నిర్వహించే సమావేశాల్లో మా గళాన్ని వినిపించాల్సిందే. అంతేగానీ, ఆక్రమణదారులకు ఉదారంగా మా భూభాగాన్ని వదులుకోలేం. ఉక్రెయిన్ లేకుండా జరిపే చర్చల్లో ఏ పరిష్కారాలు నిర్ణయించినా అవన్నీ శాంతికి వ్యతిరేకమే. వాటితో సమస్య తీరదు. ఆ నిర్జీవ పరిష్కారాలు ఏమాత్రం పనిచేయవు" అని మండిపడ్డారు.

## జమ్మూకశ్మీర్‌లో ఎదురుకాల్పులు..

### ఇద్దరు సైనికులు మృతి



శ్రీనగర్(జనంసాక్షి):ఉగ్రవాదుల ఏరివేతే లక్ష్యంగా జమ్మూకశ్మీర్‌లోని కుల్గాం ప్రాంతంలో సైనిక ఆపరేషన్ కొనసాగుతోంది. శుక్రవారం అర్ధరాత్రి భద్రతా దళాలు, ఉగ్రవాదుల మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఇక్కడి దట్టమైన అటవీ ప్రాంతంలో ముగ్గురు ఉగ్రవాదులు రహస్య స్థావరాలను ఏర్పరుచుకొని ఉంటున్నట్లు నిఘా సమాచారం అందింది. దీంతో భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి కాల్పులు జరిపాయి. ఈక్రమంలో జరిగిన ఎదురుకాల్పుల్లో ఇద్దరు సైనికులు లాన్స్‌నాయక్ ప్రీత్‌పాల్ సింగ్, సిపాయి హర్మిందర్‌సింగ్‌లు మరణించారు. మరో ఇద్దరు సైనికులు గాయపడ్డారు. మృతుల కుటుంబాలకు చినార్ కార్ప్స్ సానుభూతి వ్యక్తంచేసింది. ఆపరేషన్ ఇంకా కొనసాగుతుందని తెలిపింది. ఉగ్రవాదులు ఉన్నారన్న నిఘా సమాచారంతో ఆగస్టు 1న అఖల్ గ్రామ పరిసరాల్లో 'ఆపరేషన్ అఖాల్' పేరుతో భద్రతాధికారులు ఆపరేషన్ చేపట్టారు. ఇది తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఈ ఆపరేషన్‌లో ఇప్పటికే పలువురు ఉగ్రవాదులను దళాలు మట్టుబెట్టాయి. ఈక్రమంలో పలువురు సైనికులు కూడా గాయపడ్డారు. ఇక, ఆపరేషన్ నేపథ్యంలో ఈ ప్రాంతంలో తుపాకీ శబ్దాలు పెద్దఎత్తున వినిపిస్తున్నాయి. దీంతో ఇక్కడి మహిళలు, చిన్నారులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. దీంతో ఇక్కడి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాదిలో ఇంత సుదీర్ఘ సమయం కొనసాగుతున్న ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ ఇదేనని అధికారులు చెబుతున్నారు.

# యాంటీ ర్యాగింగ్ వీక్ పెట్టాల్సిందే..

## మెడికల్ కళాశాలలకు ఎన్ఎంసీ ఆదేశాలు

**హైదరాబాద్, ఆగస్టు9 (జనంసాక్షి) :** దేశ వ్యాప్తంగా ఉన్న మెడికల్ కాలేజీల్లో ఆగస్టు 12 నుంచి ఆగస్టు 18 వరకు యాంటీ ర్యాగింగ్ వీక్‌ను పాటించాలని నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) తన పరిధిలోని అన్ని మెడికల్ కాలేజీలను కోరుతూ ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ఆగస్టు 12వ తేదీని యాంటీ ర్యాగింగ్ డేగా అన్ని మెడికల్ కాలేజీల్లో సెలబ్రేట్ చేసుకోవాలని పేర్కొంది. యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఆదేశాల మేరకు మెడికల్ కాలేజీలకు ఈ ఆదేశాలు జారీ చేసింది. యూజీసీ నిర్దేశించిన యాంటీ-ర్యాగింగ్ ఫ్రేమ్‌వర్క్ అమలులో భాగంగా దీనిని పాటించాలని తన నోటీసులో పేర్కొంది. ఈ నిబంధనలు తప్పనిసరని స్పష్టం చేసింది. అన్ని ఉన్నత విద్యా సంస్థలు ఈ నిబంధనలలో పేర్కొన్న పర్యవేక్షణ విధానాలుతో సహా మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించాలని కూడా పేర్కొంది. యాంటీ ర్యాగింగ్ వీక్ సందర్భంగా మెడికల్ కాలేజీల్లో పలు కార్యకలాపాలను నిర్వహించాలని యూజీసీ వివరించింది. ఈ సందర్భంగా యాంటీ ర్యాగింగ్ వీక్ ప్రారంభోత్సవ కార్యక్రమాలు, నినాదాలు రాయడం, వ్యాస రచన, పోస్టర్ తయారీ, ఫోటోగ్రఫీ పోటీలు, వీధి నాటకాలు, యాంటీ ర్యాగింగ్ ఇతివృత్తాలపై డిబేట్స్ వంటి కార్యకలాపాలతో విద్యార్థులకు పోటీలు నిర్వహించాలని సూచించింది. ఇందులో పాల్గొన్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు ప్రదానం చేసి, వారిని భాగస్వాములను చేయాలని తెలిపింది. డిజిటల్ పోస్టర్లు, షార్ట్ వీడియోలు, యాంటీ ర్యాగింగ్ సందేశాలను హైలైట్ చేసే రీల్స్‌పై దృష్టి సారించేలా నేషనల్ కాంటెస్ట్ 2025 ఏర్పాటు చేస్తున్నట్లు, ఇందులో విద్యార్థుల భాగస్వా మ్యాన్ని ప్రోత్సహించడానికి కాలేజీలు, యూనివ ర్సిటీలు కృషి చేయాలని యూజీసీ ఆదేశిం చింది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు యాంటీ ర్యాగింగ్ పోర్టల్ అందుబాటులో ఉన్నాయి. విద్యా సంస్థలు డిజిటల్ ప్రచారం కూడా చేయవచ్చు. ర్యాగింగ్ వ్యతిరేక సందేశాలను ప్రోత్సహించే సంస్థల నుంచి వీడియో సందేశాలను వినియోగించవచ్చని వివరించింది. వర్క్‌షాప్‌లు, సెమినార్లు, ఇంటరాక్టివ్ సెషన్‌లు, సెల్ఫీ కార్నర్‌ల వంటి సృజనాత్మక మార్గాలు వంటి అవగాహన కార్యకలాపాలను క్యాంపస్‌లో ఏర్పాటు చేయాలని సూచించింది. ఆఫ్‌లైన్ కార్యక లాపాలతో పాటు విద్యార్థులు, అధ్యాపకుల కోసం విద్యా సంస్థలు యాంటీ ర్యాగింగ్ వెబ్‌సైట్‌లో అందు బాటులో ఉన్న షార్ట్ మువీలు, అవగాహన వీడియో లను ప్రదర్శించాలని సంస్థలకు సూచించింది.

# అన్ని ప్రభుత్వ భవనాలపై సోలార్ ప్లాంట్లు

- జిల్లా కలెక్టర్లతో విద్యుత్ శాఖపై సెక్రటేరియట్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వీడియో కాన్ఫరెన్స్
- ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి
- ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ఓఎఫ్ఆర్ భూముల వివరాలు పంపండి



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సోలార్ విద్యుత్ ను పెద్ద ఎత్తున ఉత్పత్తి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలోని యావత్ క్యాబినెట్ విధాన నిర్ణయం తీసుకుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. శనివారం ఆయన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో ప్రభుత్వ భవనాలపై సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటు, ఆర్ఓఎఫ్ ఆర్ భూముల్లో ఇందిరా సౌర గిరిజన వికాసం పథకం అమలుపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశంలో సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ నవీన్ మిట్టల్, ఎస్పీడీసీఎల్ సిఎండి ముషారఫ్ ఫారుకి, రెడ్కో సిఎండి అనిలా తదితరులు పాల్గొన్నారు. అన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయాలు, పార్కింగ్, క్యాంటీన్ ప్లాన్లు హైదరాబాద్‌కు పంపాలని డిప్యూటీ సీఎం సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్లు అన్నీ కూడా ఒకే నమూనాలో నిర్మించినందున సోలార్ పవర్ ప్లాంట్‌లో ఏర్పాటుకు అవసరమైన డిజైన్లు హైదరాబాదు నుంచి పంపిస్తామని డిప్యూటీ సీఎం తెలిపారు. కలెక్టర్ కార్యాలయాల్లో మంచి డిజైన్లు ఉంటే ఆయా కలెక్టర్లు హైదరాబాద్‌కు పంపవచ్చని డిప్యూటీ సీఎం సూచించారు. గ్రామపంచాయతీ బిల్డింగ్ మొదలుకొని సెక్రటేరియట్ వరకు రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటుచేసి పెద్ద ఎత్తున విద్యుత్ ఉత్పత్తి చేయనున్నట్లు తెలిపారు. సోలార్ పవర్ ప్లాంట్ల ఏర్పాటుకు అవసరమైన వివరాలకు సంబంధించి కలెక్టర్లు హైదరాబాద్ కు పంపాల్సిన వివరాలకు సంబంధించి ఒక ప్రశ్నావళిని పంపిస్తున్నాం అందులో అన్ని వివరాలు నమోదు చేసి వారం లోపు విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ కార్యాలయానికి పంపాలని డిప్యూటీ సీఎం ఆదేశించారు. ప్రభుత్వ భవనాలతో పాటు ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, ఉన్నత విద్యాసంస్థల భవనాలపై కూడా సోలార్ పవర్ ప్లాంట్ లు ఏర్పాటు చేయాలని అందుకు సంబంధించిన భవనాల వివరాలు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు. నీటి పారుదల శాఖ, రోడ్లు భవనాల శాఖ పరిధిలో పెద్ద ఎత్తున ఖాళీ స్థలాలు ఉన్నాయి వాటి వివరాలు సైతం పంపాలని కలెక్టర్లకు డిప్యూటీ సీఎం సూచించారు. ఏజెన్సీ ప్రాంతాల్లో ఆర్ఓఎఫ్ఆర్ చట్టం కింద 6.70 లక్షల ఎకరాల భూములను ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం పంపిణీ చేసింది ఈ భూముల్లో నల్లమల డిక్లరేషన్ కింద ఇందిరా సౌర గిరిజల వికాసం పథకం ద్వారా ఉచితంగా సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేయనున్నట్టు డిప్యూటీ సీఎం కలెక్టర్లకు వివరించారు. నల్లమల డిక్లరేషన్ లో భాగంగా ఇప్పటికే అచ్చంపేట నియోజకవర్గంలో ప్రారంభించామని, ఈ నెలలోనే ఆదిలాబాద్ జిల్లాలో కొన్ని ప్రాంతాల్లో ప్రారంభించే ఆలోచనలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని తెలిపారు. ఇందిరా సౌర గిరిజల వికాసం పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుంది కలెక్టర్లు ఎక్కడ అలసత్వం ప్రదర్శించకుండా వారంలోగా వివరాలు పంపండి, ఈ విషయాల్లో ఎలాంటి సందేహాలు ఉన్న విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, ఎస్పీడీసీఎల్, ఎన్పీడీసీఎల్ సీఎండీలు, రెడ్కో వీసీ, ఎండీని సంప్రదించాలని డిప్యూటీ సీఎం కలెక్టర్లను ఆదేశించారు.

# కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదు

- కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



**కరీంనగర్ (జనంసాక్షి) :** కేటీఆర్ లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. 10 ఏళ్ల బీఆర్ఎస్ పాలనలో పెద్ద ఎత్తున అవినీతికి పాల్పడ్డారని తెలిసినా కేసీఆర్ కుటుంబంపై కాంగ్రెస్ చర్యలు తీసుకోకపోవడానికి ఆ రెండు పార్టీల మధ్యనున్న 'రక్షా' బంధమే కారణమని ఎద్దేవా చేశారు. కాళేశ్వరం కమిషన్ నివేదికను కేబినెట్ లో చర్చించిన రేవంత్ రెడ్డి ప్రభుత్వం విద్యుత్ కొనుగోళ్ల కమిషన్ నివేదికను కేబినెట్ లో ఎందుకు చర్చించలేదని ప్రశ్నించారు. పెద్ద ఎత్తున వాటాలు ముట్టినందునే ఆ కమిషన్ నివేదిక గురించి కనీసం పెదవి కూడా విప్పడం లేదని అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విషయంలో కేటీఆర్ ఇచ్చే లీగల్ నోటీసులకు భయపడే ప్రసక్తే లేదన్నారు. రాజకీయంగా నేరుగా ఎదుర్కొనే దమ్ములేకు చేసిన తప్పులు, పాపాల నుండి తప్పించుకునేందుకు లీగల్ నోటీసుల పేరుతో భయపెట్టాలని చూస్తున్నారని అన్నారు. ఈ సందర్భంగా కేటీఆర్‌ను "ఫోన్ ట్యాపింగ్ జరిగిందని మావద్ద సమాచారముంది. ఆధారా లున్నాయి. ఇదే విషయంపై ఏ గుడికైనా కుటుంబ సభ్యులతో కలిసి వస్తా. ఫోన్ ట్యాపింగ్ జరిగిందని దేవుడి సాక్షిగా ప్రమాణం చేస్తా...అదే సమయంలో నువ్వు కూడా నీ భార్యాపిల్లలు, తల్లిదండ్రులతో కలిసి గుడికి వచ్చి ఫోన్ ట్యాపింగ్ జరగలేదని వాళ్లందరితో కలిసి ప్రమాణం చేస్తావా?"అని సవాల్ విసిరారు. దమ్ముంటే తన సవాల్ కు స్పందించాలని అన్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా కరీంనగర్ లోని తన నివాసంలో బండి సంజయ్ కుటుంబ సభ్యులు, పార్టీ కార్యకర్తలు, జర్నలిస్టులతో కలిసి రాఖీ సంబురాలు జరుపుకున్నారు. పెద్ద ఎత్తున మహిళలు తరలివచ్చి రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వంపై నమ్మకం లేదని, కాళేశ్వరం, విద్యుత్ కొనుగోళ్లు, ఫార్ములా ఈ రేసుసహా అనేక కేసుల్లో విచారణ పేరుతో జాప్యం చేస్తున్నారే తప్ప చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు.

# రాజకీయాలకు శాశ్వతంగా దూరంగా ఉంటా

- మాజీ మంత్రి మల్లారెడ్డి



**హైదరాబాద్, ఆగస్టు9 (జనంసాక్షి) :** బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి మల్లారెడ్డి తన రాజకీయ జీవితంపై సంచలన కామెంట్ చేశారు. శనివారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో మీడియాతో మల్లారెడ్డి మాట్లాడారు. తాను రాజకీయంగా బీజేపీ వైపా, తెలుగుదేశం వైపా, బీఆర్ఎస్ పార్టీల వైపా అన్నది కాదని... తాను ఇప్పటికీ కూడా బీఆర్ఎస్‌లోనే ఉన్నానని క్లారిటీ ఇచ్చారు మల్లారెడ్డి. తాను ఇప్పుడు ఏ వైపునకు చూసేటట్లుగా కూడా లేనని స్పష్టం చేశారు. తనకు 73సంవత్సరాలు వచ్చాయని.. ఇంకా ఏవైపునకు చూడాల్సిన అవసరం ఏముందని ప్రశ్నించారు. తాను ఎంపీ, ఎమ్మెల్యే, మంత్రిని అయ్యానని ఇంకా మూడేళ్లు రాజకీయాల్లో ఉంటానని చెప్పుకొచ్చారు. అస్సలు తాను రాజకీయమే వద్దను కుంటున్నానని తెలిపారు. ప్రజలకు సేవ చేసి మంచి కాలేజీలు, యూనివర్సిటీలు నడిపిద్దామని అనుకుం టున్నానని మల్లారెడ్డి పేర్కొన్నారు.

# ఆర్టీసీ నిర్వహణ నిమిత్తమే చార్జీల పెంపు

- పండుగ తర్వాత చార్జీలు యథాతథం : ఆర్టీసీ యాజమాన్యం

**హైదరాబాద్, ఆగస్టు9 (జనంసాక్షి) :** రాఖీ పండుగకు చార్జీలు పెంచడంపై ప్రయాణికుల నుంచి విమర్శలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆర్టీసీ యాజమాన్యం శనివారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆర్టీసీ నిర్వహన కారణంగా కొంత చార్జీలు పెంచినట్టు తెలిపింది. పండుగ తరువాత రేట్లు యథాయథంగా ఉంటాయని వెల్లడించింది. ఈ నెల 11 వరకు స్పెషల్ బస్సుల్లో చార్జీలు పెంచినట్లు వెల్లడించింది. ఆ తర్వాత చార్జీలు సాధారణంగానే ఉంటాయని పేర్కొంది. రద్దీకి అనుగుణంగా బస్సులు నడుపుతున్నామని, ప్రయాణికులు లేకున్నా బస్సులను వెంటనే తిరిగి తీసుకురావాల్సి వస్తుందని, ఈ నేపథ్యంలో నిర్వహణ ఖర్చుల నిమిత్తం స్పెషల్ బస్సుల్లో మాత్రమే చార్జీలు పెంచామని వెల్లడించింది. 'సోదర, సోదరీమణుల మధ్య ప్రేమ, అనుబంధాలకు ప్రతికైనా రాఖీ పౌర్ణమి పర్వదిన సందర్భంగా ప్రయాణికులకు రవాణాపరమైన అసౌకర్యం కలుగకుండా టీజీఎస్‌ఆర్టీసీ ఏర్పాట్లు చేసింది. ప్రతి ఏడాది మాదిరిగానే ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రత్యేక బస్సులను అందుబాటులో ఉంచింది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం రాఖీ పండుగకు నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో మాత్రమే రూ.1.50 వరకు టికెట్ ధరలను సవరించింది. స్పెషల్ బస్సులు మినహా రెగ్యులర్ బస్సుల్లో సాధారణ చార్జీలే అమల్లో ఉంటాయి. ఈ నెల 11వ తేదీ వరకు నడిచే స్పెషల్ బస్సుల్లో మాత్రమే ఈ సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేసింది. ప్రధాన పండుగలు, ప్రత్యేక సందర్భాల్లో ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు తలెత్తకుండా వారిని క్షేమంగా గమ్యస్థానాలకు చేరవేసేందుకు స్పెషల్ సర్వీసులను ఆర్టీసీ యాజమాన్యం నడుపుతోంది. తిరుగు ప్రయాణంలో స్పెషల్ బస్సుల్లో ప్రయాణికుల రద్దీ ఏమాత్రం లేనప్పటికీ.. రద్దీ ఉన్న రూట్లలో ప్రయాణికులకు అసౌకర్యం కలగకుండా ఉండేందుకు ఖాళీ బస్సులను త్వరతగతిన సంస్థ వెనక్కి తెప్పిస్తుంది. ఆ స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరను సవరించుకోవాలని 2003లో జీవో నంబర్ 16 ను రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసింది. ఈ జీవో ప్రకారం స్పెషల్ బస్సులకు అయ్యే కనీస డీజిల్ ఖర్చులు, నిర్వహణ మేరకు టికెట్ ధరలను రాఖీ పండుగ సందర్భంగా సంస్థ సవరించింది. రాఖీ పౌర్ణమికి ప్రైవేట్ వాహనాల్లో ప్రమాదకర ప్రయాణం చేయొద్దని ప్రజలకు టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం సూచిస్తోంది. ఆర్టీసీ సిబ్బంది ఎంతో అనుభవజ్ఞులని, సొంతూళ్లకు వెళ్లే వారు తమ బస్సుల్లో సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని కోరుతూ.. అందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తోంది.' అని తెలిపింది. కాగా, రాష్ట్ర వ్యాప్తంగా ఆర్టీసీ బస్టాండ్లలో రాఖీ పండుగ ప్రయాణికుల రద్దీ నెలకొంది. సికింద్రాబాద్ జేబీఎస్, ఎంజీబీఎస్, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, ఉప్పల్ బస్టాండ్లలో బస్సుల కోసం ప్రయాణికులు ఎదురుచూస్తున్నారు.

### ఆర్టీసీలో ఐటీఐ కోర్సులకు నోటిఫికేషన్

తెలంగాణ రాష్ట్ర ఆర్టీసీ 2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి ఐటీఐ కోర్సుల్లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు టీజీఎస్‌ఆర్‌టీసీ అధికారిక వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తు చేసుకోవచ్చు. హైదరాబాద్ శివారులోని హకీంపేట్‌లో ఐటీఐ కాలేజీలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఎనిమిది, పదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కాలేజీలో మోటార్ వెహికల్ మెకానిక్, మెకానిక్ డీజిల్, వెల్డర్, పెయింటర్ ట్రేడ్‌లలో కోర్సులు అందిస్తున్నట్లు తన ప్రకటనలో పేర్కొంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఆగస్టు 28వ తేదీలోగా అధికారిక వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని సూచించింది. ఐటీఐ కోర్సుల్లో చేరాలనుకొనే విద్యార్థులు మరింత సమాచారం కోసం 9100664452, 6302649844, 040-69400000 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చు. ఈ మేరకు టీజీఎస్‌ఆర్టీసీ సూచనలు చేసింది. మెకానిక్ డీజిల్, వెల్డర్ కోర్సులు ఏడాది వ్యవధిలో పూర్తయ్యే కోర్సులు. ఇక మెకానిక్ (మోటర్ వెహికల్), పెయింట్ కోర్సులు రెండేళ్ల వ్యవధితో అందిస్తున్నారు. వెల్డర్, పెయింటర్ కోర్సులకు ఎనిమిదో తరగతి విద్యార్హత కలిగిన వారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ కోర్సులకు ఏడాదికి రూ.16,500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. తెలంగాణ రాష్ట్రంలోని ల్యాబ్ టెక్నీషియన్, స్టాఫ్ నర్సు పరీక్షల ఫలితాలు మరో రెండు రోజుల్లో విడుదల కానున్నాయి. తొలుత ల్యాబ్ టెక్నీషియన్ పోస్టుల ప్రొవిజనల్ మెరిట్ జాబితా విడుదల చేయనున్నారు. అనంతరం 1284 ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు భర్తీ చేస్తారు. అలాగే స్టాఫ్ నర్సు పోస్టుల మెరిట్ జాబితా కూడా విడుదల చేసి, 2322 నర్సింగ్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేసేందుకు వైద్య నియామక బోర్డు ఏర్పాట్లు చేస్తుంది.

# సొంతూళ్లకు నగరవాసులు

- హైదరాబాద్-విజయవాడ ట్రాఫిక్‌మయం
- జాతీయ రహదారిపై పెద్ద సంఖ్యలో వాహనాలు
- కిలోమీటర్ల మేర బారులు తీరిన వాహనాలు
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు

**హైదరాబాద్, ఆగస్టు9 (జనంసాక్షి) :** రాఖీ పౌర్ణమి పండగను కుటుంబ సభ్యులతో కలిసి జరుపుకునేందుకు నగరవాసులు పెద్ద సంఖ్యలో సొంతూళ్లకు బయలుదేరడంతో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి వాహనాలతో కిక్కిరిసిపోయింది. పండగ రద్దీ కారణంగా శనివారం ఉదయం నుంచే రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. హైదరాబాద్ నగర శివార్లలోని వనస్థలిపురం, భాగ్యలత, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతాల్లో పరిస్థితి తీవ్రంగా ఉంది. ఒక్కసారిగా వేల సంఖ్యలో వాహనాలు రోడ్లపైకి రావడంతో ప్రధాన రహదారితో పాటు సర్వీసు రోడ్లు కూడా వాహనాలతో నిండిపోయాయి. కిలోమీటర్ల కొద్దీ వాహనాలు బారులు తీరడంతో ట్రాఫిక్ నెమ్మదిగా కదులుతోంది. మరోవైపు, ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద కూడా ఇదే తరహా పరిస్థితి నెలకొంది. పండగ రద్దీ కారణంగా ఇక్కడ ట్రాఫిక్ దాదాపుగా స్తంభించిపోవడంతో, వాహనాలు ముందుకు కదలలేని దుస్థితి ఏర్పడింది. ఈ ఊహించని ట్రాఫిక్ జామ్ వల్ల గంటల తరబడి ప్రయాణం సాగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర అసహనానికి గురవుతున్నారు. తమ గమ్యస్థానాలకు సకాలంలో చేరుకోలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# పోకిరీల బెండు తీస్తున్న షీటీమ్స్

**న్యూఢిల్లీ, ఆగస్టు9 (జనంసాక్షి) :** ఆడాళ్ల జోలికి వస్తే తోలు తీస్తామంటున్నారు హైదరాబాద్ షీ టీమ్స్. నిత్యం పబ్లిక్ ప్లేసుల్లో మారు వేషాల్లో గస్తీ కాస్తూ ఆకతాయిలను అదుపులోకి తీసుకుంటున్నారు. తాజాగా మహిళలను పబ్లిక్ ప్రదేశాల్లో వేధించిన 33 మందిని సైబరాబాద్ షీ టీమ్స్ అరెస్ట్ చేశాయి. ఆగస్టు 3 నుంచి 8వ తేదీ వరకు ప్రత్యేక డ్రైవ్‌లో ఈ అరెస్టులు జరిగాయి. వివిధ సోర్సుల ద్వారా మహిళల నుంచి వచ్చిన 25 ఫిర్యాదులకు షీ టీమ్స్ తక్షణమే స్పందించి చర్యలు చేపట్టాయి. అంతే కాకుండా, కాపురంలో విబేధాలతో సతమతం అవుతున్న 21 జంటలకు ఫ్యామిలీ కౌన్సెలింగ్ సెంటర్లలో కూర్చోబెట్టి మాట్లాడి, సమస్యలు పరిష్కరించే ప్రయత్నం చేశారు. జూలై నెలలో మాత్రమే షీ టీమ్స్ 49మందిని అరెస్ట్ చేశారు. 48 పెట్టి కేసులు నమోదు చేసి, అందరికీ కౌన్సెలింగ్ ఇచ్చారు. మహిళా బాధితుల నుంచి 30 ఫిర్యాదులు అందుకుని.. వాటిపై తక్షణ చర్యలు చేపట్టారు. మహిళలు, బాలికల భద్రత కోసం 64 అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సైబరాబాద్ ఉమెన చిల్డ్రన్ సేఫ్టీ వింగ్‌లో 5 కౌన్సెలింగ్ సెషన్లు కూడా ఏర్పాటు చేశారు. సైబరాబాద్ షీ టీమ్స్ 24 గంటలూ అప్రమత్తంగా ఉంటూ.. మహిళల భద్రత కోసం కట్టుబడి ఉన్నాయని అధికారులు వివరించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా మహిళలు నిరభ్యంతరంగా షీ టీమ్స్‌ను సంప్రదించాలని.. కోరితే వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ

- ఉప్పల నివాసంలో రక్షాబంధన్ వేడుకలు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రేమానురాగాలకు ప్రతీక రాఖీ అని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త అన్నారు. ఆయనకు అక్క సోమ నాగరాణి, చెల్లెలు కసనగొట్టు మంజుల రాఖీ కట్టారు. ఉప్పల శ్రీనివాస్ గుప్త మాట్లాడుతూ ప్రేమానురాగాలకు రాఖీ పౌర్ణమి ప్రతీక దేశవ్యాప్తంగా జరుపుకునే రక్షా బంధన్ పండుగ సహోదరత్వానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. జీవితాంతం తమకు అండగా ఉండాలని ఆడబిడ్డలు తమ అన్నాదమ్ముల్లకు అనురాగంతో చేతికి రక్షా బంధనాన్ని కట్టడం గొప్ప సందర్భం అని ఆయన తెలిపారు. రక్షాబంధన్ సాంప్రదాయం భారతీయ జీవన ఔన్నత్యానికి నిదర్శనమని, ప్రజల్లో సహోదరత్వాన్ని మరింతగా పెంపొందిస్తుందని ఆయన ఆకాంక్షించారు. ప్రేమనుబంధాలకు ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను ప్రజలంతా ఆనందోత్సాహల్లో జరుపుకోవాలని ఆయన కోరారు.

# తెలంగాణకు బీసీ వ్యక్తి సీఎం కావడం ఖాయం

- రేవంత్‌తో విభేదాలేం లేవు
- టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్



**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** సీఎం రేవంత్ రెడ్డితో తనకు విభేదాలు ఉన్నాయని సోషల్ మీడియాలో కొందరు ప్రచారం చేస్తున్నారని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ మండిపడ్డారు. ఆ ప్రచారంలో నిజం లేదని... అవన్నీ తప్పుడు వార్తలని చెప్పారు. రేవంత్ కు, తనకు మధ్య మంచి అనుబంధం ఉందని తెలిపారు. తమ మధ్య ఉన్న సత్సంబంధాల వల్లే బీసీ రిజర్వేషన్లపై పోరాటం చేయగలిగామని చెప్పారు. బీజేపీ నేతలు బండి సంజయ్, ధర్మపురి అర్వింద్, ఈటల రాజేందర్ ల మౌనం బీసీలకు అన్యాయం చేస్తుందని అన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బీసీ సామాజికవర్గానికి చెందిన వ్యక్తి తెలంగాణ ముఖ్యమంత్రి కావడం ఖాయమని జోస్యం చెప్పారు.

# రెండు కేటగిరీలుగా వేతనాలు

- సినీ కార్మికుల వేతనాల పెంపుపై స్పష్టత
- యాక్టీవ్ ప్రొడ్యూసర్స్ మీడియా సమావేశం

**హైదరాబాద్, ఆగస్టు9 (జనంసాక్షి) :** తెలుగు సినీ పరిశ్రమలో కార్మికుల వేతనాల పెంపు అంశంపై గత కొంతకాలంగా నెలకొన్న సందిగ్ధతకు నిర్మాతలు తెరదించారు. వేతనాలను పెంచేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, అయితే కొన్ని షరతులు వర్తిస్తాయని స్పష్టం చేశారు. శనివారం ఫిల్మ్ ఛాంబర్‌లో యాక్టివ్ ప్రొడ్యూసర్స్ మీడియా సమావేశం నిర్వహించి, తమ ప్రతిపాదనలను వెల్లడించారు. ఈ సమావేశం లో నిర్మాతలు రెండు రకాల వేతన పెంపు విధానాలను ప్రకటిం చారు. రోజుకు రూ. 2000 లేదా అంతకంటే తక్కువ వేతనం తీసుకునే కార్మికులకు మొదటి ఏడాది 15 శాతం, రెండవ ఏడాది 5 శాతం, మూడవ ఏడాది మరో 5 శాతం చొప్పున వేతనం పెంచడానికి సుముఖత వ్యక్తం చేశారు. అదేవిధంగా, రోజుకు రూ. 1000 లేదా అంతకన్నా తక్కువ వేతనం పొందుతున్న కార్మికులకు మొదటి ఏడాది 20 శాతం, మూడవ ఏడాది 5 శాతం పెంచనున్నట్లు తెలిపారు. అయితే, వీరికి రెండవ ఏడాది వేతన పెంపు ఉండదని స్పష్టం చేశారు. ఈ వేతన పెంపు వెంటనే అమల్లోకి రాదని, దీనికి ఒక ముఖ్యమైన షరతు విధించినట్లు ఫిల్మ్ ఛాంబర్ సెక్రటరీ దామోదర్ ప్రసాద్ తెలిపారు. నిర్మాతలు ఇప్పటికే ఫెడరేషన్ ముందు ఉంచిన కొన్ని నిబంధనలకు వారు అంగీకారం తెలిపితేనే ఈ కొత్త వేతనాలు అమలవుతాయని ఆయన స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో బంతి ఫెడరేషన్ కోర్టులోకి వెళ్లినట్లయింది. ఈ మీడియా సమావేశంలో ప్రముఖ నిర్మాతలు విశ్వప్రసాద్, నాగవంశీ, మైత్రీ మూవీ మేకర్స్ నవీన్, సుధాకర్ చెరుకూరి, రాధామోహన్, సాహు గారపాటి, ఎస్‌కెఎన్, బాపినీడు, చెర్రీ తదితరులు పాల్గొన్నారు. మరోవైపు టాలీవుడ్ సినీ కార్మికుల వేతనాల పెంపు అంశంలో తనపై జరుగుతున్న ప్రచారాన్ని మెగాస్టార్ చిరంజీవి తీవ్రంగా ఖండిం చారు. ఫిలిం ఫెడరేషన్ ప్రతినిధులతో సమావేశంలో, సినీ కార్మికులకు 30 శాతం వేతనాలు పెంపుపై తాను హామీ ఇచ్చినట్టు వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన శనివారం ఓ అధికారిక ప్రకటన విడుదల చేశారు. ఫిలిం ఫెడరేషన్‌కు చెందిన కొందరు సభ్యులు తనను కలిశారనీ... వారి డిమాండ్లకు తాను అంగీకరించి, షూటింగ్స్ త్వరలో ప్రారంభిస్తానని హామీ ఇచ్చాననీ... మీడియాలో తప్పుడు ప్రచారం చేస్తున్న విషయం తన దృష్టికి వచ్చిందని చిరంజీవి తన ప్రకటనలో తెలిపారు. "నేను ఫెడరేషన్ నుంచి ఎవరినీ కలవలేదు. అసలు వాస్తవాలు వెల్లడించడానికే ఈ ప్రకటన చేస్తు న్నాను" అని ఆయన స్పష్టం చేశారు. తెలుగు చలనచిత్ర పరిశ్రమ కార్మిక సంఘాలతో, ఇతర భాగస్వాములతో చర్చలు జరిపి న్యాయమైన పరిష్కారం కనుగొంటుందని చిరంజీవి వివ రించారు. అలాంటి పరిష్కారం లభించే వరకు ఇలాంటి నిరాధా రమైన, దురుద్దేశపూర్వకమైన ఆరోపణలు చేయడం సరికాదని ఆయన హితవు పలికారు. గందరగోళం సృష్టించే ఇలాంటి కథనాలను తాను తీవ్రంగా ఖండిస్తున్నానని ప్రకటనలో తేల్చిచెప్పారు.




# 'నులి'పేద్దాం..

# ఒట్టేసి చెబుదాం..

### ఒక్క మాత్రతో నట్టలను కట్టడి చేద్దాం...


**(11ఆగస్టు 2025, జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం)**

పిల్లలు తరచుగా కడుపునొప్పితో గానీ, కాళ్ళు ముఖం ఉబ్బటం గానీ, ఆకలి మందగించడం, నీరసంగా, మందకొడిగా, బరువు తగ్గడం, రక్తహీనత, మలద్వారం చుట్టూ దురద మొదలగు ఏదైనా ఒక లక్షణంతో శారీరకంగా లేదా మానసికంగా అనారోగ్యంతో బాధపడుతుంటే కడుపులో నట్టలు ఉన్నట్టు అనుమానించవచ్చు. పిల్లల కడుపులో క్రిములతో (పొట్టలో నట్టలు) కలిగే అనారోగ్య సమస్యలను అంతం చేయుటకు భారత ప్రభుత్వం 2015 సం. నుండి "జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం (ఎన్.డి.డి.)" కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఆనాటి నుంచి ప్రతి ఏటా రెండు సార్లు ఫిబ్రవరి, ఆగస్టు మాసాలలో ఆరు నెలలకోసారి ఎన్.డి.డి.రోజున అన్ని రాష్ట్రాలలో డీవార్మింగ్ ప్రోగ్రాం నిర్వహిస్తూ 1సం. నుండి 19 సం.ల వయసు పిల్లలందరికీ నులిపురుగుల నిర్మూలన మాత్రలు (ఆల్బెండజోల్ టాబ్లెట్స్) నమిలి మింగించడం జరుగుతుంది. వైద్య ఆరోగ్య శాఖతో పాటు విద్యాశాఖ, స్త్రీ శిశు సంక్షేమ (ఐసిడిఎస్) శాఖల సమన్వయం, సహకారం, సౌజన్యంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారు.

నులిపురుగులు అంటే ఏమిటి? నులి పురుగులనేవి మానవుని ప్రేగులోంచి పోషకాలను, రక్తాన్ని గ్రహించి అభివృద్ధి చెందే పరాన్న జీవులు . మనిషి అతిదేహి అనగా ఆతిథ్యం ఇచ్చేవాడు . నులి పురుగు అతిథి . నులిపురుగులు మూడు రకాలు. ఏలిక పాములు (రౌండ్ వార్మ్), నులి పురుగులు ( పిన్ వార్మ్), కొంకి పురుగులు (హుక్ వార్మ్ ). 1).ఏలిక పాములు (రౌండ్ వార్మ్): వీటి శాస్త్రీయ నామం: అస్కారిస్ లంబ్రికాయిడ్స్. ఇవి 10నుంచి 20సెం.మీ. పొడవుంటాయి. రోజుకు రెండు లక్షలకు పైగా గుడ్లు పెడతాయి. ఎక్కువ సంఖ్యలో ఏలిక పాములు ఉండటం వల్ల ప్రేవులలో అడ్డు గోడలుగా నిలుస్తాయి. వీటివల్ల అజీర్తి, కడుపు నొప్పి, నీరసం, పోషకాహార లోపం ఏర్పడుతుంది. 2).నులి పురుగులు (పిన్ వార్మ్ /త్రెడ్ వార్మ్): ఈ పురుగులు తెల్లని రంగులో సన్నగా దారం పోగులాగా అర అంగుళం పొడవుంటాయి. వీటి శాస్త్రీయ నామం: ఎంటరోబియస్ వెర్మికులారీస్. ఈ వ్యాధి సంక్రమించిన వ్యక్తి బహిరంగ ప్రదేశంలో మల విసర్జన చేయడం వల్ల మట్టి కలుషితమై ఆ గుడ్లు చేతుల ద్వారా నీరు, ఆహారం ద్వారా ఇతరులకు వ్యాపించును. వీటివల్ల మలద్వారం చుట్టూ దురద, రాత్రిపూట ఎక్కువగా మూత్ర విసర్జన జరుగుతుంది. 3).కొంకి పురుగులు (హుక్ వార్మ్): వీటి శాస్త్రీయ నామం: ఎన్సైలో స్టొమ డ్యుయోడినాల్. ఇవి నోటి ద్వారా కాకుండా పాదచర్మం ద్వారా సంక్రమిస్తాయి. కొంకి పురుగులు తమ నోటి దంతాల ద్వారా పేగులకు రంధ్రాలు చేసి రక్తాన్ని పీలుస్తాయి. వీటి గుడ్లు మట్టిలో చేరి ఎనిమిది రోజుల్లో లార్వాగా సన్నని దారం వలె రూపొందుతాయి. ఈ దశలో పాదాల చర్మం ద్వారా శరీరంలోకి వెళ్తాయి. వీటివల్ల రక్తహీనత, నీరసం, ఇస్నోఫీలియా ఎక్కువగుట, పిల్లలలో శారీరక, మానసిక పెరుగుదల లోపం, కాళ్లవాపులు, ముఖం ఉబ్బడం జరుగుతుంది.

నులిపురుగుల సంక్రమణ వేటి ద్వారా వ్యాపిస్తుంది? పరిసరాలు పరిశుభ్రంగా లేని ప్రాంతాలలో మానవ మలంలో ఉన్న హెల్మిన్తీస్ పరాన్నజీవుల గుడ్ల ద్వారా మట్టి కలుషితం అయి 'మట్టి ద్వారా సంక్రమించే హెల్మిన్తీస్' వ్యాప్తి చెందుతాయి. ఆరుబయట చెప్పులు లేకుండా వట్టి కాళ్ళతో మట్టిలో ఆడుకోవడం. అపరిశుభ్రమైన సురక్షితం కాని నీరు, ఆహారం తీసుకోవడం. భోజనం చేసే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోపోవుట. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయుట. పెరిగిన గోళ్లను కత్తిరించక పోవడం. వ్యక్తిగత పరిశుభ్రత మరియు పరిసరాల పారిశుధ్యం లోపించడం. అపరిశుభ్రమైన ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవడం ద్వారా నులి పురుగులు నోటిద్వారా లేదా అరికాళ్ళ చర్మం ద్వారా సంక్రమిస్తాయి.

లఎవరెవరికి ఎక్కడ మాత్రలు వేస్తారు? జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం అనగా 11 ఆగస్టు 2025 రోజున అంగన్వాడీ కేంద్రాలలో నమోదు చేయబడిన1 నుంచి 5సం.ల వయస్సు గల చిన్నారులకు మరియు 6 నుంచి 19 సం.ల వయస్సు గల బడి బయట పిల్లలకు అంగన్వాడీ/ ఆషా కార్యకర్తలు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ప్రభుత్వ మరియు ప్రైవేటు పాఠశాలలు, మదర్సాలలో , కాలేజీలలో నమోదు చేయబడిన 6 నుంచి 19 యేళ్ళ పిల్లలందరికీ ఎన్.డి.డి. రోజు ఏ.ఎన్.ఎం.లు, ఉపాధ్యాయులు ఆల్బెండజోల్ మాత్రలు వేస్తారు. ఆ రోజు పాఠశాలకు వెళ్లని మిస్ అయిన పిల్లలకు 18 ఆగస్టు 2025 (మాప్ అప్ డే) రోజున తిరిగి మాత్రలు వేస్తారు. యింకా అనాథ ఆశ్రమాలు, చైల్డ్ కేర్ సెంటర్లు మరియు చదువుకునే, ఆటలాడుకునే, పనిచేసే అన్ని ప్రదేశాలలో 1 నుంచి 19 సం. వయసున్న పిల్లలకు ఆరోగ్య సిబ్బంది మాత్రలు వేస్తారు. నులిపురుగుల ప్రభావం ఎక్కువగా ఉన్న పిల్లలలో ఈ మాత్ర వేసుకున్న తర్వాత కొందరికి వికారం, స్వల్ప కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు కలుగవచ్చు. కంగారుపడాల్సిన పనిలేదు. వెంటనే స్థానిక వైద్యారోగ్య సిబ్బందికి తెలియజేయాలి. పిల్లలు ఈ మాత్రను డైరెక్ట్ మింగకుండా బాగా నమిలి మింగే విధంగా చూడాలి. నమలకుండా మింగితే నిర్మూలనా ప్రభావం తగ్గే అవకాశం ఉంది.



ఆల్బెండజోల్ మాత్రల మోతాదు: 1 నుంచి 2 సం.ల చిన్నారులకు ఆల్బెండజోల్ సగం మాత్ర (200) రెండు స్పూన్ల మధ్య నలిపి, నీటితో కలిపి మింగిస్తారు. 2 నుంచి 3 సం.ల పిల్లలకు పొడి చేసిన ఒక పూర్తి మాత్ర (400 ఎమ్.జి.) మరియు 3 నుంచి 19 సం.ల వయసు పిల్లలు ఆల్బెండజోల్ మాత్ర (400 ఎమ్.జి.) భోజనం చేసిన తర్వాత నమిలి నీటితో మింగాలి. యన్.డి.డి. నిర్వహణ సమయంలో అంగన్ వాడీ కేంద్రాలు, పాఠశాలలు, కాలేజీల్లో శుభ్రమైన త్రాగు నీరు, గ్లాసులు ఏర్పాటు చేసుకొని కార్యక్రమం విజయవంతం చేయాలి. ప్రార్థన సమయంలో విద్యార్థులకు, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం మరియు చేతులను సబ్బు నీటితో కడుక్కునే పద్ధతులను (హ్యాండ్ వాషింగ్ టెక్నిక్స్) నేర్పిస్తారు.

ఆల్బెండజోల్ మాత్రలు ఎవరు వేసుకోకూడదు? జబ్బులున్న వారు, దీర్ఘకాలికంగా మందులు వాడుతున్న పిల్లలు ఈ మాత్రలు వేసుకోరాదు. ఖాళీ కడుపుతో మాత్రలు వేసుకోరాదు. ఎట్టి పరిస్థితుల్లో టాబ్లెట్ పిల్లవానికి యింటికి యివ్వకూడదు. ఆల్బెండజోల్ మాత్ర పిల్లలకు, పెద్దలకు కూడా సురక్షితమైనది. నులి పురుగులు రాకుండా నివారణ చర్యలు: బయటకు వెళ్లినప్పుడు చెప్పులు ధరించాలి. సురక్షితమైన నీరు, పరిశుభ్రమైన ఆహార పదార్థాలు తీసుకోవాలి. భోజనం,ఇతర ఆహార పదార్థాలు తినే ముందు, మలవిసర్జన తర్వాత చేతులు సబ్బు నీటితో కడుక్కోవాలి. బహిరంగ ప్రదేశాల్లో మలవిసర్జన చేయకుండా, మరుగు దొడ్లని వాడాలి. పెరిగిన గోళ్లను కత్తిరించి, శుభ్రంగా ఉంచుకోవాలి. పరిశుభ్రంగా కడిగిన ఆకు కూరలు, కాయగూరలు, పండ్లు తీసుకోవాలి. పరిసరాల పారిశుధ్యం, వ్యక్తిగత పరిశుభ్రత పాటించడం ద్వారా నులి పురుగులు రాకుండా నివారించవచ్చు. ఆరోగ్యవంతమైన సమాజం, ఆనందకర బాల్యం కోసం ఒక్క మాత్రతో వేలాది నులి పురుగులను నలిపేసి, పిల్లల శారీరక, మానసిక వికాసానికి తోడ్పడే ఈ కార్యక్రమం వంద శాతం కవరేజ్ అయ్యేలా, విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉంది. (11 ఆగస్టు 2025 జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా)

**బి నాశబోయిన నరసింహ (నాన),**
కవి, రచయిత, ఆరోగ్య విస్తరణ అధికారి, 8555010108

# ట్రంప్-మోదీ వ్యాపార రాజకీయాలు

### భారత ఆర్థిక స్వాతంత్ర్యం ఎవరి చేతుల్లో?



అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ భారతదేశంపై విధించిన టారిఫ్ పెంపులు, రష్యాతో వ్యాపార సంబంధాలను ఛేదించమన్న డిమాండ్లు కేవలం ఆర్థిక విధానాలే కాదు, భారత సార్వభౌమత్వంపై సవాల్లు. ట్రంప్ ప్రభుత్వం భారతీయ ఎగుమతులపై 50 శాతం సుంకాలు విధించి, రష్యాతో క్రూడ్ ఆయిల్ ఒప్పందాలను నిషేధించడానికి ప్రయత్నించిన సందర్భంలో, భారత ప్రభుత్వం యొక్క నిశ్శబ్దం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ట్రంప్తో సన్నిహిత సంబంధాలు ప్రచారం చేసినా, ఆయన భారత ప్రయోజనాలను సమర్థవంతంగా పరిరక్షించలేకపోయారు. ఈ పరిస్థితి భారత ఆర్థిక విధానాలలోని దౌర్బల్యాన్ని, అమెరికాపై ఉన్న అతిగా ఆధారపడటాన్ని బహిర్గతం చేస్తుంది.

**రష్యా-భారత సంబంధాలు: ఒక చారిత్రక అవసరం:**
రష్యా భారతదేశానికి కేవలం వాణిజ్య భాగస్వామి మాత్రమే కాదు, సామరస్యపూర్వకమైన జియోపాలిటికల్ మిత్రుడు. 1971లో బాంగ్లాదేశ్ యుద్ధంలో రష్యా భారతానికి అండగా నిలిచింది. కాశ్మీర్ విషయంలో ఐక్యరాజ్యసమితిలో మద్దతు ఇచ్చింది. ఇప్పటికీ భారత రక్షణ వ్యవస్థలో 60 శాతం సైనిక సామగ్రి రష్యాదే. ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాపై పాశ్చాత్య దేశాలు ఆర్థిక ఆంక్షలు, పరిహారాలు విధించినప్పటికీ, భారతదేశం తన జాతీయ ప్రయోజనాలను ప్రాధాన్యతనిచ్చి రష్యాతో క్రూడ్ ఆయిల్ కొనుగోలు కొనసాగించింది. ఇది ట్రంప్ కు మింగుడు పడని విషయం.ట్రంప్ ప్రకారం, "భారత్ అమెరికా శత్రువులతో వ్యాపారం చేయకూడదు". కానీ, అమెరికా ఎప్పుడూ భారత ప్రయోజనాలను ప్రధానంగా పరిగణించలేదు. 1960లలో భారత్ లోని తేలికపాటి చమురు నిల్వలు లభించవు అని ప్రకటించింది. సోవియట్ యూనియన్ సహాయంతో బాంబే హైలో భారీ నిల్వలు కనుగొనబడ్డాయి. ఇది అమెరికా విశ్వసనీయతపై ప్రశ్నార్థకాలను ఎత్తుతుంది.

**ట్రంప్ వ్యాపార సామ్రాజ్యం - భారత ఆర్థిక వ్యవస్థను దోచే సాధనం:**
ట్రంప్ భారత ఆర్థిక వ్యవస్థను "మృతప్రాయం"గా వర్ణించినా, అతని స్వంత సంస్థలు భారత్ లో అపార లాభాలు ఆర్జిస్తున్నాయి. ముంబై, హైదరాబాద్, బెంగళూరు, నోయిడాలలో ట్రంప్ ఓర్గనైజేషన్ 11 మిలియన్ చదరపు అడుగుల భవన నిర్మాణ ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టింది. హైదరాబాద్లోని 63 అంతస్తుల ట్రంప్ టవర్ ద్వారా 3,500 కోట్ల రూపాయల లాభం ఆయన కంపెనీలకు వస్తుంది. ట్రంప్ చెప్పినట్లు భారత్ "మృతప్రాయ ఆర్థిక వ్యవస్థ" అయివుంటే ఈ లాభాలు ట్రంప్ కు ఏలా వచ్చేవి? ట్రంప్ భారత్ నుండి ఒకవైపు లాభాలు దండుకుంటూ, మరోవైపు అదే భారత దేశాన్ని ఆర్థికంగా బలహీనపరచడానికి ప్రయత్నిస్తున్నాడు. అతని డబల్ స్టాండర్డ్ స్పష్టంగా కనిపిస్తుంది: "మీ దేశం పేదది, కాబట్టి నేను మీపై పన్నులు విధిస్తాను. కానీ నా కంపెనీలు మీ భూమిలో కొనసాగాలి!" అనే ధోరణి ప్రమాదకరమైన పరిస్థితికి తార్కాణం.

**ఇంత జరుగుతున్నా ట్రంప్పై మోదీ నిశ్శబ్దం:**
పిరికితనమా లేక వ్యాపార రాజకీయాలా?:ట్రంప్ భారత్ పై ఆర్థిక దాడులు చేస్తున్నప్పుడు, మోదీ ఎందుకు నిశ్శబ్దంగా ఉన్నాడు? అదానీ వ్యాపార సంస్థల గుట్టు అమెరికా ఫెడరేషన్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ చేతికి చిక్కటం వల్ల దానిని అరెస్టు చేస్తామని మోదీని భయపెట్టడం, బ్లాక్ మేయిలింగ్ చేయటం కారణం కావచ్చు అనే అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. అలాగే

1. **భారత్ అమెరికాపై ఆధారపడటం:** భారత రక్షణ వ్యవస్థలో అమెరికా సామగ్రి, టెక్నాలజీకి ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వడం.
2. **ట్రంప్ వ్యాపారాలకు మద్దతు:** మోదీ ప్రభుత్వం ట్రంప్ సంస్థలకు భారత్ లో వ్యాపార విస్తరణకు అనుకూల వాతావరణం కల్పించింది. ఇది రాజకీయ-వ్యాపార ఒప్పందంగా కనిపిస్తుంది.

భారత దేశం స్వదేశీ ఉత్పత్తుల పైన, బహుళ ధృవ ప్రపంచ వైఖరి పైనా దృష్టి పెట్టటం అత్యంత కీలకమైన అవసరం. ట్రంప్ వ్యవహారాలు భారత దేశానికి ఒక ముఖ్యమైన పాఠం నేర్పాయి." అమెరికా ఎప్పుడూ తన ప్రయోజనాలకే ప్రాధాన్యత ఇస్తుంది". భారతదేశం తన ఆర్థిక, రక్షణ విధానాలలో బహుళధృవ వైఖరిని అనుసరించక తప్పదు. రష్యా, ఫ్రాన్స్, చైనా, ఇజ్రాయెల్ వంటి దేశాలతో సమతుల్యమైన సంబంధాలు పెంపొందించుకోవడమే సరైన మార్గం. అలాగే, విదేశీ పెట్టుబడులను నియంత్రించే నియమాలు కఠినంగా అమలు చేయాలి. ట్రంప్ లాంటి వ్యక్తులు భారత ఆర్థిక వ్యవస్థను దోచుకునే అవకాశాలను, పరిస్థితులను నియంత్రించాలి. భారత్ "స్వదేశీ విధానం" అనేది కేవలం నినాదం కాకుండా, ఆర్థిక స్వాతంత్ర్యానికి ఆయుధంగా మారాలి. భారత ప్రభుత్వం, ప్రజలు ధృఢ సంకల్పంతో స్వదేశీ ఉత్పత్తులను మాత్రమే కొనుగోలు చేయాలి. మన దేశంలో లభించని అరుదైన ఉత్పత్తులను, సైన్స్, టెక్నాలజీని మాత్రమే విదేశాలనుండి దిగుమతి చేసుకోవాలి. గొప్పతనం కోసం, ఆడంబరాల కోసం విదేశీ వస్తువుల దిగుమతిని అనుమతించ రాదు.

ఎప్పుడైనా... విదేశీ వస్తు వ్యామోహం భారత్ కు ముప్పే అనే సోయి భారత ప్రభుత్వానికి, ప్రజలకు ఉండాలి. ఈ బలహీనతే భారతీయుల ను బానిసలుగా మార్చిన చారిత్రక సత్యాలను మర్చిపోకూడదు.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

## సాంస్కృతిక కుట్ర!

సూద్రులపేరుతో
భారతీయుల్లో
అధిక జనాభా
నిరక్షర కుక్షులు!

చెవుల్లో సీసం
నాలుకలు కోయటం
ఆస్తులు జప్తు
లింగఖండనం!

ఈ 'మను'శిక్షలు ఏవీ
'వాళ్ళ'కు లేవు!
అవే తప్పులు
వాళ్లుచేసినా సరే!

ఆలోచిస్తే....!
గుండెల్లో మంట!
ఎన్నెన్ని కుట్రలు!
ఎన్ని దారుణాలు!

కవి! రచయితలారా!
మనకు ఆదర్శం
పూలే జాషువా
అంబేద్కర్లు సుమా!

భాషలోనూ కుట్రే
జనం భాష వాడండి!
సంస్కృతశ్లోకాలు
'వాళ్ళ'గొప్పలకోసం!

భావస్పష్టత ఉంటేచాలు
భాషకోసం చూడకండి!
నిజంమాత్రమే రాయండి
నిజాయితీగారాయండి!

సూద్ర, దళిత
ఆదివాసీ,మైనారిటీ...
ఈ పదాల వాడుకలోనూ
మనపై చిన్నచూపే!

మనలను చిన్నబుచ్చే
పదాలు ఏరి కూర్చితే
అవిపుంఖానుపుంఖాల
అవమానపు సంకెళ్లు!

భావస్పష్టతకు
అవసరమైతేనే మనం
ఆ పదాలు వాడదాం!
లేకపోతే వద్దు!

అందరూ సమానం
అనే భావాన్నే మనం
ప్రచారంచెయ్యాలి!
అదే సమసమాజం!

భారతీయసంస్కృతిలో
చాలా కుట్ర ఉంది!
సంస్కృతిలో మార్పు
మన తక్షణ కర్తవ్యం!

- తమ్మినేని అక్కిరాజు హైదరాబాద్

## చేనేత

గంజి మెతుకు బ్రతుకులు
అడుగడుగున అతుకులు
నూలువడికి మిడికినా
తీరలేదు తిప్పలు....!

మగ్గం గుంటకు నడుములు
వెన్నుకు అంటెను ప్రేగులు
అరిగి పొయిన ఎముకలతో
నేలకు ఒరిగెను తనువులు!

పోగు పోగు ప్రోగేసిన
పొయ్యిలోన పొగసూరెన..?
అలుపెరుగని చేనేతకు
చేయూతలు కరువాయెన!

నేతలకును కద్దరిచ్చి
అందమైన చెద్దరిచ్చి
చెదిరెను చేనేతలిపుడు
ఆదరణకు కరువులొచ్చి!

బహు సన్నని మనుషులు
సున్నితంబు మనసులు
అందరిపై విశ్వాసమె....
అవే తప్పటడుగులు!

- వంగరి వెంకటేశం

## నేటి నినాదాలు..

(50% జనుల)

ఎదుటి వాడిని దోచుకో!
వీలైనంత దాచుకో!!
నీ కుటుంబాన్ని మాత్రం,
అతి భద్రంగా చూసుకో!!!

స్నేహభావాన్ని నటించు!
కన్నడ అంజలి ఘటించు!!
మనసులోన మాత్రం బహు,
కుతంత్రాలన్ని పఠించు!!!

అవసరానికి బంధాలు!
ఉండరాదనుబంధాలు!!
వ్యక్తిత్వాలను బట్టి,
అయిపోవాలి బృందాలు!!!

నీ పనివేళ నీ వాళ్ళు!
లేనియెడ పరాయివాళ్లు!!
మించిపోతే ఉప్పుము,
అపనిందలనేటి రాళ్ళు!!!

అమిత కోర్కెలు పెంచుకో!
వక్రమార్గము లెంచుకో!!
నీతిపై దాడిజేయు,
ఆయుధాలను ఉంచుకో!!!

- ప్రవాహి పద్యకవి

# ట్రంప్ సుంకాలతో భారత ఆర్థిక వ్యవస్థకు సవాల్!

భారతదేశం పట్ల అమెరికా అధ్యక్షుడు అనుసరిస్తున్న వ్యవహార శైలి కేవలం భారతదేశానికి నష్టం కలుగదని ఇది ప్రపంచ దేశాలకు కూడా ఆర్థిక వ్యవస్థను ఇచ్చిన దిశగా పయనిస్తుంది. రష్యా నుండి భారతదేశం దిగుమతి చేసుకుంటున్న క్రూడ్ ఆయిల్ పట్ల అమెరికా తన కంటిలో నిప్పులు పోసు కుంటుంది. భారతదేశ ఆర్థికంగా బలపడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని భావిస్తున్న అమెరికా చిరకాల మిత్రుడైన రష్యా నుండి భారతదేశాన్ని దూరం చేయాలన్న ఆలోచనలతో ట్రంపు వ్యవహరిస్తున్న తీరు భారతీయ వస్తువులపై ఆగస్టు ఒకటి నుండి 25% సుంకాలు విధిస్తామని చెప్పిన 24 గంటలకే సగటు భారతీయులు అమెరికా వెళ్ళాలని ఎందుకు కోరుకుంటారు? అక్కడ సంపా దించే డాలర్లలో కొద్ది మొత్తం ఇక్కడకు పంపించినా అది వారి కుటుంబ సభ్యులకు రూపాయలలో గణనీయమైన మొత్తాలుగా మారుతాయి కనుక అమెరికా నుంచి జను చేసే మొత్తాలు, స్వదేశంలోని బంధు జనాన్ని లెజమన్ కుట్టప్పన్ నిజంగానే ఎంతగానో ఆదుకుంటున్నాయి. ప్రవాస భారతీయులు అలా చేసే జమలపైన 5% పన్ను విధించాలని అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రతిపా దించారు. దానిని ఆయన తమ ఖజానాకు పెద్ద మొత్తం గడించి పెట్టగల సాగపైన బిల్లుగా భావిస్తున్నారు. మనకు మాత్రం అది పీడకల లాంటి ప్రతిపాదనే. ఇది భారతదేశంలోని అనేక కుటుంబాల జీవనాధారాన్ని నీరుగార్చవచ్చు. జమ చేసే మొత్తాలపై ఇక మీదట అమెరికా ప్రభుత్వానికి పన్ను కట్టవలసి ఉంటుంది కనుక వారు పంపి మొత్తాలు కొంతమేరకైనా తగ్గవచ్చు. ఆ విధంగా అది మనకు భారత విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ అంచనాల ప్రకారం, అమెరికాలో 12 లక్షల 80 వేల మంది ప్రవాస భారతీయు (ఎన్ఆర్ఐ)లుగా ఉన్నారు. మరో 31 లక్షల 80 వేల మంది భారతీయ సంతతికి చెందిన వ్యక్తు (పిఐఓ) లుగా ఉన్నారు. విదేశాల నుంచి నగదు జమల విషయంలో భారతదేశం అగ్ర స్థానంలో ఉందని ప్రపంచ బ్యాంకు 2024 రెమిటెన్స్ రిపోర్ట్ తెలుపుతోంది. 2024లో అలా 129 బిలియన్ల డాలర్లు వచ్చిపడ్డాయని అది వెల్లడిం చింది. ఇలా జమ అయ్యేదానిలో అమెరికా నుంచి వచ్చేదే పెద్ద మొత్తంగా ఉంటోందని భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్.బి.ఐ.) నివే దిక పేర్కొంటోంది. అమెరికా నుంచి జమయ్యే మొత్తం 2016-17లో 22.9 శాతంగా ఉన్నది 2023-24 నాటికి 27.7 శాతానికి పెరిగిందని "ఆర్బీవెల్లడించింది.

మన దేశానికి 120 బిలియన్ల డాలర్లు జమ అయ్యాయను మందాం. దానిలో అమెరికా వాటా 27% అంటే, ఒక్క అమెరికా మంచే 33 బిలియన్ల డాలర్లు చేకూరినట్లు లెక్క. దీనిపై ఇప్పుడు 5% చెన్ను విధిస్తే, అది సుమారుగా 1.8 బిలియన్ డాలర్లు (రూ.13,000 "ట్లు)గా లెక్కకు వస్తుంది. మరో విధంగా




చెప్పాలంటే, ఇండియాకు కావలసిన ఆ మొత్తానికి, ట్రంప్ నూతన పన్ను విధానం వల్ల గండి డుతుంది. దీన్ని కేవలం సంఖ్యల రూపంలో చూడవద్దు. ఇది అనేక కారతీయ కుటుంబాల దైనందిన జీవితంపై ప్రభావం చూపుతుంది. తుకు బండి లాగించడానికి, ఇతర కుటుంబ సభ్యుల చదువు ఐద్యలకు, ఆరోగ్య రక్షణకు ఆ మొత్తాలు ఉపయోగపడుతున్నాయి. ముఖ్య ఆదాయానికి కత్తెర పడితే భారతదేశంలోని ఆ యా కుటుం జల భద్రతకు ముప్పు వాటిల్లుతుంది. ఈ జమలు ఎవరి దయా క్మాలూ కావు. వలస వెళ్ళినవారు చెమటోడ్చి సంపాదించిన ఆదా చంలో కుటుంబ పోషణకు వంపుతున్న కొంత మొత్తాలు.అల్ప, మధ్యాదాయ దేశాలు 2023లో 650 బిలియన్ల డాలర్లను కింద అందుకున్నాయి. ఇది ఆయా దేశాల అభివృద్ధికి -కారికంగా అందిన సహాయం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల కన్నా ఎక్కువ. ఇది భారతదేశానికి విదేశీ మారక ద్రవ్యమే కాదు. లక్షలాది మందికి సామాజిక భద్రతా కవచంలా పనిచేస్తోంది. ఎంతో ముఖ్య మైన ఈ మొత్తాలు అధిక లావాదేవీ రుసుములతో ఒత్తిడిని ఎదు. ర్కొంటున్నాయి. ప్రపంచ వ్యాప్తంగా ఈ ఫీజు 2023లో సగటున 6.18 శాతంగా ఉంది. కొన్ని దేశాల్లోనైతే ఆ ఫీజు 8 శాతం పైచిలు కుగా ఉంది. అసమంజసంగా ఉన్న ఈ ఫీజుల భారాన్ని తగ్గించాలనీ, ప్రపంచంలోని పేదలకు ఊరట కల్పించాలనీ ఐక్యరాజ్య సమితి భావించింది. విదేశాల నుంచి నగదు జమ చేసేవారిపై పడే ఫీజుల భారాన్ని 3% కన్నా తక్కువకు తీసుకురావాలని లక్ష్యంగా పెట్టు కుంది. లావాదేవీల రుసుము 5% కన్నా మించి ఉన్నవి 2030 నాటికి ఒక్కటి కూడా లేకుండా చేయాలని సంకల్పించింది.

**సుస్థిర అభివృద్ధి లక్ష్య స్ఫూర్తికి తూట్లు**
ట్రంప్ ప్రతిపాదిత పన్ను ఈ అంతర్జాతీయ నిబద్ధతపై ప్రత్యక్ష దాడి కిందకే వస్తుంది. ఇది లావాదేవీ జరిపినందుకు మోస్తున్న భారాన్ని మరింత పెంచడమే కాదు, ఆర్థిక అన్యాయానికి చట్టబద్ధత కల్పించినట్లు అవుతుంది. విదేశాల్లో రకరకాల ఉద్యోగాలు చేస్తూ బతుకుతున్నవారు తమ వ్యక్తిగత కోరికలను పక్కనబెట్టి, తమకున్న పరిమిత ఆదాయంలో గణనీయమైన మొత్తాన్ని కుటుంబాల సంక్షి మానికి పంపుతున్నారు. లావాదేవీ ఫీజుకు తోడు మరో 5% పన్ను విధించడం వారిని శిక్షించడం, దోచుకోవడమే అవుతుంది. ఐక్యరాజ్య సమితి నిర్దేశించుకున్న పేదరికం లేకుండా చేయడమనే సుస్థిర అభి వృద్ధి లక్ష్యం (ఎస్.డి.జి.) స్ఫూర్తికి తూట్లు పొడిచినట్లవుతుంది.

**ఉద్యోగ, ఉపాధి అవకాశాలు దూరం**
మెషినరీ, మెకానికల్, రత్నాలు-ఆభరణాల రంగాలకు దెబ్బ ఈసారి జీడీపీ 6 శాతమే! ఇలాగైతే వికసిత భారత్ గల్లంతే హైదరాబాద్ ఆమె రికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దేశంలోకి దిగుమతయ్యే భారతీయ వస్తూత్పత్తులకు విధించిన సుంకాలపై ఆర్థికవేత్త టారిఫ్ ను ట్రంప్ 50 శాతానికి పెంచిన విషయం తెలిసించే దీనిపై పలువురు ఆర్థికవేత్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దేశ జీడీపీలో ఎగుమ తుల వాటా దాదాపు 22 శాతంగా ఉందన్న ,ఇందులో 17 శాతం అమెరికాకే ఎగుమతి అవుతున్నట్టు చెప్పవచ్చు. కాబట్టి ఈ సుంకాలతో ఈ ఆర్థిక సంవత్సరం (2025-28) భారత జీడీపీ అర శాతం (50 బేసిస్ పాయింట్లు) తగ్గిపోవచ్చని ఆర్థిక నిపుణులు అంటున్నారు. గత ఆర్థిక సంవత్సరం (2024-25) దేశ జీడీపీ 8.5 శాతంగా నమోదైన దృష్ట్యా ఈసారి అది 6 శాతానికి పరిమితం కావచ్చన్న ది వాస్తవం. సుంకాల భారం ఇలాగే కొనసాగితే మాత్రం ఏటా అర శాతం చొప్పున దేశ జీడీపీ వృద్ధిరేటు క్షీణించే ప్రమాదం ఉందని హెచ్చరించడం గమనార్హం. ఐదే జరిగితే వికసిత భారత్ లేదా అన్ని దారలా అభివృద్ధి చెందిన దేశంగా భారత కలలు కల్లలేనని ఆర్థిక నిపుణులు అంటున్న మాటలు. దీనివల్ల అల్పాదాయ వర్గాలకు దెబ్బ సుంకాల భారం పెరిగితే దేశీయ మెషినరీ, మెకానికల్ అప్లియెన్సెస్, రత్నాలు-ఆభరణాల వంటి కార్మిక ఆధారిత రంగాలు కుదేలవుతా !దీంతో అల్పాదాయ వర్గాల జీవనోపాధి ప్రమాదంలో పడవచ్చని తెలుస్తుంది. ఇది అన్ని రకాలుగా చాలాచాలా ప్రమాదకరమని పేర్కొన్నారు. నిజానికి ఇప్పుడున్న పరిస్థితుల్లో దేశంలో నిరుద్యోగం పెరిగితే అది ఇంకా ప్రమాదమేనని, ఈ బిలియన్ డాలర్లు (సేవ దంగ ఎగుమతులు, సుంకాల పోరు ఎక్కడికెళ్తుందోనన్న ఆందోళ నలు ఇప్పటికే ఆయా వ్యాపార, పారిశ్రామిక, ఆర్థిక నిపుణుల నుంచి వ్యక్తమవుతున్న విషయం తెలిసిందే కాగా, 2024-25లో భారత్-అమెరికా ద్వైపాక్షిక వాణిజ్యం 131.8 అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు, సంబంధాలు ఎలా ఉన్నా.. ఇతర దేశాలతో ట్రేడ్, వ్యాపార లావాదేవీలను బలోపేతం చేసుకోవాలి. వీలైనన్ని దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఉత్తమం. కొత్త మార్కెట్లను, అక్కడున్న అవకాశాలను అన్వేషించాలి. తద్వారా ఎగుమతులను విస్తరించాలి. పర్యాటకులను ఆకట్టుకునేలా దేశంలో మౌలిక సదుపాయా లను పెంపొందించుకోవాలి. యూరోపియన్ దేశాలు (ఈయూ), తూర్పు ఆసియా దేశా 'లతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోవాలి. అలాగే ట్రాన్స్-పసిఫిక్ భాగస్వామ్యం కోసం సమగ్ర, ప్రగతిదాయక ఒప్పందం (సీపీటీపీపీ)పై దృష్టి పెట్టాలి. సీపీటీపీపీలో చరిత ఆస్ట్రేలియా, బ్రూనై, కెనడా, జపాన్, మలేషియా, మెక్సికో, న్యూజీలాండ్, పేరు, సింగ పూర్, వియత్నాం తదితర 12 దేశాలతో స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం కుదిరినట్టే. -ఇందులో 88.5 బిలియన్ డాలర్లు అమెరికాకు భారత ఎగుమతులుంటే, 45.3 బిలియన్ డాలర్లు భారతు అమెరికా ఎగుమతులున్నాయి. రష్యాతో సంబంధాలపై.. రష్యా నుంచి భారత్ చౌకగా ముడి చమ రును కొటున్నదని, ట్రంప్ బెదరిం తయ భయపడి దీనికి బదులుగా సౌదీ అరేబియా వంటి దేశాల నుంచి క్రూడాయిల్ను కొంటే ఎక్కువగా చెల్లించాల్సి వస్తుంది. అప్పుడు దేశంలో ద్రవ్యోల్బణం విజృంభించే వీలుందని, ఇది యావత్తు దేశ ఆర్థిక వ్యవస్థనే ప్రభావిత ఉంటుందని పేద మధ్యతరగతి వర్గాలకు ఇది మరింత భారం కానుంది. మారిన కాల పరిస్థితుల దృష్ట్యా సమాజంలోని ప్రతి ఒక్కరూ ఆధునిక జీవన వ్యవస్థకు అలవాటు పడడం గమనించదగ్గ విషయం. కాబట్టి దేశంలో ప్రజలు ఆర్భాటాలకు పోతే ఆర్థికంగా కృంగిపోక తప్పదు. దేశ ప్రజల మౌలిక వసతులు కల్పనకు ప్రభుత్వాలు చేపడుతున్న కంటి తూర్పు చర్యలే తప్ప శాశ్వతంగా సమస్య పరిష్కారానికి మార్గాలు వెతకడం లేదు. ఇది దేశ భవిష్యత్తుకు ముఖ్యంగా ఆర్థిక వ్యవస్థ కు భంగం కలిగే ప్రమాదం లేకపోలేదు. ఇప్పటికే చైనా నుండి దిగుమతి చేసుకునే యూరియా , ఇతర రసాయనిక ఎరువులు ఆ దేశం నిలిపివేయడంతో దూర దేశాలతో ఒప్పందం చేసుకుని దిగుమతి చేసుకోవడం వల్ల భారతీయ రైతులకు మరింత ఆర్థిక భారం కానుంది. ప్రభుత్వాలు ఇది గమనించి ముందుకు పోతే మంచిది.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

## నేడు హైదరాబాద్‌లో ట్రాఫిక్ ఆంక్షలు



**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** ప్రముఖ టాలీవుడ్ నటుడు జూని యర్ ఎన్టీఆర్ నటించిన వార్2 ప్రీ రిలీజ్ ఈవెంట్ ఆదివారం హైదరా బాద్ నగరంలో జరగనుంది. ఈ ప్రీ రిలీజ్ ఈవెంట్‌కు యూసుఫ్ గూడబె టాలి యన్ పోలీసు లైన్స్ వేదిక కాను ంది. ఆదివారం సాయంత్రం 5 గంట ల నుంచి రాత్రి 10 గంటల వరకు ఈ వేడుక జరగనుంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ పోలీసులు ఆ పరిసర ప్రాం తాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. -జూబ్లీహిల్స్ చెక్‌పో స్టు నుంచి కోట్ల విజయ్ భాస్కర్ రెడ్డి స్టేడియం వైపు వచ్చే వాహ నాలను కృష్ణా నగర్ జంక్షన్ వద్ద మళ్లించి, శ్రీనగర్ కాలనీ, పంజాగుట్ట వైపునకు మళ్లించ నున్నా రు.మైత్రివనం జంక్షన్ నుంచి జూబ్లీహిల్స్ చెక్ పోస్టు, మాదాపూర్ వైపు వెళ్లే వాహనాలను యూసుఫ్‌గూడ బస్తీ నుంచి ఆర్బీఐ క్వార్టర్స్, కృష్ణా నగర్ జంక్షన్ వైపుమళ్లిం చనున్నారు.మైత్రి వనం జంక్షన్ నుంచి బోరబం డ బస్టాప్ వైపు వెళ్లే వాహనాలను సవేర ఫంక్షన్ హాల్ మీదుగా కృష్ణ కాంత్ పార్క్, జీటీఎస్ టెంపు ల్, కల్యాణ్ నగర్, మోతీ నగర్ మీదుగా బోరబం డకు మళ్లించనున్నారు. బోరబండ బస్టాప్ నుంచి మైత్రివనం జంక్షన్ వైపు వచ్చే వాహనాలను ప్రైమ్ గార్డెన్ వద్ద మళ్లించి, మిడ్ ల్యాండ్ బేకరీ, జీటీఎస్ కాల నీ, కల్యాణ్ నగర్ జంక్షన్, ఉమేశ్ చంద్ర విగ్రహం యూటర్న్, ఐసీఐసీఐ యూటర్న్ మీదుగా మైత్రివనం జంక్షన్‌కు మళ్లించనున్నారు.

## ఆదివాసి సంస్కృతిని భావితరాలకు అందిద్దాం

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



**మంచిర్యాల ప్రతినిధి ఆగస్టు 9 (జనంసాక్షి):** ఆదివాసీల సంస్కృ తి సాంప్ర దాయాలు ప్రపంచ వ్యాప్తంగా ప్రసిద్ధి చెందాయని, ఎంతో గొప్పతనం కలిగి న సంస్కృతిని కాపాడి భావితరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం మంచిర్యాల పట్టణంలోని వైశ్య భవన్ లో ఏర్పాటు చేసిన ఆదివాసీ దినోత్సవ వేడుకలకు హాజరైన జిల్లా కలెక్టర్, ఆదివాసి సంఘాల నాయకు లకు గిరిజన సంప్రదాయ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడు తూ... ప్రపంచ స్థాయిలో గుర్తింపు పొందిన ఆదివాసీ సంస్కృతి, సంప్ర దాయాలను భావితరాలకు అందించాలని, ప్రతి ఒక్కరూ బాధ్యత గా తీసుకోవాలని అన్నారు. ఆదివాసి, గిరిజనుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తుందని తెలిపారు. గిరిజనులకు విద్య, వైద్యం అందించడంపై ప్రత్యేక దృష్టి సారించ డం జరుగుతుందని, గిరిజన ప్రాంతాలలో ప్రభుత్వం పాఠశాల లను అభివృద్ధి చేసిసకల సదుపాయాలు కల్పించి గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించడం జరుగుతుందని, గిరిజన యువత పిల్లలు పాఠశా లలకు క్రమం తప్పకుండా వచ్చేలా అవగాహన కల్పించాలని తెలిపారు. గిరిజన ప్రాంతాలలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటుందని, గిరిజన మహిళలు, పిల్లల సంక్షేమం కోసం ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. గిరిజన ప్రాం తాలకు రహదారుల సౌకర్యం కల్పించి ప్రాంతాల అభివృద్ధికి కృషి చేయడం జరుగుతుందని, ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని అభివృద్ధి చెందాలని తెలిపారు. ఆదివాసీ దినోత్సవం సందర్భంగా గిరిజ నులు ప్రదర్శించిన సంప్రదాయ నృత్యాలు అందరిని అలరించాయి.

శనివారం రోజున రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని బాలికలు జిల్లా కలెక్టర్ కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికా రులు, ఆదివాసి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## చిన్నారి వైద్యానికి లిటిల్ సోల్జర్స్ టీమ్ ఆర్థిక సాయం



**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** నకిరేకల్‌కి చెందిన లిటిల్ సోల్జర్స్ టీం రక్షా బంధన్ రోజు చిన్నారి పాప వైద్య చికిత్సకు సాయం అందించి పెద్ద మనస్సు చాటుకుంది. జనగామ జిల్లా ఘా న్పూర్ మండలం ఇప్పగూడెంకు చెందిన దీకొం డ ప్రభాకర్ - అనూషల కూతురు ప్రణవి (3) న్యూమోనియా, హార్ట్ బ్లాక్ సమస్యతో బాధపడు తుంది. రోజు డయాలసిస్‌తో హైదరాబాద్‌లోని ఎల్బీనగర్‌లో గల అంకుర హాస్పిటల్ చికిత్స పొందుతుంది. డబ్బులు లేక ఇబ్బంది పడుతు న్నారన్న విషయం తెలిసిన నకిరేకల్‌కి చెందిన లిటిల్ సోల్జర్స్ ఫౌండేషన్ మిత్రులు శనివారం ఆస్పత్రికి వెళ్లి పాప చికిత్సకు రూ.22,200 సాయం అందించారు. ఈ కార్యక్రమంలో బ్రహ్మ దేవర నరేశ్, కర్నాటి నరేశ్, బట్టిపల్లి వెంకన్న, బొల్లేని నవీన్, బాణోతు రవి పాల్గొన్నారు.

## 1336 కి.మీ మేర రైల్వే లైన్ల నిర్మాణం

- రూ.32,982 కోట్ల పనులకు డీపీఆర్
- ఏపీలో కొత్తగా రైల్వే లైనులు
- ప్రస్తుతమున్న లైన్లకు అదనంగా మరికొన్నింటిని కలిపి
- మొత్తం 1,336.60 కి.మీ నిర్మాణానికి ప్రతిపాదనలు



**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** రాష్ట్రంలో వివిధ మార్గాల్లో కొత్త రైల్వేలైన్ల నిర్మాణం, ప్రస్తుతమున్న లైన్లకు అదనంగా మరికొన్నింటిని కలిపి మొత్తం 1,336.60 కి.మీ. మేర రైల్వేలైన్ల నిర్మాణానికి సంబంధిత శాఖ అధి కారులు రైల్వేబోర్డుకు ప్రతిపాదనలు పంపారు. అనంతరం వీటికి దాదాపు రూ.32,982 కోట్ల ఖర్చవుతుందని అధికా రులు అంచనా వేశారు.ఇందులో భద్రాచలం-కొవ్వూరు 70.30 కిలోమీటర్లు, ముద్దనూరు-పులివెందుల-ముదిగు బ్బ-శ్రీసత్యసాయి ప్రశాంతి నిలయం 105.31 కిలోమీట ర్లు, అట్టిపట్లు-పుత్తూరు 30 కిలోమీటర్లు (ఏపీ పరిధిలో) కలిపి మొత్తం 205.61 కిలోమీటర్ల కొత్త లైన్లు ఉన్నాయి. మిగిలినవి వివిధ ప్రధాన మార్గాల్లో రద్దీ పెరగడంతో అదనంగా రెండు, మూడో, నాలుగో లైన్ల నిర్మాణానికి అధి కారులు డీపీఆర్‌లు సిద్ధం చేసి రైల్వేశాఖకు పంపారు.

**రైల్వే నిధులతో భద్రాచలం-కొవ్వూరు లైన్**

భద్రాచలం-కొవ్వూరు కొత్త లైన్‌లో సత్తుపల్లి నుంచి కొవ్వూ రు వరకు 118.9 కిలోమీటర్లు నిర్మాణాన్ని చేపట్టాల్సి ఉంది. భద్రాచలం రోడ్డు నుంచి సత్తుపల్లి వరకూ ఇప్పటికే లైన్ను నిర్మించారు. మిగిలిన 118.9 కిలోమీటర్లలో తెలం గాణ పరిధిలో 48.58 కిలోమీటర్లు, ఆంధ్రప్రదేశ్ పరిధిలో 70.315 కిలోమీటర్లు ఉంది. ఈ మార్గం సత్తుపల్లి నుంచి అశ్వారావుపేట, జీలుగుమిల్లి, జంగారెడ్డిగూడెం, పొంగు టూరు, చిన్నయ్యగూడెం, దేవరపల్లి వైపుగా కొవ్వూరు వద్ద విజయవాడ-విశాఖపట్నం రైల్వే లైన్‌లో కలుస్తుంది. ఈ ప్రాజెక్టుకు సంబంధించి దాదాపు రూ.1,695.71 కోట్లు వ్యయం అవుతుందని డీపీఆర్‌లో పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు వ్యయంలో కొంత భాగం ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు భరించాలని, లేకపోతే ఈ ప్రభుత్వాలే భూమిని సేకరించి ఇవ్వాలని రైల్వేబోర్డు తెలిపింది. కానీ రాష్ట్ర విభజన చట్టం లో పేర్కొన్న వివరాల ప్రకారం ప్రాజెక్టును పూర్తిగా రైల్వే నిధులతోనే చేపట్టాలని దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజ ర్‌కు ఏపీ ప్రభుత్వం లేఖ రాయడం గమనార్హం.

**అమృత్ పథకం కింద దాదాపు 73 రైల్వే స్టేషన్లు**

ఏపీకి ఈ సంవత్సరం రైల్వేలకు రూ.9,151 కోట్లు కేటా యించినట్లు కేంద్ర మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. యూపీఏ ప్రభుత్వంలో కేటాయింపుల కంటే పది రెట్లు పెంచామన్నారు. కేంద్ర బడ్జెట్లో తెలుగు రాష్ట్రాలకు రైల్వే కేటాయింపులపై దిల్లీలో ఇటీవల ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరించారు. ఏపీలో మొత్తం రూ.73,743 కోట్లతో రైల్వే ప్రాజెక్టు పనులు కొనసాగు తున్నాయని స్పష్టం చేశారు. అమృత్ పథకం కింద దాదాపు 73 రైల్వే స్టేషన్లు అభివృద్ధి చేస్తున్నట్లు ఆయన చెప్పారు. ఏపీలో సైతం వంద శాతం రైల్వేలు విద్యుద్దీ కరణ జరిగాయని కేంద్రమంత్రి అన్నారు. ఏపీ రైల్వే అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని అశ్వినీ వైష్ణవ్ స్పష్టం చేశారు. అమరావతి రైల్వే ప్రాజెక్టు పనులు పురోగతిలో ఉన్నాయని చెప్పారు. ఏపీలో పది సంవత్సరా లలో 743 అండర్ పాస్‌లు, పైవంతెనల నిర్మాణం జరిగిం దన్నారు. అమరావతిని అనుసంధానిస్తూ 56 కి.మీ మేర రూ.2,047 కోట్లతో ప్రాజెక్టు మొదలు కానుందన్నారు.

## సృజనాత్మకతను చాటుకున్న మహాత్మా జ్యోతిబా పూలే పాఠశాల విద్యార్థులు

**క్లబ్ యాక్టివిటీలో విద్యార్థినుల నైపుణ్యం**



**బూర్గంపహాడ్ ఆగస్టు 09 (జనంసాక్షి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా :- పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా పాల్పంచ మహాత్మా జ్యోతిబాపూలే బాలికలు పాఠశా లలో అందుబాటులో ఉన్న వస్తువులను ఉపయోగించి రాఖీలు తయారుచేసి తమ నైపుణ్యా న్ని ప్రదర్శించారు. శనివారం పాఠశాలలో క్లబ్ యాక్టివిటీ లో భాగంగా విద్యార్థులు పాఠశాల ఆవరణలో ఉన్న పువ్వులు, కొబ్బరి ఆకులు, రంగుల పెన్సిల్‌లు, కాగితాలు వంటివి ఉపయోగి ంచి వినూత్న పద్ధతిలో రఖీలను తయా రుచేసి అందరినీ ఆశ్చర్యపరిచేలా చేసా రు. విద్యార్థుల సృజనాత్మకతను పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.ఏ. క్రాంతి అభినందించి ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు వివిధ రూపాలలో వారిలో దాగివున్న ప్రతిభను వెలికి తీసేందుకు క్లబ్ యాక్టివిటీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని, తద్వార విద్యార్థులలో దాగివున్న వివిధ కళలను గుర్తించే అవకాశం ఉంటుంద న్నారు. అందుకుగాను విద్యార్థులకు ఉపా ధ్యాయులు పూర్తి సహకారాన్ని అంది ంచిని ఉన్నత విద్యార్థులుగా తీర్చిదిద్దే భాధ్యత ఉపాధ్యా యులుగా మనపైన ఉందన్నారు. దీంట్లో భాగంగానే రోజుకు ఒక యాక్టివిటీ ని నిర్వహిస్తూ మెహిందీ, రంగోలి, డ్రాయింగ్, క్రాఫ్ట్, హెయిర్ స్టైల్, సబ్జెక్టు లకు సంబంధించిన క్లబ్ యాక్టివి టీలు, పద్య రచన, పాటల పోటీలు, వ్యాస రచనలు వంటివి నిర్వహి స్తున్నామని, చదువుతో పాటు భవిష్య త్తులో ఉపయోగపడే ఇతర వృత్యంత కోర్సులు విద్యార్థులు నేర్చుకోవడానికి దోహద పడుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎటిపి అనూష, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సిరిపురంలో వీధి కుక్కల స్వైర విహారం

**మర్పల్లి (జనంసాక్షి):** గ్రామాలలో వీధి కుక్కలు ఎక్కువ అవుతు ండడంతో కాలనీవాసులు రోడ్డుపై తిరగడానికి భయభ్రాంతు లకు గురి అవుతున్నారు. రాత్రి సమయంలో రోడ్డుపై ఒంటరి గా వెళుతున్న వారిని గుంపుగా వచ్చి దాడి చేస్తున్నాయి. మండలంలో చిన్నపిల్లల పై దాడి చేసిన సంఘటనలు ఎన్నో ఉన్నాయి. మండల పరిధిలోని సిరిపురం గ్రామంలో కుక్కల బెరద అధికంగా ఉందని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన ఇలాంటి ప్రయోజనం లేదని గ్రామ ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. గత నెల క్రితం ఘనాపూర్ గ్రామానికి చెందిన వృద్ధు డు నీ పై వీధి కుక్కలు దాడి చేశాయి. ఆయన ఆ సుపత్రిపాలై మృతి చెందాడు. ఇప్పటికైనా అధికా రులు స్పందించి గ్రామాలలో కుక్కల బెడద తమ ను రక్షించా లని గ్రామస్తులు కోరుకుంటున్నారు.

## ప్లాస్టిక్ సర్జరీల్లో పేషెంట్ల భద్రతకు ప్రాధాన్యమివ్వాలి

- సేఫ్ ప్లాస్ట్-2025 సదస్సులో డాక్టర్ సంజయ్ పరాశర్
- టీ హబ్‌లో ఘనంగా ప్రారంభమైన రెండు రోజుల సదస్సు




**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** టెక్నాలజీ ఎంతగా అభివృద్ధి చెందినా, వైద్య శాస్త్రంలో సరికొత్త మార్పులు వస్తున్నా ఇప్పటికీ హెయిర్ ట్రాన్స్‌ప్లాం ట్, లేజర్ చికిత్సలు, ముఖానికి సంబంధించిన మార్పుల కోసం చేయించు కునే శస్త్ర చికిత్సల విషయంలో చాలామంది వెనకడుగు వేస్తున్నారు. దానికి ప్రధాన కారణం, చేయించుకుంటే ఏమైనా అవుతుందేమోనన్న భయం. రోగుల్లో ఈ భయం రావడానికి కూడా కారణాలు లేకపోలేదు. కొన్నిసార్లు ఈ తరహా చికిత్సల వల్ల కొంతమందికి ఇన్ఫెక్షన్లు రావడం, రకరకాల సమ స్యలు తలెత్తడం లాంటివి ఉంటున్నాయి. కుప్పలు తెప్పలుగా నకిలీ వైద్యులు పుట్టుకురావడం, ఉన్నవారిలో కొందరికి నైపుణ్యాలు లేకపోవడం ఇందుకు ప్రధాన కారణాలని వక్తలు పేర్కొన్నారు.

**టీ-హబ్ వేదికగా సేఫ్ ప్లాస్ట్ -2025 సదస్సు**

రోగులకు ఈస్థటిక్ చికిత్సలు, కాస్మొటిక్ శస్త్రచికిత్సలు, ప్లాస్టిక్ సర్జరీలు అత్యంత సురక్షితంగా చేయడం ఎలాగన్న విషయాన్ని తెలియజేయడమే ప్రధాన ఉద్దేశంగా నగరంలోని టీ-హబ్ వేదికగా రెండు రోజుల పాటు నిర్వ హించే సేఫ్ ప్లాస్ట్-2025 సదస్సు శనివారం ఘనంగా ప్రారంభమైంది. దేశవ్యాప్తంగా పలు ప్రాంతాలకు చెందిన 120 మందికి పైగా ప్లాస్టిక్ సర్జన్లు, డెర్మటాలజిస్టులతో పాటు విదేశాల నుంచి ఆన్‌లైన్‌లో కూడా కొందరు పాల్గొ న్న ఈ సదస్సులో దేశ విదేశాల నుంచి 25 మంది సీనియర్ ప్లాస్టిక్ సర్జన్లు వివిధ అంశాలపై మాట్లాడి అవగాహన కల్పించారు.

**పుస్తకాలు చూసి సర్జరీలు చేయడం సరికాదు**

ఈ సదస్సులో దుబాయ్‌కి చెందిన ప్రముఖ సీనియర్ ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ సంజయ్ పరాశర్ మాట్లాడుతూ ప్లాస్టిక్, ఈస్థటిక్ సర్జరీలు చాలా సంక్లిష్టమైనవన్నారు. కొన్ని సందర్భాల్లో మనం నూటికి నూరు శాతం కృషి చేసినా, ఫలితాలు మాత్రం అలా ఉండకపోవచ్చని తెలిపారు. మరికొన్నిసార్లు అనుకోని అవాంతరాలు ఎదురవుతుంటాయని, అలా ఏదైనా సమస్య వచ్చినప్పుడు దాన్ని ఎలా పరిష్కరించుకోవాలో తెలియడం ముఖ్యమని డాక్టర్ సంజయ్ పరాశర్ అన్నారు. అలాగే అసలు సమస్యకు కారణం ఏంటన్నది కూడా గుర్తించాలని, అసలు ప్రక్రియ ఎలా చేయాలన్నది తగినంత శిక్షణ లేకుండా కేవలం పుస్తకాలు చూసి చేయడం కూడా సరికాదన్నారు.

## ఉద్యోగ, ఉపాధికి భరోసానిచ్చే టీ-గేట్

- ఐటీఐ విద్యార్థులకు ఉద్యోగవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక కమిటీలు
- టీగేట్ విధానం తీసుకువచ్చిన రాష్ట్ర ప్రభుత్వం



**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** ఐటీఐల్లో(పారిశ్రామిక శిక్షణ సంస్థలు) శిక్షణ పొంది నైపుణ్యాలతో బయటకు వస్తున్న విద్యార్థులు ఉపాధి, ఉద్యోగ అవకాశాలను అందిపుచ్చుకోవడంలో మాత్రం వెనుకబడుతున్నారు. ఈ క్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం స్థానిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా వారికి నైపుణ్య శిక్షణను(స్కిల్ ట్రైనింగ్)ను ఇవ్వడం. ఆ పరిశ్ర మలతో మాట్లాడి ఉద్యోగ అవకాశాలను కల్పించడంపై మరింత దృష్టి సారిం చింది. ఈ నేపథ్యంలోనే తెలంగాణ గేట్ ఫర్ అడాప్టింగ్ అండ్ ట్రైనింగ్ ఎంప్లాయ్‌మెంట్ (టీ-గేట్) విధానాన్ని రూపొందించింది. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని గవర్నమెంట్ ఐటీఐలతోపాటు అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ)లను, స్థానికంగా అందుబాటులో ఉన్న పరిశ్రమలకు అనుసంధానం చేస్తూ శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నారు. కోర్సులు పూర్తి కాగానే ఆయా పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించనున్నారు.

**ప్రత్యేక కమిటీలు**

టీ-గేట్ విధానం ద్వారా స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించేందుకు 4 జిల్లాల్లో టీ-గేట్ జిల్లా ప్లేస్‌మెంట్ కమిటీ లను ఏర్పాటు చేశారు. ఇందులో ఛైర్మన్‌గా ఏదైనా పరిశ్రమకు సంబం ధించిన ఉన్నతాధికారి, కన్వీనర్‌గా ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, సభ్యులుగా ఫ్యాక్టరీస్, కార్మికశాఖ, ఉపాధి, కల్పన శాఖలకు సంబంధించిన అధికారులు, ఒక ఎన్‌జీవో(స్వచ్ఛంద సంస్థ) సంస్థ ప్రతినిధి ఉంటారు. స్థానికంగా ఉన్న పరిశ్రమల యాజమాన్యాలతో ఈ కమిటీలు చర్చలను జరిపి విద్యార్థులను సిఫార్సు చేస్తాయి. నాలుగు జిల్లాల్లో ఇప్పటికే వివిధ పరిశ్రమల ప్రతినిధులతో అధికారులు సమావేశాలు జరిపారు.

## త్వరలో కొత్త భవన నిర్మాణ నిబంధనలు

- అధ్యయనానికి కన్సల్టెన్సీ నియామకం
- మూడు నెలల్లో ప్రభుత్వానికి నివేదిక

**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** రాష్ట్రంలో ప్రణాళికాబద్ధమైన అభివృద్ధి, నిర్మాణ కార్యకలా పాలను మరింత సమర్థంగా నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు కొత్త భవన నిర్మాణ నిబంధనలను రూపొందించేందుకు కసరత్తును ప్రారంభిం చింది. హెచ్‌ఎండీఏ కమిషనర్ ఛైర్మన్‌గా ఇప్ప టికే ఏర్పాటైన కమిటీ ఓ కన్సల్టెన్సీని సెలక్ట్ చేసి ంది. మహారాష్ట్ర, దిల్లీ, పంజాబ్, కేరళ, తమిళ నాడు, కర్ణాటక రాష్ట్రాలతోపాటు సింగ పూర్, జర్మనీ లాంటి దేశాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలను అధ్యయనం చేయించాలని ఆదేశా లిచ్చింది. అక్కడి భవన నిబంధనలను పరిశీలిం చి మూడు నెలల్లో ప్రభుత్వానికి కన్సల్టె న్సీ రిపోర్ట్‌ను ఇవ్వనుంది.ప్రస్తుతం 2012లో జారీ చేసిన జీ.వో.168 ఉత్తర్వులోని రూల్స్ అమల్లో ఉన్నాయి. వాటికి కాలానుగుణంగా ప్రభుత్వాలు పలు సవరణలు చేశాయి. వీటివల్ల లాభంతో పాటు సమస్యలూ ఉత్పన్నమవు తున్నాయని ప్ర ణాళిక విభాగం చెబుతోంది. అదే సమయంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వశాఖ 2016లో నిర్మాణ అనుమతులకు కొత్త చట్టాలను కూడా తీసుకొ చ్చింది. వాటిని దృష్టిలో ఉంచుకుని, కొత్త నిబం ధనలు సిద్ధం చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణ యించింది. జీహెచ్ఎ ంసీ(గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్), హెచ్‌ఎండీఏ పరిధిలో ఇప్పటికే సైబరాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ, హుడా లాంటి పలు రకాల మాస్టర్‌ప్లాన్‌లు అమల్లో ఉన్నాయి. కొన్ని చోట్ల ఇళ్లకు, వ్యాపార కేంద్రాలకు కలిపి నిర్మాణ అనుమతులివ్వడం, ఇతర జోన్లకు ఆ నిబంధన వర్తించకపోవడం, హెచ్‌ఎండీఏ పరిధిలోని ఇళ్ల నిర్మాణంతో కలిపి లేఅవుట్‌కు జారీ చేస్తున్న అనుమతుల వల్ల ఎదు రయ్యే సమస్యలకు కొత్త నిబంధనల్లో పరిష్కారం లభిస్తుందని అధికారులు చెబుతున్నారు. కన్సల్టె న్సీ నిపుణుల సిఫార్సుల ఆధారంగా ఏడాది చివరికి నిర్మాణ అనుమతు లు-2025' అందుబా టులోకి వస్తాయని ప్రణా ళిక విభాగం తెలిపింది.హైదరాబాద్ నగరానికి వచ్చే ముప్పై ఏళ్ల కాలానికి సంబంధించిన హెచ్‌ఎండీఏ ఆధ్వ ర్యంలో మెగా మాస్టర్ ప్లాన్ సిద్ధమవ్వనుంది. ఇం దులో భాగంగా కీలకమైన మూడు అంశాలపై హెచ్‌ఎండీఏ దృష్టి సారిం చనుంది. కన్సల్టెన్సీల ఎంపిక కోసం ఈ నెలలోనే ఆసక్తి వ్యక్తీకరణ కోసం నోటిఫికేషన్?ను విడు దల చేయనున్నారు. వీటి ఆధారంగానే ప్రధాన మెగా మాస్టర్‌ప్లాన్‌కు హెచ్‌ఎండీఏ శ్రీకారం చుట్ట నుంది. హైదరాబాద్ మహానగరంలో రానున్న కాలంలో ప్రజా రవాణా పరిస్థితి తెలుసు కోవ డా నికి సీఎంపీ ద్వారా అధ్య యనం చేస్తున్నారు. అలాగే ఎకనామిక్ డెలవప్ మెంట్ ప్లాన్‌లో ఉపా ధి అవకాశాలు, ప్రజల ఆదాయ మార్గాలను తెలు సుకుంటున్నారు. నగరంలో నీటి వనరులు, చెరు వులు, అడవుల రక్షణ వాటిపై జీబీఈపీ ద్వారా అధ్యయనం చేస్తున్నారు. వీటి ఆధారంగా ప్రధాన మాస్టర్ ప్లాన్ రూపకల్పనకు కార్యాచరణ సిద్ధం చేయనున్నారు చేయనున్నారు. ప్రస్తుతానికి మహా నగరంలో5 రకాల మాస్టర్?ప్లాన్‌లు అందు బా టులో ఉండగా వీటిని మెగా మాస్టర్? ప్లాన్? లో మిళితం చేసి ఒకటే అందుబాటులోకి రానుంది.

## తమ్ముడి ప్రాణాలు కాపాడిన అక్క




**మహబూబ్ నగర్ ఆగస్టు 9(జనం సాక్షి) :** ప్రాణాపా యంలో ఉన్న తమ్ము డిని అక్క రక్షించిన ఘటన మహబూబ్ నగర్ జిల్లాలో చోటు చేసుకుంది. అరుదైన వ్యాధితో బాధపడు తూ ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్నతన తమ్ము డికి అక్క మూల కణాలను దానం చేసింది. వివరాలలోకి వెళితే.. మహ బూబ్ నగర్ జిల్లాకు చెందిన 5 సంవత్సరాల బాలుడు అప్లాస్టిక్ అనీమియా అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్నాడు. బాలుడిని పరిశీలించిన వైద్యు లు అతడి పరిస్థితి విషమంగా ఉందని వెంటనే మూల కణాలు మార్చా లన్నారు. ఇంటర్ చదువుతున్న బాలుడి సోదరి తన శరీరంలోని మూలక ణాలను దానం చేసి తమ్ముడి ప్రాణాలు కాపాడింది.రాఖీ పండుగా సందర్భ ంగా సికింద్రాబాద్ లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న తమ్ముడికి రాఖీ కట్టింది. నీకు నేనున్నాంటూ తమ్ముడికి అక్క దైర్యం చెప్పింది.

## ప్రయాణికులకు రైల్వే 'రౌండ్ ట్రిప్' రాయితీ

**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** పండగల వేళ ప్రయాణికులకు రైల్వే ఆఫర్ ప్రకటించింది. 'రౌండ్ ట్రిప్' పేరుతో కొత్త పథకాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా ప్రయాణ ఖర్చులో ప్రయాణికులకు కొంత మేరకు తగ్గించాలని నిర్ణయించింది. అయితే రిటర్న్ జర్నీ చేసినప్పుడే ప్రయాణికులకు అది వర్తిస్తుంది. రిటర్న్ టికెట్ బుక్ చేసుకుంటే 20శాతం రాయితీ ఇవ్వనున్న ట్లు తాజాగా ప్రకటించింది. దీని ద్వారా పండగల సమయంలో ముందస్తు టికెట్‌ను బుకింగ్‌ను ప్రోత్సహించినట్లు అవుతుంది. తద్వారా రైల్వేపై ఒత్తిడి కూడా తగ్గనుంది. ఆగస్టు 14 నుంచి బుకింగ్‌లు ప్రారంభిస్తున్నట్లు, అక్టోబర్ 13 నుంచి 26 నడుమ జరిపే ప్రయాణాలకు ఇది వర్తిస్తుందని రైల్వే వెల్లడించింది. దీనిని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించింది.

## హుస్సేన్‌సాగర్ గేట్లు ఎత్తివేత..
## మూసీకి పెరిగిన వరద ప్రవాహం



**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** నిండు కుండలా మారిన హుస్సేన్ సాగర్ గేట్లు ఎత్తి నీటిని కిందికి వదలటంతో మూసీ లో వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగింది. మూసారాంబాగ్ బ్రిడ్జిని, దోబీ ఘాట్‌ను తాకుతూ మూసీ నది ఉధృతంగా ప్రవహిస్తుంది. దాంతో ట్రాఫిక్ పోలీసులు వాహనాల రాకపో కలను గోల్నాక న్యూబ్రిడ్జి మీదుగా మళ్లించారు. మూసారాం బాగ్ బ్రిడ్జిపై ఒక పక్కకు కొత్త బ్రిడ్జి నిర్మాణ పనులు కొనసాగు తుండటంతో మరో పక్క నుంచి మూసారాంబాగ్ చౌరస్తా నుంచి వచ్చే వాహనాలను సింగిల్ వేలో అంబర్‌పేట వైపు వెళ్లే ందుకు అనుమతించారు. అంబర్‌పేట నుంచి మూసారాం బాగ్ వైపు వచ్చే వహనాలను గోల్నాక న్యూబ్రిడ్జి వైపు మళ్లించారు. అయితే మూసీలో వరద పరిస్థితులను జీహెచ్‌ఎం సీ, రెవెన్యూ, హైడ్రా అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షిస్తున్నారు. శు క్రవారం రాత్రి కన్నా శనివారం ఉదయం నుంచి వరద ప్రవా హం పెరిగిందని, మరిన్ని గేట్లు ఎత్తితే వరద ప్రవా హం బ్రిడ్జి పైనుంచి వెళ్లే అవకాశాలు ఉన్నాయని స్థానికులు పేర్కొన్నారు.

## హైదరాబాద్ జంటపై గోవాలో దాడి

**హైదరాబాద్ ఆగస్టు 9 (జనంసాక్షి) :** గోవాలో సెల వులు గడుపుతున్న హైదరాబాద్‌కు చెందిన జంటపై పనాజీ బస్టాండ్ వద్ద దాడి జరిగింది. వివరాల ప్రకారం, బైక్ అద్దె ఛార్జీల వివాదం తరువాత ఈ సంఘ టన చోటుచేసుకుంది. వారి సెలవుల సమయంలో ఆ జంట ఒక బైక్ అద్దెకు తీసుకున్నారు. ఆ బైక్ ఉపయోగించిన తర్వాత, వారు దానిని సమ యానికి తిరిగి ఇచ్చారు. సమయానికి తిరిగి వచ్చిన ప్పటికీ ఆ జంట అదనంగా రూ.200 చెల్లించాలని కోరారు. ఈ విషయం తీవ్రమై దాడికి దారితీసింది.

## లభించని ఉమా మహేష్ ఆచూకీ



**హైదరాబాద్ ఆగస్టు 9(జనంసాక్షి) :** పదిహేను రోజు లు గడిచినా ఉమా మహేష్ ఆచూకీ ఇప్పటికీ లభిం చలేదు. ఎస్ఆర్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బీకే గూడలోని బాలాజీ అపార్ట్‌మెం ట్స్‌లో నివాసం ఉండే కొల్లూరు ఉమా మహేష్(42) జాడ కోసం అతని కుటు ంబ సభ్యులతో పాటు పోలీసులు నాలభ్యం కాలేదు. చిన్ననాటి నుంచి మానసిక సమస్యతో ఇబ్బందులు పడే ఉమా మహేష్ గతం లోనూ ఇంటి నుంచి వెళ్లి తిరిగొ చ్చిన సందర్బాలు ఉన్నాయి. గత నెల 25వ తేదీన ఇంటి నుంచి ఉమా మహేష్ వెళ్లిపోయాడని అతడి సోదరైన వైద్యురాలు వాసంతి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొ న్నారు. అదృశ్యమైన ఉమా మహేష్ ఆచూకీ తెలిసిన వారు ఎస్ఆర్ నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ ఫోన్ నెంబర్ 8712661069కు లేదా డ యల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

# రాబోయే రెండు రోజులు జిల్లాలో భారీ వర్షాలు

- జిల్లా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు




**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 9 (జనం సాక్షి) :** శుక్రవారం నుండి కురుస్తున్న భారీ వర్షాల వల్ల జిల్లా లో వాగులు ఉధృతంగా ప్రవహిస్తునందున ఏ ఆపద వచ్చిన లోకల్ పోలీస్ అధికారులకు లేదా డయల్-100 లేదా పోలీస్ కంట్రోల్ రూమ్ 8712670306కు సమాచారం అందించగలరనీ జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు అన్నారు. గద్వాల జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నాయని అలాగే రాబోయే రెండు రోజులు అతి బారి వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలకు ఎలాంటి ప్రమాదం తలెత్తకుండా పోలీస్ శాఖ పరంగా తగిన ఏర్పట్లతో పోలీస్ అధికారులను, సిబ్బందిని సిద్ధం చెయ్యడం జరిగిందనీ, ప్రజలు కూడా గ్రామాలలో, పట్టణాలలో పాత ఇండ్లు,గుడిశ లలో, శిథిలావస్థలో ఉన్న నివాసలలో ఉండే వారు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాస రావు ప్రజలకు సూచించారు. వర్షాల వల్ల ప్రజలకు రహదారుల పై గాని,ఇతర ప్రదేశాల లో ఏ సమస్యా తలెత్తిన వెంటనే స్థానిక రెవెన్యూ, ఇరిగేషన్, పంచాయతీ, విద్యుత్, ఆర్% డ%బి, వైద్య శాఖ అధికారులతో సమన్వయం చేసుకుంటూ వర్షాల వల్ల కలిగే ప్రమాదాల పై స్పందించే విధంగా పోలీస్ అధికారులను సిద్ధం చెయ్యడం జరిగిందనీ అన్నారు. అలాగే కృష్ణ , తుంగభద్ర నది పరివాహక ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,గొర్రెలు, పశువులు కాపరులు అటువైపు గానీ , వాగులు,వంకలు వైపు వెళ్లవద్దని, గ్రామాలలో కూడా ఎప్పటికప్పుడు పరిస్థితులను తెలుసుకునేందుకు గస్తీ పోలీసులను అప్రమత్తం చెయ్యాలని అధికారులను ఆదేశించినట్లు ఎస్పీ తెలిపారు.వర్షాలలో విద్యుత్ స్థంబాలకు ఎర్థింగ్ ద్వారా విధ్యుత్ సరఫరా అయ్యి కరెంట్ షాక్ తగిలే అవకాశం ఉందని జిల్లా ప్రజలు పిల్లలు ఎవరు కూడా విద్యుత్ స్థంబాలను కానీ విద్యుత్ పరికరాలను ముట్టుకోకుండా వారిని జాగృతం చేయాలని ,అలాగే విద్యుత్ సరఫరా లో ఏదైనా లోపం ఉంటే వెంటనే సంబంధిత విద్యుత్ శాఖ అధికారులకు తెలియజేయాలని ప్రజలను కోరారు.బారి వర్షాల వల్ల ఏదైనా విపత్కర సమస్య వస్తే లోకల్ పోలీస్ అధికారులకు లేదా డయల్- 100 లేదా జిల్లా పోలీస్ కంట్రోల్ రూమ్ నెంబర్ 87126 70306 నెంబర్లకు సమాచారం అందించినచొ తక్షణ సహాయక రక్షణ చర్యలు పోలీస్ అధికారులు చేపడతారని జిల్లా ఎస్పీ తెలిపారు.

**జిల్లా ప్రజలకు పోలీస్ వారి విజ్ఞప్తి**

జిల్లాలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ప్రజలందరూ కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు పాటించగలరనీ, వర్షానికి తడిసిన విద్యుత్ స్థంబాలను, గోడలను తాకరాదు, వాటికి కరెంట్ షాక్ వచ్చి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంటుందనీ,ఇనుప వైర్ లపై గృహిణీ లు బట్టలు ఆరవేయరాదు కరెంట్ షాక్ తగిలే ప్రమాదం ఉంటుందనీ, ఇంటి పై కప్పుగా వేసిన ఇనుప రేకులను తాకరాదనీ, శిథిలావస్థలో ఉన్న ఇండ్లు ,మట్టీ గోడలు తో ఉన్న ఇళ్ళలో, ఉధృతంగా ప్రవహించే నాలల దగ్గర ఉండే నివాసలలో ఉండకండి,అవి ఊహించని విధంగా కూలిపోయి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉంటుందనీ,రైతులు మీ వ్యవసాయ బావుల వద్ద ,బోర్ ల వద్ద కరెంట్ పెట్టె ముందు తడిసిన స్టార్టర్ బాక్స్ లను,ఫ్యుజ్ బాక్స్ లను చేతులతో ముట్టుకోరాదనీ,వరద నీటికి చెరువులు, కుంటలు నిండి చెరువు కట్టలు తెగి పోయే ప్రమాదం ఉంటుందనీ, ప్రజలు అప్రమత్తంగా ఉండగలరనీ, చిన్నపిల్లలు, ఈత రానివారు ఎట్టిపరిస్థితుల్లో కూడా చెరువులోకి ఈతకు గాని లేదా చేపల వేటకు గాని వెళ్ళరాదనీ, తల్లిదండ్రులు పిల్లలను బయటికి వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవలసి ఉంటుందనీ, వాహనదారులు ప్రయాణించేటప్పుడు జాగ్రత్తగా ప్రయాణించండనీ, వర్షానికి రోడ్లు కొట్టుకుపోయి, గుంతలు ఏర్పడి, అందులో నీరు నిల్వ ఉండి ఆ గుంతలు వాహనదారులకు కనిపించక ప్రమాదానికి గురి అయ్యి ప్రాణ నష్టం జరిగే ప్రమాదం ఉందనీ,కావున జాగ్రత్తగా, నెమ్మదిగా చూసుకొని ప్రయాణించండనీ, వరదల వలన డ్రైనేజి కాలువల మ్యాన్ హోల్స్ వాటికవే తెరువబడి ఉంటాయి కావున జాగ్రత్త గా ప్రయాణించగలరనీ, వర్షాలకు కల్వర్టు,చిన్న చిన్న బ్రిడ్జి ల వద్ద నీరు ప్రవహిస్తున్నపుడు వాహనాలతో దాటడానికి సాహసం చేయకండనీ జిల్లా ఎస్పీ శ్రీనివాస తెలిపారు.

## ఘనంగా కాయితి కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలు




**వెల్దండ, ఆగస్టు 9 (జనంసాక్షి) :** వెల్దండ మండలం లోని పెద్దాపూర్ గ్రామంలో కాంగ్రెస్ యువ నాయకులు కాయితి కిషోర్ రెడ్డి జన్మదిన వేడుకలకు ముఖ్య అతిథులుగా హాజరైన కల్వకుర్తి శాసనసభ్యులు గౌరవనీయులు శ్రీ కసిరెడ్డి నారాయణరెడ్డి మరియు పొల్యూషన్ కంట్రోల్ బోర్డు నెంబర్ శ్రీ బాలాజీ సింగ్ కేక్ కటింగ్ చేసి శాలువాలతో ఘనంగా సత్కరించారు.రాబోయే రోజుల్లో కూడా ఉన్నత స్థాయికి ఎదగాలని ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు మోతిలాల్ నాయక్, పర్వత్ రెడ్డి, నాగర్ కర్నూల్ జిల్లా సేవాదళ్ ఉపాధ్యక్షులు కొయ్యల పుల్లయ్య, కాటిక రామస్వామి,శంకర్ నాయక్,పోలే రాజు, గ్రామ అధ్యక్షులు రమేష్ నాయక్, పాండు నాయక్, తక్కెళ్ళపల్లి శేఖర్, తక్కెళ్ళపల్లి జగన్, కొప్పు ఎర్రయ్య,కటిక సురేష్,పోలే రమేష్,గ్రామ యువకులు మహిళా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

## కరెంట్ సరఫరా సక్రమంగా జరగాలి

- మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**పాపన్నపేట, ఆగస్టు 9 (జనంసాక్షి) :** పాపన్నపేట మండల కేంద్రంకు విద్యుత్ సరఫరా సక్రమంగా జరుగుతుందా అని ఆ శాఖ సిబ్బందిని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అడిగి తెలుసుకున్నారు. శనివారం మిన్పూర్ 220/132/33 కేవీ సబ్ స్టేషన్ ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, ఏర్పాట్ల గూర్చి ఆరా తీసి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా సరఫరా అందేలా చూడాలని వారికీ ఆదేశించారు. ఈసందర్బంగా సిబ్బంది విజయ్ కుమార్, రఘువరన్, సంగయ్య ఉన్నారు.

## మట్టి ఇల్లు కూలి ఇద్దరికీ గాయాలు



**గద్వాల నడిగడ్డ, ఆగస్టు 9 (జనం సాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల పట్టణంలోని వేదనగర్ లో శుక్రవారం రాత్రి కురిసిన భారీ వర్షానికి మట్టి ఇల్లు కూలి ఇద్దరికీ గాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి గద్వాల పట్టణంలోని వేదానగర్ లో మట్టి ఇంటిలో నివాసముంటున్న దోత్రే వినోద్ కుటుంబం రాత్రి నిద్రిస్తుండగా కురిసిన భారీ వర్షానికి పల్లవి, పావనికి స్వల్ప గాయాలు కాగా ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. దోత్రే వినోద్ కిరాయి ఇంటిలో నివాసం ఉంటూ కాలం వెళ్ళదీస్తున్నాడు. ప్రభుత్వ ప్రకారంగా ఆర్థిక సాయం అందించగలరని వారు కోరుతున్నారు.

## ఘనంగా పట్లోళ్ల నరసింహులు జన్మదిన శుభాకాంక్షలు



**తాండూరు, అగస్టు 9 (జనంసాక్షి) :** జనహృదయ నేత పట్లోళ్ల నరసింహులుకు బిఆర్ఎస్ పార్టీ నాయకులు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. శనివారం పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నివాసంలో బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు నర్సింహులు జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలు మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తండ్రి విఠల్ రెడ్డి తోపాటు బిఆర్ఎస్ నాయకులు కలిసి జన హృదయ నేతకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. అదేవిధంగా కేక్ కట్ చేయించి ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బిఆర్ పార్టీ నాయకులు, తన అబిమానులు, తదితరులు ఉన్నారు.

## ఘనంగా యువజన కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



**జవహర్‌నగర్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** జాతీయ యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం సమీపంలోని వైయస్ఆర్ విగ్రహం వద్ద ఘనంగా నిర్వహించారు. యువజన కాంగ్రెస్ అధ్యక్షులు వినయ్‌కుమార్ ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత రాజకీయాలలోకి ప్రవేశించి ప్రజాసేవకు అంకితం కావాలని, రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రజల దాకా చేర్చే దిశగా ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్ యాదవ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్ గౌడ్, సీనియర్ నాయకులు కోటేష్ గౌడ్, వీర్లబుజ్జి, సేవాదళ్ అధ్యక్షులు శంకర్, యువజన కాంగ్రెస్ నాయకులు అజయ్, సాయిక్రిష్ణ మిట్టు, సోమేష్ చారి, అజిత్, అనిల్, బి. సాయి, భరత్, శ్రీకాంత్, బిట్టు, సాయి, మధు, సూరజ్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ



**నిజాంపేట్, ఆగస్టు 9 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ చర్చి గాగిల్లాపూర్ 28వ వార్డు నివాసులు తుమ్మ సతీష్ రెడ్డి నూతన గృహప్రవేశ వేడుకల్లో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నేత శంభీపూర్ క్రిష్ణ. ఈ సందర్భంగా వారికి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తాజా మాజీ కౌన్సిలర్లు సుధాకర్ రెడ్డి, భరత్ కుమార్, సీనియర్ నాయకులు రంజిత్ రెడ్డి, స్లీవా రెడ్డి, నాయకులు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## వర్షాలు కురవాలని బోరుగుండయ్యకు బెల్లం పాయసంతో పూజలు



**వీపనగండ్ల, ఆగస్టు 9 (జనం సాక్షి) :** వీపనగండ్ల మండల కేంద్రంలోని బోరు గుండయ్య దేవునికి వర్షాలు బాగా కురవాలని గ్రామ ప్రజలు పాయసంతో పూజలు చేశారు. ప్రాచీన కాలం నుండి వస్తున్న ఈ ఆచారాన్ని ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం గ్రామ రైతు కమిటీ అధ్యక్షులు పోతుల వెంకట్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి ముంత కృష్ణయ్య యాదవ్, కోశాధికారి ఆవుల నారాయణ బెల్లంతో తయారుచేసిన పాయసాన్ని వరదగా పోసి పూజలు ప్రారంభించారు. గ్రామంలోని పురాణ దేవత అయిన గంగమ్మ దేవికి మొదటగా పూజలు నిర్వహించి, ఎడ్ల పండ్ల పైన డప్పుల వాయిద్యాలతో గ్రామ ప్రజలు అందరు కలిసి ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించడం ఆనవాయితీ.ఈ సందర్భంగా భక్తులు వర్షాలు బాగా కురవాలని, రైతులకు పంటలు బాగా పండాలని, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకోవడం ఆనవాయితీగా వస్తున్న కార్యక్రమం అనే గ్రామ ప్రజలు అన్నారు.

## ఘనంగా శ్రీతిమ్మప్ప స్వామి గంప జాతర



**మల్దకల్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** మల్దకల్ శ్రీ స్వయంభు లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో శ్రావణ శనివారం పౌర్ణమి సందర్భంగా గంప జాతర నిర్వహించారు. స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకి సేవలో సమీపంలోని దేవర గట్టుపై వెలిసిన శ్రీ తిమ్మప్ప స్వామి దేవాలయానికి ఊరేగింపుగా వెళ్లి పూజలు నిర్వహించిన అనంతరం గ్రామంలోని దశమి కట్ట వద్ద గల శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా స్వామి వారిని తీసుకువచ్చి పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో పట్వారి అరవిందరావు,రవి,వాల్మీకి పూజారులు గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

# విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చాలి




**వికారాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** విద్య హక్కు చట్టాన్ని ప్రతిష్ట పరచి సీపీస్ రద్దు చేసి ఓపియస్ రాష్ట్రాలపై కేంద్రప్రభుత్వం విద్యా రాష్ట్రాలకు స్వేచ్ఛ ఇవ్వాలని కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను సాధించేలా వ్యవహరిస్తుందని, కేంద్రంపెత్తనం తగ్గించవలసిన, విద్యార్థి స్థాయి నుంచి శాస్త్రీయ దృక్పథం అలవర్చెల పాఠ్యాంశాలు రూపొందించవలసిన, విద్య హక్కు చట్టం 2009ను కచ్చితంగా అమలు చేస్తూ 18 సంవత్సరాల వరకు పొడిగించవలసిన అవసరం ఉందని టిఎస్ యుటిఎఫ్ వికారాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ వెంకట్ రత్నం అన్నారు, పశ్చిమబెంగాల్లోని కలకత్తా నగరంలో మహాజాతి సదన్ లో శనివారము ఆల్ ఇండియా ఎడ్యుకేషన్ కాన్ఫరెన్స్ పాల్గొన్న సందర్భంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి జాబితాలో ఉన్న విద్య ను కేంద్రం ప్రభుత్వం బలవంతంగా లాగుకొని తమ విధానాలను అమలు పరిచేలా యన్ఇపి 2020 ని రూపొందించిందని, విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథాన్ని వదిలి మూఢనమ్మకాలను ప్రోత్సహించేలా ఉందని, సిపియస్ రద్దు కొరకు, ఓపియస్, అమలు చేసేలా,2020 రద్దు చేసేలా, విద్యాహక్కు చట్టం 2009ని పకడ్బందీగా అమలు చేయడంలో కేంద్రప్రభుత్వం పూర్తిగా విఫలం అయిందని, విద్యాహక్కు చట్టాని 18 సంవత్సరాల వయస్సు వరకు అమలు పరిచి నాణ్యమైన పోషకాలు ఉండే మధ్యాహ్న భోజనం, ఎస్సీ, ఎస్టీ. ఓబీసీ విద్యార్థులకు స్కాలర్ షిప్స్ పెంచేలా, పిల్లల ఫీజుల భారం తగ్గించేలా వత్తిడి పెంచవలిన అవసరం ఉందన్నారు. ఈ సమావేశంలో దేశంలోని 12 రాష్ట్రాల ప్రతినిధులు రాష్ట్ర ప్రజలు పాల్గొన్నారు.

## రక్షాబంధన్..అపురూప బంధాలకు వారధి

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి



**వనపర్తి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** రక్షాబంధన్ అనే పర్వదినానికి రెండు అపురూప బంధాలకు వారధిగా నిలుస్తోందని మాజీ వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అభివర్ణించారు. శనివారం పాన్ గల్ మండల కేంద్రంలో గల మాజీ మంత్రి స్వగృహంలో తన సోదరి పోతుల సుదర్శనమ్మ తమ్ముడికి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపి, ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ అన్నా చెల్లెళ్ల, అన్నదమ్ముల మధ్య అనుబంధానికి, ఆత్మీయతకు నిదర్శనంగా రాఖీ పండుగ జరుపుకుంటారని, ఈ రక్షా బంధన్ ప్రజలలో సుఖ సంతోషాలు,అష్ట ఐశ్వర్యాలను తీసుకురావాలని ఆకాంక్షించారు. తెలంగాణ అక్కాచెల్లెలకు,అన్నదమ్ములకు ఆయన రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డికి వనపర్తి పట్టణంలోతన స్వగృహంలో బీఆర్ఎస్ పలువురు నాయకురాళ్ళు రాఖీలు కట్టి ఆశీస్సులు తీసుకున్నారు.కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ ఉంగ్లం అలేఖ్య మౌనిక, సాయి లీల, కవిత, శ్వేత, దండు సుజాత, చిత్ర వాకిటి శ్రీధర్ , పలస రమేష్ గౌడ్, గులాం ఖాదర్, నాయకులు ఉంగ్లం తిరుమల్, లక్ష్మీనారాయణ, సమద్, డేగ మహేశ్వర్ రెడ్డి, సూర్యవంశం గిరి,జోహెబ్ హుస్సేన్, ఇమ్రాన్, చిట్యాల రాము,ఆరిఫ్ పాషా, ప్రేమ్ కుమార్, ఖాదర్ నందిమల్ల సుబ్బు, అనపటి రాము, మహబూబ్ హలీం, ముని కుమార్, సాధిక్, తోట శీను, తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు




**వెల్దండ, ఆగస్టు 9 (జనంసాక్షి) :** వెల్దండ మండల కేంద్రంలోని యువజన కాంగ్రెస్ 65వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ముందు మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షులు మట్ట భరత్ గౌడ్ ఘనంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా భరత్ గౌడ్ మాట్లాడుతూ యువత రాజకీయాలలో కి వచ్చి ప్రజాసేవకు అంకితం కావాలని,రానున్న స్థానిక ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిల గెలుపు కొరకు, మన ప్రభుత్వం చేస్తున్న ప్రతి పథకాన్ని ప్రజలకు చేరవేసే దిశగా ప్రతి కార్యకర్త పని చేయాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా కల్వకుర్తి నియోజకవర్గంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి నియోజకవర్గంలో చేస్తున్న అభివృద్ధి పనులను ప్రజల్లోకి తీసుకెళ్తామని, కల్వకుర్తి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ, యువజన సంఘాల అనుబంధ సంస్థల బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు.ఈ కార్యక్రమంలో, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మోతిలాల్, మాజీ సర్పంచ్ భూపతి రెడ్డి, మార్కెట్ చైర్మన్ సంజీవ యాదవ్, సింగల్ విండో డైరెక్టర్ మట్ట వెంకటయ్య గౌడ్, రషీద్, కొయ్యల పుల్లయ్య, అంజయ్య, రమేష్, చంద్రశేఖ నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు దళపతి, బాణావతి శంకర్ నాయక్, యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు మహేష్, కిష్టాలు,%ఎ% మహేష్, జంగిలి కొండలు ,రేవెల్లి రాజు, మారేపల్లి శ్రీను, రాణి, దాసరి మహేష్, సమీర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు

- ఇందిరా సౌర గిరిజల వికాసం వేగవంతం చేయాలి
- ఏజెన్సీ ప్రాంత అధికారులు ఆర్ఓఎఫ్ఆర్ భూముల వివరాలు పంపండి
- జిల్లా కలెక్టర్లతో విద్యుత్ శాఖపై సెక్రటేరియట్ నుంచి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు వీడియో కాన్ఫరెన్స్





**ములుగు/ మహబూబాబాద్ ప్రతినిధి, ఆగస్టు 09 (జనం సాక్షి):** రాష్ట్రంలో సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తుందని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క అన్నారు, శనివారం హైదరాబాద్ డా.బిఆర్ అంబేద్కర్ సచివాలయం నుండి రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ ప్రధాన కార్యదర్శి (ఎనర్జీ) నవీన్ మిట్టల్ రెడ్ కో సిఎండి, ఎస్‌పిడిసిఎల్ సిఎండి, సింగరేణి కాలరీస్ సిఎండిలతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు ఉన్నతాధికారులతో సోలార్ సిస్టం ఇన్స్టాలేషన్ పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సౌర విద్యుత్ ఉత్పాదకత దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు, రాష్ట్రంలోని ప్రభుత్వ భవనాలు ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలలు ఖాళీగా ఉన్న ప్రభుత్వ భూములు ఆర్ఓఎఫ్ఆర్ భూముల వివరాలతో నిర్ణీత నమూనా ప్రకారం నివేదిక రూపొందించి వారం రోజులలోగా సమర్పించాలని తెలిపారు జిల్లాలలో గల ప్రభుత్వ కార్యాలయాలు ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు కళాశాలల భవనాల రూఫ్ టాప్ పై సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ విషయంపై ప్రత్యేక శ్రద్ధ వహించి అన్ని జిల్లాల కలెక్టర్లు వారంలోగా సంబంధిత వివరాలను ఎనర్జీ డిపార్ట్మెంట్ కు పంపించాలని తెలిపారు ఏజెన్సీ ప్రాంతాలలోని 6 లక్షల 17వేల ఎకరాలలో సోలార్ పంపుసెట్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుందని ఈ క్రమంలో 3 సంవత్సరాల లోపు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి పాల్గొన్న జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశానుసారం జిల్లాలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ కార్యాలయాలు పాఠశాలలు కళాశాలలు ఖాలి ప్రభుత్వ స్థలాల వివరాలను నిర్ణీత నమూనాలో అందించేందుకు అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఎస్ ఈ విజేందర్ రెడ్డి డి.ఈ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రికి రాఖీ కట్టిన వరంగల్ మేయర్ గుండు సుధారాణి



**వరంగల్ ఎంజీఎం, ఆగస్టు 9(జనంసాక్షి):** రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని శనివారం వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి, రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ సితక్కతో కలసి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని హైద్రాబాద్ లోని ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయంలో కలిసారు.ఈ సందర్భంగా సోదర, సోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా రాఖీ కట్టి, ఆయుష్మాన్ భవ మరియు ఆయురారోగ్యాలతో ఆయన ప్రజాసేవ మరింత విజయవంతంగా సాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## సీఎం రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన ఝాన్సి రాజేందర్ రెడ్డి



**పాలకుర్తి, ఆగస్టు 09 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఏనుముల రేవంత్ రెడ్డిని తమ నివాసంలో శనివారం టిపిసిసి వైస్ ప్రెసిడెంట్ హనుమాన్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి రాఖీ పండుగ శు భాకాంక్షలు తెలిపి, ముఖ్యమంత్రికి తిలకధారణ చేసి, రాఖీ కట్టి, ఆయురారోగ్యాలు, సర్వాంగ సౌఖ్యం కలగాలని ఆకాంక్షించారు. అనంతరం మిఠాయిలు తినిపించి సోదరభావాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఝాన్సీ రెడ్డి ని ఆప్యాయంగా "ఝాన్సి అక్క బాగున్నవా? అని అడిగి, రాఖీ పండుగ శుభాకాంక్షలు అందించారు. రాఖీ పండుగ సోదరుడు-సోదరి అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుం దని, ఇది పరస్పర ప్రేమ, రక్షణ, విశ్వాసా నికి ప్రతీక అని సీఎం తెలిపారు. రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో, సౌభ్రాతృ త్వంతో జీవించాలని ఆకాంక్షించారు.

## హక్కుల సాధనకు ఉద్యమిద్దాం

- ఆదివాసీ సంఘాల ఉద్యమ నాయకులు
- కొత్తగూడలో అంతర్జాతీయ ఆదివాసీ దినోత్సవ వేడుకలు




**కొత్తగూడ, ఆగస్టు 9 (జనంసాక్షి) :** హక్కుల సాధనకు ఉద్యమిద్దామని ఆదివాసీ సంఘాల ఉద్యమ నాయకులు అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగష్టు 09 న ఘనంగా నిర్వహించుకున్నారు. అందులో భాగంగా మహబూబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని ప్రపంచ ఆదివాసి దినోత్సవం పురస్కరించుకొని ఆదివాసీ సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గాంధీనగర్ నుండి కొమరం భీమ్‌సెంటర్ వరకు ఆదివాసీ సంప్రదాయ పద్ధతులలో వేశాధారణ ధరించి చిన్నారుల ఆదివాసీ, కళా నృత్యంతో ఆదివాసీ ప్రజలు భారీ ప్రదర్శన నిర్వహించారు.అనంతరం మండల కేంద్రం లోని సెంటర్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్, ప్రొఫెసర్ బియ్యాల జనార్దన్ రావు, కొమురం భీం విగ్రహాలకు, ఆదివాసీ అమరవీరుల చిత్ర పటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లు అర్పించారు. ఆదివాసీ ప్రజా సంఘాల సమన్వయ కమిటీ, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అంగడి ఆవరణలో సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆదివాసి ప్రజా సంఘాల సమన్వయ కమిటీ నాయకులు మాట్లాడుతూ జీవో నెం. 03 నీ పునరుద్ధరణ చేయాలనీ,ఏజెన్సీ లోని పాఠశాల ఏత్తివేతను నిలిపివేసి ఆదివాసి ప్రాంతాలలోకి గిరిజనేతరుల వలసలను నిషేధించి,1/70,పేసా,ఆర్వో ఎఫ్ ఆర్ చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలన్నారు. ఏజెన్సీ డిఎస్సి ప్రకటించి నిరుద్యోగ ఆదివాసి యువతీ యువకులకు ఉద్యోగ అవకాశం కల్పించాలని వారు అన్నారు.నాన్ షెడ్యూల్ గ్రామాలను తక్షణమే షెడ్యూల్ గ్రామాల జాబితాలో చేర్చాలనీ,ఆదివాసీల ప్రాంతంలో గిరిజనేతరుల కారణంగా అన్యక్రతం అయిన వేలాది ఎకరాల భూమిని తిరిగి ఆదివాసులకు ఇప్పించాలనీ, ఐటీడీఏ పరిధిలో ఉన్న 29 శాఖల జీవోలను కలిపి చట్టం చేయాలనీ ఈ సందర్భంగా వారు అన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ అధికారులు,డాక్టర్ చింత రమేష్ రిటైర్డ్ ప్రొఫెసర్ ఈసం సారయ్య దొర, ఈసం స్వామి హెచ్. డబ్ల్యూ ఓ ఫోరం అధ్యక్షులు,రాజ్య లక్ష్మి ఆర్ సి ఓ,గిరిజన సంక్షేమ శాఖల ఉద్యోగుల కల్పన గురుకుల ప్రిన్సిపాల్,సారయ్య స్పోర్ట్స్ స్కూల్ ప్రిన్సిపాల్, ఆదివాసి నాయకులు వాసం వీర స్వామి, బుర్కా మల్లయ్య,భూపతి తిరుపతి,న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు బూర్క వెంకటయ్య,పిడిఎస్యు రాష్ట్ర నాయకులు ఇదం పాక శ్రీశైలం,తుడుం దెబ్బ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్,ఆగబోయిన రవి,ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు మిడతపల్లి యాకయ్య, మల్లెల రాము,ఏటీ ఎఫ్ జిల్లా అధ్యక్షులు సిదబోయిన బిక్షం, కుంజ నర్సింహా రావు,తుడుదెబ్బ మండల అధ్యక్షులు పూనెం సందీప్ దొర,మల్లెల సారయ్య, కల్తీ నరేష్,ఈక విజయ్,ఈసం రామ స్వామి,ఈక నాగేష్, ఆదివాసీ దొర పటేళ్ళు, రణధీర్, నరేందర్, ఆదివాసీ ప్రజలు, ఆదివాసీ ప్రజా ప్రతి నిధులు తదితరులు పాల్గొన్నారు.

## చిందులేసిన కలెక్టర్, ఎస్పీ



**ఆదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి):** ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఆదివాసీ దినోత్సవంను ఆదివాసీలు ఘనంగా నిర్వహించు కున్నారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన కార్యక్ర మంలో జిల్లా కలెక్టర్, రాజర్షిషాతోపాటు ఎస్పీ అఖిల్ మహాజన్ లు పాల్గొని ఆదివాసీ ప్రజలకు ప్రపంచ ఆదివాసీ దినోత్సవ శు భాకాం క్షలను తెలిపారు. ఈ మేరకు ఆదివాసీ గిరిజనులు కలెక్టర్, ఎస్పీలకు తిలకం దిద్ది ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన వేడుకల్లో ఆదివాసీ గిరిజనులతో కలిసి కలెక్టర్, ఎస్పీలు కలిసి ఆనందంతో వారిమధ్య చిందులేశారు.

## బావిలో దూకి వ్యక్తి ఆత్మహత్య

**గూడూరు,ఆగస్టు09(జనం సాక్షి):** మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం సితానగరం గ్రామానికి చెందిన తాటి రాకేష్ వ్యవసాయ బావిలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలో చోటు చేసుకుంది.వివరాల్లోకి వెళ్లగా ఎస్ఐ గిరిధర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం గూడూరు మండలం,సీతానగరం గ్రామానికి చెందిన తాటి రాజిత 40 సం,,లు,వృత్తి కేర్ టేకర్,తన భర్త తాటి రాకేష్ తండ్రి లచ్చయ్య(45) మద్యం అలవాటు కారణంగా అనారోగ్యానికి గుర్రై,మానసిక వేదనకులోనై, ఆత్మహత్య చేసుకున్నాడని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుదారు తెలిపిన వివరాల ప్రకారం,ఈనెల 6న,తాను తన ఉద్యోగానికి వెళ్లగా,భర్త అనారోగ్యం కారణంగా డబ్బు పంపించమని ఫోన్‌లో చెప్పాడని,ఆమె డబ్బు పంపగా,భర్త కూతురుతో కలిసి ఎంజీఎం ఆసుపత్రికి వెళ్లి పరీక్ష చేయించుకొని ఇంటికి వచ్చాడు.అదే రాత్రి భోజనం చేసి నిద్రపోయారు.7న ఉదయం కూతురు లేసి చుస్తే,తండ్రి ఇంట్లో లేదని గమనించి తల్లికి ఫోన్ చేసింది.కుటుంబ సభ్యులు,బంధువుల ఇళ్లలో వెతికినా,కనబడలేదు.ఆగస్టు 9న,మధ్యాహ్నం సుమారు 12.00 గంటలకు గ్రామస్థుడైన తొటా సమ్మయ్య తన వ్యవసాయ బావి దగ్గరికి వెళ్తూ బావిలో మృతదేహం గమనించి,గ్రామ పెద్ద గాంధపు రెడ్డి జలేందర్ రెడ్డికి తెలిపాడు.ఆ సమాచారం ఫిర్యాదుదారుని చేరడంతో, ఆమె తన కూతురుతో కలిసి అక్కడికి వెళ్లి,మృతుడు తన భర్తేనని గుర్తించారు. ఫిర్యాదుదారు తెలిపిన ప్రకారం, మృతుడు మద్యం అలవాటుతో అనారో గ్యానికి గుర్రై,చికిత్సకు డబ్బుల్లేకపోవడం వల్ల మానసికంగా బాధపడి బావిలోకి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మరణానికి ఎవరిపైనా అనుమానం లేదని తెలిపారు.



## ఘనంగా ప్రపంచ ఆదివాసీ దినోత్సవం

**సారంగాపూర్ ఆగస్టు 9 (జనం సాక్షి)** ప్రపంచ ఆదివాసుల దినోత్సవం పురస్కరించుకొని సారంగాపూర్ మండలంలో ఆదివాసి గిరిజనులు బుధవారం ఘనంగా నిర్వహించుకున్నారు. లింగాపూర్ రాయిమేడి సెంటర్ ఆధ్వర్యంలో స్వర్ణ గ్రామంలో కొమరం భీమ్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆదివాసి నాయకులు మాట్లాడుతూ గిరిజనుల హక్కులను భంగం వాటిల్లకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని, సంస్కృతి సాంప్రదాయాలను ఆచరించాలని తెలిపారు. ఆదివాసుల హక్కుల కోసం పోరాడిన నాయకులను మరిచిపోకూడదని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయి సెంటర్ సార్ మేడి గోడం గణేష్, లింగాపూర్ పటేల్ తోడ్సం గంగారం, పెండల్ దారి పటేల్ పెందుర్ జైతు, ఇప్పచెలమ పటేల్ గొడం నాగరావ్, అంతుల్వె పటేల్ కొట్నక్ లక్ష్మణ్, గిరిజన గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## ఎరువుల కూపన్లు పంచే బాధ్యత మాకు ఇవ్వాలి

- లేకుంటే ముకుమ్మడి రాజీనామాలు
- సింగిల్ విండో చైర్మన్ ఉమామహేశ్వరరావు



**కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 9 ( జనం సాక్షి) :** రైతులకు ఎరువులకు సంబంధించిన కూపన్లు పంపిణీ చేసే బాధ్యత తమకు అప్పగించాలని కాగజ్ నగర్ వ్యవసాయ పరపతి సహకార సంఘం చైర్మన్ ఉమామహేశ్వరరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా కాగజ్ నగర్ వ్యవసాయ పరపతి సహకార సంఘం కార్యాలయంలో ఉమామహేశ్వరరావు సింగిల్ విండో డైరెక్టర్లతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ అధికారులు లెక్క పద్దు లేకుండా రైతులకు కూపన్లు పంపిణీ చేయడంతో చాలామంది రైతులకు యూరియా, ఇతర ఎరువుల బస్తాలు లభించగా ఇంటి ముఖం పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటప్పుడు అలంకారప్రాయంగా ఉన్న పదవులు తమకు ఎందుకని వారు ఆవేదన వ్యక్తం చేశారు. గోదాముల్లో స్టాక్ ఉన్న ఎరువులు ఎన్నో తెలుసుకోకుండా, మండల వ్యవసాయ అధికారి , ఇతర విస్తరణ అధికారులతో కూపన్లు జారీ చేయడం వల్ల రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. గతంలో పూర్తి బాధ్యతలు తమకే ఉండేవని, ప్రస్తుతం జిల్లాలో ఎక్కడలేని విధంగా ఎరువులకు సంబంధించిన కూపన్లు జారీ చేసే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం ఏమిటి అని వారు ప్రశ్నించారు. రైతులకు ఎరువులకు సంబంధించిన కూపన్లు పంపిణీ చేసే అధికారాన్ని ఈనెల 12వ తేదీలోగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తాము మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరిక చేశారు. వెంటనే జిల్లా కలెక్టర్, జిల్లా వ్యవసాయ అధికారి స్పందించాలని వారు కోరారు. ఈ సమావేశంలో సింగిల్ విండ చైర్మన్ ఉమామహేశ్వర రావు తో పాటు డైరెక్టర్లు పెద్దింటి వేంకటేశ్వర రావు, ధర్ని రామయ్య, నగునూరి తిరుపతి గౌడ్, కేకారి నానాజీ, మహిపాల్ రెడ్డిలు పాల్గొన్నారు.

## గద్దెరాగడిలో దొంగతనం

**రామకృష్ణాపూర్, ఆగస్టు 9(జనంసాక్షి):** గద్దెరగాడి ఏరియాలోని పద్మావతి కాలనీలో దొంగతనం జరిగింది. గుర్తు తెలియని దొంగలు 13 తులాల బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లారు. వాటి విలువ సుమారు రూ.2.86 లక్షలుగా అంచనా. భూపాలపల్లికి చెందిన సింగరేణి ఉద్యోగి మేకల రాజయ్య కొత్తగా ఇంటి నిర్మాణం చేసి, వరలక్ష్మి వ్రతం సందర్భంగా కుటుంబంతో కలిసి పద్మావతి కాలనీలోని తన నూతన గృహంలో రాత్రి బస చేశాడు. తెల్లవారు జామున 3 గంటల సమయంలో లేచే సరికి ఇంటిలో వస్తువులు చెదరగొట్టబడి, బ్యాగులో ఉంచిన బంగారు ఆభరణాలు కనిపించలేదని పోలీసులకు తెలిపాడు. దీనిపై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్లు పట్టణ ఎస్ఐ రాజశేఖర్ తెలిపారు. దొంగలను పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, సమీప సీ.సీ. కెమెరా ఫుటేజ్‌ను పరిశీలిస్తున్నట్లు ఎస్.ఐ. రాజశేఖర్ పేర్కొన్నారు.

## రేపు ఆయిల్ పామ్ పరిశ్రమ శంకుస్థాపన

- ఏర్పాట్ల పనులను పరిశీలించిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఆగష్టు 09(జనంసాక్షి) :** ఆయిల్ పామ్ పరిశ్రమ శంకుస్థాపన ఏర్పాట్ల పనులను పకడ్బందీగా చేయాలని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అధికారులను ఆదేశించారు. శనివారం ములుగు మండలం ఇంచర్లలో ఆయిల్ పామ్ పరిశ్రమ శంకుస్థాపన పనులను జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సోమవారం రాష్ట్ర వ్యవసాయం, మార్కెటింగ్, సహకారం, చేనేతలు, వస్త్రాలు శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క లు ఆయిల్ పామ్ పరిశ్రమ నిర్మాణ పనులను శంకుస్థాపన చేయనున్నారని, అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవిన్యూ సిహెచ్ మహేందర్ జి, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఐటిడిఏ ఏర్పాటు చేయాలి



**కాటారం, ఆగస్టు 9 (జనం సాక్షి) :** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఐటిడిఏ ఏర్పాటు చేయాలని తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పోలం రాజేందర్ డిమాండ్ చేశారు. కాటారం కేంద్రంలో ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఆగస్టు 9 సందర్భంగా తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తెలంగాణ జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి 1994 లో ప్రపంచ ఆదివాసి దినోత్సవం అన్ని దేశాలలో జరుపుకోవాలని ఆదివాసుల అభివృద్ధికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు దోహదపడాలని సూచించి 30 సంవత్సరాలు గడుస్తున్నా, ఆదివాసుల అభివృద్ధి చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని వారన్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 11 మండలాలలో నాలుగు ఆదివాసి తెగలు విస్తరించి ఉన్నప్పటికీ వారి అభివృద్ధి ని పట్టించుకోవడంలో ప్రభుత్వాలు పాలకులు వివక్షత చూపుతున్నారని అన్నారు. జిల్లాలో ట్రైబల్ డెవలప్మెంట్ కార్యాలయం గానీ ఆఫీసర్ లేకపోవడం చూస్తేనే ఎంత అన్చివేత కొనసాగుతుందో అర్థం చేసుకోవచ్చన్నారు. అదేవిధంగా 50 శాతానికి పైగా ఆదివాసులు ఉన్న గ్రామాలనైన షెడ్యూల్ ఏరియాలో కలిపినప్పుడే ఆ గ్రామాల అభివృద్ధి చెందే అవకాశం ఉందని అదేవిధంగా కనీసం మైదాన ప్రాంత ఐటీడీ అయిన ఏర్పాటు చేసినప్పుడే సంక్షేమ పథకాలు గాని విద్య ఉపాధి అవకాశాలు కానీ పొందే అవకాశం ఉంటుందని వారు అన్నారు. ఈ సమస్యలను వెంటనే ప్రభుత్వం పట్టించుకోని పరిష్కారం చేయకపోతే పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలు ఉంటాయి అని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నాయకులు రామినేని సురేందర్ ఆదివాసీ నాయకులు పోలం సతీష్ శ్రీశైలం పోలం రాజ్ కుమార్, రాజశేఖర్ రెడ్డి నాగరాజు, తోట పవన్ జిల్లా ఉపాధ్యక్షులు అత్కూరి శ్రీధర్, పోలం విజయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

జనంసాక్షి www.janamsakshi.org
ఆదివారం 10 ఆగస్టు 2025

# సమాజ సేవలో ఆర్టీసీ కండక్టర్



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 9 (జనంసాక్షి) :** తాను పేదరికంలో పుట్టిన తోటి వారికి సాయం అందించాలన్న మానవత్వం అతన్ని సమాజసేవ వైపు అడుగులు వేయించింది. దినసరి కూలీగా పనిచేస్తున్నా పేద విద్యార్థులకు అండగా నిలవాలన్న ఔన్నత్యాన్నిచ్చింది. అనాథలు వృద్ధులకు ఆసన్నహస్తం అందిచే సహృదయాన్నిచ్చింది. ప్రజాసేవకోసం తన కుటుంభ ఆర్థిక స్తోమతను సైతం లెక్కచేయక పరులకోసం పరితపిస్తున్న ఓ బస్ కండక్టర్ సేవాతత్పరతపై ప్రత్యేక కథనం... ఇబ్రహీంపట్నం మండలపరిధిలోని ఎలిమినేడుకు చెందిన బజారు భిక్షపతి ఓ నిరుపేద కుటుంభంలో జన్మించారు. చిన్న తనం నుంచే కష్టాల్లో ఉన్న తోటి విద్యార్థులకు చేయూతనిందిస్తూ వస్తున్న ఆయన చివరకు తాను కూలీపనులు చేస్తూ సంపాందించిన సొమ్ములోంచి ఇతరులకు కొంత సాయమందిస్తూ. తనలోని దాతృత్వాన్ని చాటుకున్నారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంభంలో పుట్టినా తన చుట్టూ ఉన్న సమాజానికి ఎంతో కొంత మేలు చేయాలన్న తపన అతనిని, సమాజసేవవైపు అడుగులు వేయించింది. ఈక్రమంలో పదవతరగతి ముగిసిన అనంతరం పై చదువులు చదవాలన్న కోరిక ఉన్నప్పటికీ ఆర్థిక స్థోమత చాలక తన చదువుకు ఫుల్ స్టాప్ పెట్టిదినసరికూలీగా, సెంట్రిగ్ కార్మికుడిగా పనులు చేస్తూ జీవనంసాగించాడు. అనంతరం ప్రైవేట్ కళాశాలలో అటెండర్‌గా పనిచేశాడు. చాలీచాలని జీతంతో సతమవుతున్నా వచ్చిన నెల జీతంలో నుంచి కొంత సొమ్మును వెచ్చించి నిరుపేద విద్యార్థులకు పెన్నులు, నోటుపుస్తకాలు, పలకలు, ఎగ్జామ్ ప్యాడ్ లను అందించి తన సేవాతత్పరతను చాటుకున్నారు బజారు బిక్షపతి. అలా కొంతకాలం గడచిన పిమ్మట 2010లో బస్ కండక్టర్ గా విధుల్లో చేరారు. అయితే అప్పట్లో కండక్టరుకు వచ్చే జీతం అంతంతమాత్రమే. అయినప్పటికీ ఆయన తన సేవాథృక్పథాన్ని మాత్రం వీడలేదు. తనకు వచ్చే జీతంతో తన కుటుంభాన్ని పోషిస్తూ అందులోంచే కొంత సొమ్మును వెచ్చించి అటు పేద విద్యార్థులకు ఇటు ఆనాథ పిల్లలు, వృద్ధులకు ఆసన్నహస్తం అందించేవారు. నిరుపేద విద్యార్థులకు పుస్తకాలు, నోట్ బుక్స్ తదితర విద్యాసామగ్రిని తన సొంత ఖర్చులతో ఉచితంగా అందిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్నారు. ఆయన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి, పలు అవార్డులు అందుకుంటున్నారు.

**చాక్లెట్‌తో మొదలైన సంబంధం**

బజారు భిక్షపతి తన బస్సులో ప్రయాణించే వారిని ఆకర్షించడానికి ఒక చిన్న కానీ అద్భుతమైన ఆలోచనను అమలు చేస్తున్నాడు. వన్ డే పాస్ కొనుగోలు చేసిన ప్రతి ప్రయాణికుడికి ఒక చాక్లెట్‌ను ఉచితంగా అందిస్తున్నాడు. "ఈ చాక్లెట్ కేవలం బహుమతి కాదు, నా ప్రయాణికుల పట్ల నా ఆప్యాయతను చూపించే మార్గం," అని భిక్షపతి చెప్పాడు. ఈ చిన్న సంజ్ఞ వల్ల చాలా మంది ప్రయాణికులు భిక్షపతి డ్యూటీలో ఉన్న బస్సులను ఎంచుకుంటున్నారు.

**ఆప్యాయతతో సంతోషకరమైన ప్రయాణం**

భిక్షపతి తన డ్యూటీ సమయంలో ఎల్లప్పుడూ నవ్వుతూ, ఉత్సాహంగా ఉంటాడు. ప్రయాణికులతో స్నేహపూర్వకంగా మాట్లాడుతూ, వారి గమ్యస్థానాలకు సురక్షితంగా చేరేలా చూస్తాడు. ఆయన ఉత్సాహం మరియు ఆప్యాయతతో కూడిన వ్యవహారం ప్రయాణికులకు ఒక సౌకర్యవంతమైన, ఆనందకరమైన ప్రయాణాన్ని అందిస్తుంది. మహేశ్వరం డిపో



నుండి నడిచే బస్సుల్లో భిక్షపతి ఉన్నప్పుడు ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది, ఇది ఆయన ప్రభావాన్ని సూచిస్తుంది.

**ప్రశంసించిన ప్రభుత్వం.. అవార్డులతో సత్కారం..**

సమాజహితం కోసం తన పేదరికాన్ని లెక్కచేయక తోటివారికి సాయమందిస్తున్న బజారుభిక్షపతి సేవలను గుర్తించిన ప్రభుత్వం పలు అవార్డులతో సత్కరించింది. ఆయన సేవలకుగాను 2014లో రాష్ట్ర స్థాయిలో ఉత్తమ సమాజసేవకుడుగా తెలంగాణ ప్రభుత్వం ప్రొ. జయశంకర్ అవార్డును భిక్షపతికి అందించింది. కరీంనగర్లో కళాభారతిహాల్లో నిర్వహించిన సత్కార కార్యక్రమంలో 'రాష్ట్ర ఆర్థిక శాఖామంత్రి ఈటల రాజేందర్ చేతులమీదుగా ఆయన ఈ అవార్డును అందుకున్నారు. అప్పటి జిల్లా కలెక్టర్ వాణీప్రసాద్ చేతులమీదుగా మండల ఉత్తమ సంఘసేవకునిగా అవార్డును.

అందుకున్నారు. అలాగే 2015 జూన జరిగిన తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవవేడుకల్లో మండల ఉత్తమసంఘసేవకులు ఆవార్డును బజారు భిక్షపతి అందుకున్నారు. అయితే ఎన్ని ఆవార్డులు అందుకున్నా తన సేవలను చూసి ఇతరులు ప్రశంసించినప్పుడు కలిగే ఆనందం మరెక్కడా లభించదని ఆయన చెబుతున్నారు. చిన్నతనంలో పేదరికం మూలంగా నేను చదువుకు దూరమైనా, ఇతరులకు అలాంటి కష్టం రాకూడదన్న సంకల్పంతో చేయగలిగిన సాయం చేస్తూ వస్తున్నా ప్రతి ఒక్కరూ తమకు తోచినంతలో నిరుపేదలకు సాయమందించాలని అన్నారు.

# హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డులో రాకపోకల నిలిపివేత

**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** ఎగువ నుంచి వస్తున్న వరద నీటికి నగర శివారు గండిపేట మండల పరిధిలోని హిమాయత్ సాగర్ నిండు కుండలా మారింది. దీంతో ఎగువ నుంచి వస్తున్న నీటిని దిగువకు విడుదల చేసేందుకు ఇటీవల నాలుగు గేట్లను వదిలారు. నిండుకుండలా మారిన హిమాయత్ సాగర్ జలాశయం నాలుగు గేట్లు ఓపెన్ చేసి నీటిని దిగువకు విడుస్తున్న సంగతి అందరికీ తెలిసిన విషయమే. కాగా వరద ప్రవాహం ఎక్కువ ఉండడంతో హిమాయత్ సాగర్ నుంచి గచ్చిబౌలి వెళ్లే సర్వీస్ రోడ్డును అధికారులు పూర్తిగా నిలిపివేశారు. ఈ రోడ్డు గుండా ప్రయాణం సాగించేవారు ఈ రోడ్డును వినియోగించవద్దని అధికారులు తెలుపుతున్నారు. జలాశయం గేట్లు ఓపెన్ చేయడంతో వాగు పొంగిపొర్లుతుండడం, సర్వీసు రోడ్డుపై పెద్ద ఎత్తున వాటరు వస్తుండడంతో ఈ రోడ్డును అధికారులు పూర్తిగా బ్లాక్ చేశారు. రాజేంద్రనగర్ హిమాయత్ సాగర్ సర్వీస్ రోడ్డులో రాకపోకలు తాత్కాలికంగా నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు.

# అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

- సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సూర్యాపేట డీఎస్పీ ప్రసన్న కుమార్ అన్నారు.శనివారం జిల్లా కేంద్రంలోని డీఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఎవరైనా వ్యభిచారం,జూదం లాంటి అసాంఘిక చర్యలకు పాల్పడితే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.సూర్యాపేట పట్టణంలోని ఆర్వి హాస్పిటల్ పక్కన శ్రీశ్రీ నగర్ లో కొందరు వ్యక్తులు ఓ ఇంటిని స్థావరంగా చేసుకొని జూదం ఆడుతున్నట్లు పక్కా సమాచారంతో పోలీసులు దాడి చేసి పట్టుకున్నట్లు తెలిపారు.8 మందిని అరెస్టు చేసి, వారి వద్ద నుండి రూ.42 వేల నగదు, నాలుగు సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్లు తెలిపారు. మద్యపానం , జూదం, వ్యభిచారం,రాత్రి వేళల్లో ఆకతాయిల పట్ల పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు.

# రాఖీ పండుగ అన్నా చెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** రాఖీ పండుగ అన్నాచెల్లెల్ల అనుబంధానికి ప్రతీక అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు.శనివారం బాలభవన్ లో చిన్నారులతో కలిసి జిల్లా కలెక్టర్ రాఖీ పండుగను ఉత్సాహంగా జరుపుకున్నారు.ఈ సందర్బంగా బాలసదన్ లోని చిన్నారులు కలెక్టర్ కి రాఖీలు కట్టి, ఆప్యాయత పంచుకున్నారు.అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నారులు బాగా చదివి ప్రయోజకులుగా ఎదగాలని ఆకాక్షించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు.రెండు నెలలో నూతన చిల్డ్రన్ హెూమ్ పూర్తి అవుతుందని తెలిపారు.కలెక్టర్ చిన్నారులకు డ్రస్ లు, రైన్ కోట్స్, పెన్నులు, లూడో, చెస్, షటిల్ ఆట వస్తువులు, స్వీట్స్ బహుమతులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా బాల సంరక్షణ అధికారి రవి, సూపరింటెండెంట్ మంగాతాయమ్మ, అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్‌లో ట్రాఫిక్ నియత్రణకు పోలీసుల ప్రత్యేక కార్యచరణ

- రోజుకు 1500 కేసులు
- ఇప్పటివరకు రూ.3 కోట్ల వరకు జరిమానాలు



**కరీంనగర్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** రోజురోజుకీ రద్దీ పెరుగుతున్న క్రమంలో కరీంనగర్‌లో ట్రాఫిక్ నియంత్రణ పోలీసులకు సవాల్‌గా మారింది. దీంతో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు గత 50 రోజులుగా ఏఎన్పీఆర్ నిఘా నేత్రాలను పోలీస్ శాఖ వినియోగిస్తోంది. జూన్ 27 నుంచి సీసీ కెమెరాల ద్వారా ఈ చలాన్ విధానంలో భాగంగా రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిపై కేసులు నమోదు చేస్తున్నారు. వాహనదారులపై రోజుకి 1500 వరకు కేసులు నమోదవుతున్నాయి. పోలీసులు కమాండ్ కంట్రోల్ సెంటర్ విధానం ద్వారా ఇప్పటి వరకు రూ.3 కోట్ల జరిమానా విధించారు. కరీంనగర్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం పోలీసు శాఖ జూన్ 27 న ఈ చలాన్ విధానాన్ని తీసుకొచ్చింది. ఇందుకోసం స్మార్ట్ సిటీలో భాగంగా ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు ఆటోమెటిక్ నంబర్ ప్లేట్ రికగ్నైజేషన్ కెమెరాలను అనుసంధానించింది. పట్టణంలో ప్రధానంగా ఉన్న 24 కూడళ్లలో మొత్తం 174 ఏఎన్పీఆర్ కెమెరాల ద్వారా రోడ్డు భద్రతా నియమాలను ఉల్లంఘించిన వారిని గుర్తించి ఆన్‌లైన్‌లోనే జరిమానా విధిస్తుంది. 335 సర్వేలెన్స్ కెమెరాల ద్వారా నగరంలో ధర్నాలు, రాస్తారోకోలు, బందోబస్తు సమయాల్లో ట్రాఫిక్‌ను మానిటరింగ్ చేస్తుంది. ఇప్పటివరకు వరకు 37 వేల 477 కేసుల ద్వారా రూ.3,7,46,695 జరిమానా విధించారు. కేవలం ఆన్‌లైన్‌లో కేసులు నమోదు చేయటం కాకుండా రద్దీ తక్కువగా ఉండే సమయాల్లో జరిమానాల వసూళ్ల కోసం ప్రత్యేక డ్రైవ్‌లను నిర్వహిస్తున్నారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా ట్రాఫిక్ నియంత్రణ చేయటం బాగున్న దీనిపై ప్రజల్లో విస్తృత స్థాయిలో అవగాహన కల్పించాలని నగరవాసులు కోరుతున్నారు. నగరానికి వివిధ కారణాలతో వస్తున్న జనాలకు నిఘా నేత్రాల ద్వారా జరిమానా విధింపు అంశం తెలియకపోవటంతో తమ మొబైల్కి సందేశం వచ్చిన తర్వాత చూసుకుని ఆందోళన చెందుతున్నారు. కొద్ది మందికి ఒకే రోజు రెండు, మూడు ఈ చలాన్‌లు పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# బీసీలను మోసం చేసే పార్టీలకు భవిష్యత్ ఉండదు

- శివశంకర్ 96వ జన్మదిన సెమినార్‌లో జూలూరు గౌరీశంకర్



**కోదాడ, ఆగస్టు 9 (జనం సాక్షి) :** బీసీలను మోసం చేసే పార్టీలకు ఇక పుట్టగతులుండవని తేల్చి చెప్పే సమయం ఆసన్నమైందని తెలంగాణ రాష్ట్ర తొలి బీసీ కమీషన్ సభ్యులు, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ అధ్యక్షులు జూలూరు గౌరీశంకర్ హెచ్చరించారు. బీసీలు ఆర్థిక, రాజకీయ, సామాజిక న్యాయాలను దక్కించుకునేందుకు చేసే బీసీ సామాజిక ఉద్యమానికి అన్ని వర్గాలు సంపూర్ణ మద్దతు ప్రకటించి తమ చైతన్యాన్ని చాటుకోవాలన్నారు. శనివారం కోదాడలోని పెన్షనర్స్ కార్యాలయంలో "ఆలోచనాపరుల వేదిక" ఆధ్వర్యంలో పి.శివశంకర్ 96వ జన్మదినోత్సవం సందర్భంగా "బీసీల కోసం శివశంకర్" అన్న సెమినార్ లో జూలూరు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. బీసీలను మోసం చేసే రాజకీయ పార్టీలకు చరమగీతం పాడే చైతన్య ఉద్యమంగా బీసీ ఉద్యమం బలపడుతుందన్నారు. మేలు చేస్తే జై కొడతాం, మోసం చేస్తే తిప్పి కొడతామనే దశకు బీసీ ఉద్యమం పదునెక్కిందని తెలిపారు. ఇది కులపోరాటం కాదని బీసీల ఆత్మగౌరవ పోరాటమని చెప్పారు. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ ను సంపూర్ణంగా అమలు జరిపేదాకా రాజకీయాలకు అతీతంగా బీసీలంతా ఒక్కతాటిపై నిలవాలన్నారు. తమిళనాడు తరహాలో రిజర్వేషన్లు అడగటం కాకుండా ఆ తరహాలో కేంద్రంతో పోరాటం కూడా చేయాలన్నారు. 69 శాతం రిజర్వేషన్లు సాధించుకున్నాకే డిల్లీ నుంచి తమిళనేతలు తిరిగివచ్చారని, తెలంగాణ ప్రభుత్వం కూడా అదేవిధంగా పోరాడాలని కోరారు. ఈ కార్యక్రమానికి పాలేటి నాగేశ్వరరావు అధ్యక్షత వహించగా...ఈ కార్యక్రమంలో రాయపూడి వెంకటేశ్వరరావు, రామిశెట్టి రామకృష్ణ, పందిరి నాగిరెడ్డి, వేముల వెంకటేశ్వర్లు, ఈదుల కృష్ణయ్య, పాలేటి రామారావు, ఆవుల రామారావు, పుప్పాల కృష్ణమూర్తి, బడుగుల సైదులు, ఉయ్యాల నరసయ్య, డి.ఎన్.స్వామి, డాక్టర్ బ్రహ్మం, బొల్లు రాంబాబు, హరి కిషన్, కస్తూరి రాములు, ముసి శ్రీనివాస్, బత్తుల ఉపేందర్, మొదలగు వారు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి




**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ప్రజా సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయిలో ప్రజల్లోకి తీసుకువెళ్లాల్సిన బాధ్యత యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలపై ఉందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు.శనివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో యూత్ కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో నాటి నుండి నేటి వరకు యూత్ కాంగ్రెస్ కు పార్టీ అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తుందన్నారు. సూర్యాపేటలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి చేసిన అభివృద్ధిపై చర్చించేందుకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు.అనంతరం యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్ మాట్లాడుతూ మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి యూత్ కాంగ్రెస్ తోనే రాజకీయాల్లో ఉన్నత స్థాయి పదవులను అలంకరించారని గుర్తు చేశారు.సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు పోతు భాస్కర్, డిసిసి అధ్యక్షులు చెవిటి వెంకన్న యాదవ్ సలహాలు, సూచనలతో క్షేత్ర స్థాయిలో తీసుకెళ్లి ప్రజలను చైతన్యం చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం యూత్ కాంగ్రెస్ శక్తి వంచన లేకుండా పని చేస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షులు అంజద్ అలీ, యూత్ కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ మాజీ అధ్యక్షులు కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కక్కిరేణి శ్రీనివాస్,మాజీ కౌన్సిలర్లు బైరు శైలేందర్, రాపర్తి శ్రీనివాస్, గండూరి రమేష్, అనంతుల యాదగిరి, నాయకులు నాగుల వాసు, శభరి, రుద్రంగి రవి, సాయి నేత, లింగస్వామి, సాజీత్ ఖాన్, వెన్న మధుకర్ రెడ్డి, పందిరి మల్లేష్, రాంబాబు, బొజ్జ సంజయ్,ఉపేందర్ సుదీర్, వినయ్, మధు, నవీన్, సందీప్, లక్ష్మణ్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బీమా అప్లికేషన్ గడువు 4 రోజులే..

**హైదరాబాద్, ఆగస్టు 9 (జనంసాక్షి) :** రైతు బీమా అప్లికేషన్ గడువు ఆగస్టు 13 వరకే ఉన్నట్లు వ్యవసాయ శాఖ అధికారి ఉత్తర్వులు జారీ చేశారు. కొత్త పట్టా పాస్ బుక్స్ వచ్చిన రైతులు ఆగస్టు 13 వరకు రైతు బీమా అప్లై చేసుకోవాలని సూచించారు. అదే విధంగా ఇది వరకు పట్టా పుస్తకాలు ఉండి రైతు బీమా దరఖాస్తు చేయని వారికి కూడా అప్లై చేసుకునేందుకు అవకాశం ఇస్తున్నట్లు తెలిపారు. రైతు బీమా అప్లై చేసుకోవడానికి అప్లికేషన్ ఫారం తో పాటు పట్టా పాస్ బుక్ లేదా పాస్ బుక్ జిరాక్స్ జతచేయాల్సి ఉంటుంది. ఈ రెండూ లేని పక్షంలో ఎమ్మార్వో డిజిటల్ సంతకంతో కూడిన డిఎస్ పేపర్ అయినా ఉండాలని సూచించారు. వీటికి తోడు రైతు ఆధార్ కార్డు, నామినీ ఆధార్ కార్డు కూడా తప్పనిసరిగా జతచేయాల్సి ఉంటుంది. రైతు బీమా అప్లై చేసుకోవాలంటే ఆధార్ ప్రకారం వయసు 18 ఏళ్ల నుంచి 59 ఏండ్లు లోపు ఉండాలి. అంటే 1966 ఆగస్టు 14 నుంచి 2007 ఆగస్టు 14 మధ్యలో పుట్టిన వారై ఉండాలి. రాష్ట్రంలో రైతు బీమాకు సంబంధించి 2025-26 బీమా సంవత్సరం ఆగస్టు 14 నుంచి షురూ కానుంది. ఈ నెల 13 వరకు గత ఏడాది బీమా గడువు ముగియనుంది. గత జూన్ నెలాఖరు వరకు కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు వచ్చిన రైతుల్లో బీమాకు అర్హులను వ్యవసాయశాఖ గుర్తించనుంది. రాష్ట్ర వ్యాప్తంగా 76 లక్షల మందికి పైగా పట్టాదారు పాస్ బుక్ ఉన్న రైతులు ఉన్నారు. అర్హులైన రైతులు కొత్తగా రైతుబీమా దరఖాస్తు చేసుకోవడానికి ఆగస్టు మొదటి వారం నుంచి అవకాశం కల్పించారు. ఈ క్రమంలో ఈ యేడు 2025-26 రైతు బీమా కోసం కొత్తగా లక్షలాది అప్లికేషన్లు రావడంతో వారిలో అర్హులను గుర్తించి రైతు బీమా పోర్టల్లో అధికారులు అప్లోడ్ చేయనున్నట్లు గతంలో ప్రకటించారు.

# చినుకు పడితే.. వణుకుతున్న కోదాడ

- హైడ్రా తరహాలో సంస్కరణ తప్పదు



**కోదాడ, ఆగస్టు 9 (జనం సాక్షి) :** వర్షాకాలంలో చినుకు పడితే చాలు కోదాడ పట్టణ ప్రజలు భయాందోళన చెందుతున్నారు. గత ఏడాది సెప్టెంబర్ నెలలో కురిసిన భారీ వర్షాల వలన కోదాడ ప్రజలు ప్రాణ నష్టం, ఆస్తి నష్టం చవిచూశారు. ప్రభుత్వ యంత్రాంగం కాలువల నిర్మాణం, మురుగు కాలువల పూడికతీత లాంటి కార్యక్రమాలు యుద్ధప్రాతిపాదికన చేపట్టింది. అయినప్పటికీ గత మూడు రోజుల నుండి కురుస్తున్న భారీ వర్షాల వలన వివిధ కాలనీలలో భారీ వరద నీరు వచ్చి చేరింది. దీనివలన ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గణేష్ నగర్, షిరిడి నగర్ పలు కాలనీలోకి వరద వచ్చింది. ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ యంత్రాంగం యుద్ధ ప్రాతిపాదికన చర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. కోదాడకు హైడ్రా రావాలి: కోదాడ పట్టణం చాలావరకు ఆక్రమణకు గురైంది., నాళాలు చాలా వరకు ఆక్రమించారు.కోదాడ పెద్ద చెరువు ఎర్రగుంట చెరువు భూ కబ్జా కోరల్లో ఉంది. ఎన్నోమార్లు పెద్ద చెరువును కాపాడాలని ఎంతో మంది పోరాటాలు చేశారు. కానీ ఫలితం శూన్యం కోదాడ పట్టణాన్ని కాపాడాలంటే హైడ్రా తరహాలో సంస్కరణతో సాధ్యమవుతుందని ప్రజలు కోరుకుంటున్నారు.

# కలెక్టరేట్‌లో సోలార్ విద్యుత్ వినియోగం

- జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట ప్రతినిధి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** సమీకృత జిల్లా అధికారుల కార్యాలయ భవనానికి సోలార్ విద్యుత్తును వినియోగిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు వివరించారు. 2023లోనే సూర్యాపేట ఐడిఓసి రూఫ్ టాప్ పై సోలార్ ప్యానళ్లు ఏర్పాటు చేయడం జరిగిందని, దీని ద్వారా ప్రతి రోజు 372 కిలో వాట్ల విద్యుత్ జనరేట్ అవుతుందని తెలిపారు.ఈ విద్యుత్ ను సమీకృత జిల్లా అధికారుల కార్యాలయంలోని ప్రభుత్వ కార్యాలయాలకు వినియోగిస్తున్నామని,కార్యాలయాలకు అవసరమైన విద్యుత్ డిమాండ్ ను తీర్చుతున్నట్లు వెల్లడించారు.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఇంధన, ఆర్థిక శాఖ మంత్రి బట్టి విక్రమార్క మల్లు శనివారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లతో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలను సోలారైజషన్ చేయడంలో భాగంగా సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసే విషయమై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయా జిల్లాల వారీగా మాట్లాడిన సందర్భంలో సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ స్పందిస్తూ తాము ఐడిఓసిలో ఇది వరకే సోలార్ పవర్ ను వాడుతున్నట్లు తెలిపారు.

# చేతబడి నేపంతో ఓ వ్యక్తిని చెట్టుకు కట్టేసి కొట్టి చంపిన గ్రామస్తులు

- కొట్టి చంపిన నిందితులు అరెస్ట్
- మూఢనమ్మకాలను నమ్మొద్దు
- ఇల్లందు డి.ఎస్.పి చంద్రభాను



**టేకులపల్లి, ఆగస్టు 9 (జనంసాక్షి) :** చేతబడి నెపంతో ఓ వ్యక్తిని గ్రామస్థులు చెట్టుకు కట్టేసి కొట్టి చంపిన ఘటనలో నిందితులను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో వారి కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఇల్లందు డి.ఎస్.పి చంద్రభాను వివరాలు వెల్లడించారు. టేకులపల్లి పోలీస్ సర్కిల్ పరిధిలోని ఆళ్ళపల్లి మండలం పెద్ద వెంకటాపురం పంచాయతీ పరిధిలోని భూసురాయి గ్రామంలో ఈ నెల ఆరో తేదీన మడకం బీడ అలియాస్ రాజు (36) చేతబడి చేస్తున్నాడన్న అనుమానంతో చెట్టుకు కట్టివేసి విచక్షణా రహితంగా కర్రలతో కొట్టడంతో మృతి చెందాడని డి.ఎస్ పి తెలిపారు. అదే గ్రామానికి చెందిన మడవి రాజు, మొక్కటి చిన్న సోమయ్య, మొక్కటి భీమయ్య, వంజం గంగ, వంజం జోగ, మొక్కటి వెంకటేశ్వర్లు అనే వ్యక్తులు హత్య చేసిన నాటి నుంచి పారిపోయారని తెలిపారు.శనివారం టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆళ్ళపల్లి ఎస్సై సోమేశ్వర్ సిబ్బందితో కలిసి పెద్దవెంకటాపురం పాఠశాల వద్ద వాహన తనిఖీ చేస్తుండగా మడకం బీడ అలియాస్ రాజును హతమార్చిన ఆరుగురు నిందితులు ఛత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని సొంత గ్రామాలకు వెళ్లి పెద్ద వెంకటాపురం మీదుగా వెళ్లే ప్రయత్నం చేస్తుండగా సింగారం వైపు నుంచి అడవిలో గొనె సంచి పట్టుకొని వస్తున్న వారిని అనుమానంతో విచారించగా రాజును చంపినవారని తెలియడంతో అదుపులోకి తీసుకొని అరెస్ట్ చేశారని తెలిపారు. బూసురాయి గ్రామానికి చెందిన పదిహేనేళ్ల పోడియం గంగి మృతికి రాజు కారకుడని,చేతబడి వల్లే చనిపోయిందని హతమార్చినట్లు విచారణలో తెలిసిందన్నారు. మృతి చెందిన అమ్మాయి కేవలం కామెర్లతో మృతి చెందిందని,చేతబడి, బాణామతి లాంటి క్షుద్ర పూజలను, మూఢ నమ్మకాలూ నమ్మి ప్రజలు ఎవరైనా ఎటువంటి అసాంఘిక కార్యకలా పాలకు పాల్పడొద్దన్నారు.ఎవరైనా మూఢనమ్మకాల తో ఇలాంటి చర్యలకు పాల్పడితే చట్ట పరంగా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.ఈ విలేఖరుల సమావేశంలో టేకులపల్లి సిఐ బత్తుల సత్యనారాయణ, ఆళ్ళపల్లి ఎస్సై సోమేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.




# బకాయిలూ బదిలీ..

## 'క్రెడిట్ కార్డు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ ఆప్షన్' అందుబాటులో..

**జనంసాక్షి:**ముందు కొనుగోలు చేసి తర్వాత చెల్లించడానికి వీలు కల్పించేదే క్రెడిట్ కార్డు అయితే, దీన్ని సరిగా ఉపయో గించుకోవడానికి ఆర్థిక క్రమశిక్షణ అవసరం.ఎప్పటికప్పుడు ఖర్చులను ట్రాక్ చేస్తూ సకాలంలో చెల్లింపులు చేస్తే ఎలాంటి సమస్య ఉండదు. లేదంటే ఆ ప్రభావం క్రెడిట్ స్కోర్‌పై పడుతుంది. ఎంత క్రమశిక్షణతో ఉన్నా.. ఒక్కోసారి సమయానికి డబ్బులు చేతిలో ఉం డవు. సరిగ్గా అదే సమయంలో క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించాల్సిన గడువు సమీపిస్తే ఇబ్బందులు ఎదుర్కో వాల్సి రావొచ్చు. అలాంటప్పుడు క్రెడిట్ కార్డు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ ఆప్షన్ ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది.ఒక క్రెడిట్ కార్డు బ్యాలెన్స్‌ను మరో కార్డుకు బదిలీ చేస్తే దాన్నే క్రెడిట్ కార్డు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్‌గా వ్యవహరిస్తారు. ముఖ్యంగా ఇతర బ్యాంకుల క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్న కస్టమర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కార్డు జారీ సంస్థలు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న కార్డులోని అప్పుపై పడే అధిక వడ్డీ భారాన్ని తప్పించుకోవడానికి లేదా ఇతర బ్యాంకులు తక్కువ వడ్డీరేటును కల్పించినప్పుడు ఇది కస్టమర్లకు ప్రయోజనకరంగా ఉంటుంది.ఒక కార్డు నుంచి మరో కార్డుకు బకాయిలను బదిలీచేస్తే.. కొత్త కార్డు జారీ సంస్థ ఆ మొత్తాన్ని పాత కార్డు సంస్థకు చెల్లిస్తుంది. ఆ సొమ్మును కస్టమర్ కొత్త కార్డు సంస్థకు నియమ, నిబంధనలకు లోబడి చెల్లించాల్సి ఉంటుంది. అయితే, కొంత సమయం ఇస్తారు. దానికి సున్నా వడ్డీరేటు లేదా నామమాత్రపు వడ్డీని మాత్రమే వసూలు చేస్తారు. కొత్త క్రెడిట్ కార్డు లిమిట్‌లో 75-80 శాతం వరకు బ్యాలెన్స్‌ను బదిలీ చేయడానికి సంస్థలు అనుమతి ఇస్తాయి.



**ఒక్కోసారి సమయానికి డబ్బులు చేతిలో ఉండవు. సరిగ్గా అదే సమయంలో క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించాల్సిన గడువు సమీపిస్తే ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావొచ్చు. అలాంటప్పుడు క్రెడిట్ కార్డు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ ఆప్షన్ ఉపయోగించుకునే వెసులుబాటు ఉంది.ఒక క్రెడిట్ కార్డు బ్యాలెన్స్‌ను మరో కార్డుకు బదిలీ చేస్తే దాన్నే క్రెడిట్ కార్డు బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్‌గా వ్యవహరిస్తారు. ముఖ్యంగా ఇతర బ్యాంకుల క్రెడిట్ కార్డులను ఉపయోగిస్తున్న కస్టమర్లను ఆకర్షించడమే లక్ష్యంగా కార్డు జారీ సంస్థలు ఈ సదుపాయాన్ని కల్పిస్తున్నాయి.**

.అయితే క్రెడిట్ కార్డుల బకాయిల బదిలీ వల్ల కేవలం లాభాలే కాదు కొన్ని ప్రతికూలతలు కూడా ఉన్నాయి. బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్‌కు అనుమతి కోరుతూ అర్జీ పెట్టుకున్నప్పుడు సంస్థలు ఏమాత్రం జాప్యం చేసినా వడ్డీ పెరిగిపోతుంది. తీరా క్రెడిట్ స్కోర్, భారీ మొత్తంలో బకాయిల పేరిట కొత్త సంస్థ తిరస్కరిస్తే భారం మరింత ఎక్కువవుతుంది. మరోవైపు పలు కారణాలరీత్యా వడ్డీరేటులో రాయితీ ఇవ్వలేమని చెబితే అప్పటి వరకు అదనపు వడ్డీభారం తప్ప ఎలాంటి ప్రయోజనం ఉండదు. అప్పుల ఊబిలో కూరుకుపోయే ప్రమాదం కూడా ఉంది. అవకాశం ఉంది కదా అని.. అన్ని బకాయిలను కొత్త కార్డు బదిలీ చేస్తే ఆ మొత్తాన్ని చెల్లించలేక ఇబ్బంది పడే అవకాశం ఉంది. ఒకవేళ సకాలంలో చెల్లించలేకపోతే వడ్డీ భారం అంతకంతకూ పెరుగుతూ పోతుంది. బకాయిలు ఎక్కువ మొత్తంలో ఉన్నప్పుడే కస్టమర్లు సాధారణంగా దాన్ని బదిలీ చేయాలని ఆలోచిస్తారు. అంటే కచ్చితంగా ఆ మొత్తం కొత్త కార్డు యుటిలైజేషన్ రేషియో కంటే ఎక్కువే ఉండే అవకాశం ఉంది. ఇది క్రెడిట్ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ ఫీజు, కొత్త కార్డు వార్షిక రుసుములు అదనపు ఖర్చులు. వీటన్నింటినీ లెక్కలోకి తీసుకొని లాభదాయకమనుకుంటేనే ఈ ఆప్షన్‌కు వెళ్లాలి. సంస్థ నియమ నిబంధనల ప్రకారం.. బ్యాంకు అర్హతగల కస్టమర్లకు మాత్రమే ఈ వెసులుబాటును కల్పిస్తాయి. బ్యాంకుల్లో దీనికి నిర్దిష్టమైన ఫారాలు ఉంటాయి. వాటిని పూర్తి చేసి క్రెడిట్ వివరాలు, పాన్‌కార్డు, ఆధార్ కార్డు, క్రెడిట్ బిల్లు స్టేట్‌మెంట్ల వంటి ప్రాథమిక పత్రాలు జత చేసి ట్రాన్స్‌ఫర్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. కొన్ని బ్యాంకులు ఎలాంటి పత్రాలు అవసరం లేకుండానే ఆన్‌లైన్‌లో అర్జీ పెట్టుకునే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. మరికొన్ని ఎస్ఎంఎస్ ద్వారా, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్ మాధ్యమం ద్వారా కూడా ఈ వెసులుబాటును కల్పిస్తున్నాయి. క్రెడిట్ స్కోరు, బకాయి మొత్తం వంటి అంశాలన్నింటినీ పరిశీలించి బదిలీకి అనుమతి ఇస్తాయి. కొత్త కార్డు జారీ సంస్థలు పాత కార్డు సంస్థకు డీడీ, నెఫ్ట్ లేదా ఇతర మార్గాల్లో బకాయి మొత్తాన్ని చెల్లిస్తాయి. దీంతో ప్రక్రియ పూర్తవుతుంది.

### ప్రయోజనాలు..

క్రెడిట్ కార్డు బిల్లు చెల్లించలేనప్పుడు కస్టమర్ దాన్ని బదిలీ చేసి ప్రయోజనం పొందే అవకాశం ఉంటుంది. అలా అన్ని కార్డు బకాయిలను ఒకే దగ్గరకు చేర్చుకోవచ్చు. దీంతో బకాయిలన్నీ ఒకే గొడుగు కిందకు వస్తాయి. బకాయిలను ట్రాన్స్‌ఫర్ చేస్తున్న కార్డు సంస్థలు కచ్చితంగా తక్కువ వడ్డీరేటు ఆఫర్ చేస్తాయి. ఫలితంగా కొంత భారం తగ్గి త్వరగా చెల్లించేందుకు వెసులుబాటు లభిస్తుంది. ఒకసారి చెల్లింపులు సకాలంలో చేయడం ప్రారంభిస్తే క్రెడిట్ స్కోర్ తిరిగి గాడిన పడుతుంది.బ్యాలెన్స్ బదిలీ చేసిన తర్వాత దాన్ని చెల్లించేందుకు కొత్త కార్డు సంస్థలు కొంత సమయాన్ని ఇస్తాయి. అలా డబ్బును సర్దుబాటు చేసుకోవడానికి అదనపు సమయం లభిస్తుంది. ఈ కాలానికి కొన్ని సంస్థలు ఎలాంటి వడ్డీ వసూలు చేయవు. కొన్ని నామమాత్రపు వడ్డీరేటును వర్తింపజేస్తాయి. ఈ సమయంలో కొత్త కొనుగోళ్లు చేసేందుకు అవకాశమూ ఉంటుంది. బదిలీ చేసిన బకాయిని తక్కువ వడ్డీరేటుతో నెలవారీ వాయిదాల కిందకూ మార్చుకునే వెసులుబాటు ఉంటుంది

### అందించే సంస్థలు..

హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ, ఐసీఐసీఐ,కొటాక్ మహీంద్రా ",స్టాండర్డ్ ఛార్టర్డ్, ఆర్‌బీఎల్, హెచ్‌ఎస్‌బీసీ వంటి ప్రముఖ బ్యాంకులన్నీ బ్యాలెన్స్ ట్రాన్స్‌ఫర్ ఆప్షన్‌ను ఇస్తున్నాయి. బ్యాంకుని షరతులు మారతాయి.

## ఇకపై 'ఐసీఐసీఐ' మినిమం బ్యాలెన్స్

# రూ. 50,000

### దేశంలో అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం 'ఐసీఐసీఐ' సంచలన నిర్ణయం




**జనంసాక్షి:**దేశంలో రెండవ అతిపెద్ద ప్రైవేట్ బ్యాంకింగ్ దిగ్గజం 'ఐసీఐసీఐ' సంచలన నిర్ణయం తీసుకుంది. మినిమమ్ బ్యాలెన్స్ రూ.50 వేలకు పెం చుతూ కీలక సవరణ చేసింది.2025 ఆగస్టు 1 అమలులోకి వచ్చేలా.. సేవిం గ్స్ ఖాతాలకు మినిమం మంత్లీ యావరేజ్ బ్యాలెన్స్‌ను గణనీయంగా పెంచు తున్నట్లు పేర్కొంది.ఐసీఐసీఐ బ్యాంక్ ప్రకారం.. మెట్రో, పట్టణ శాఖలలోని వినియోగదారులు మినిమం బ్యాలెన్స్ రూ. 50,000 నిర్వహించాలి. గతంలో ఈ బ్యాలెన్స్ రూ. 10,000గా ఉండేది.సెమీ అర్బన్ ప్రాంతాలలో వినియోగదారులు బ్యాలెన్స్ రూ. 5000 నుంచి రూ. 25వేలకు పెరిగింది. గ్రామీణ ఖాతాలను రూ. 2500 నుంచి రూ. 10,000కు పెంచింది. ఖాతాదారులు ఈ బ్యాలెన్స్ ఉండేలా చూసుకోకపోతే.. భారీ జరిమానాలు చెల్లించాల్సిందే. ఇదే బాటలో ఇతర ప్రైవేట్ బ్యాంకులు కూడా అడుగులు వేస్తే.. ఖాతాదారులు తమ ఖాతాల్లో వేల రూపాయలు ఉంచుకోక తప్పదు.

# ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ మెరుగైన ఆదాయ వృద్ధి

### దీర్ఘకాలిక విస్తరణకు తోడ్పడనున్న వ్యూహాత్మక పెట్టుబడులు



**హైదరాబాద్(జనంసాక్షి):** 50కుపైగా వినూత్న శీతలీకరణ పరిష్కారాల తయారీలో అగ్రగామిగా ఉన్న ఐస్ మేక్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్, జూన్ 30, 2025 (2026 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికం)తో ముగిసిన త్రైమాసికంలో ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలను ప్రకటిం చింది, లాభదాయకత పరంగా తాత్కాలిక అవరోధాలు కనిపించినప్పటికీ ఆదాయ వృద్ధిలో మెరుగైన ధోరణిని ప్రదర్శించింది. ఈ త్రైమాసికంలో, కంపెనీ రూ. 111.50 కోట్ల కార్యకలాపాల నుండి ఏకీకృత ఆదాయాన్ని నివేదించింది, ఇది ఆర్థిక సంవత్సరం 2025 మొదటి త్రైమాసికంలోని రూ. 85.23 కోట్లతో పోలిస్తే 30 శాతానికి పైగా వార్షిక వృద్ధిని నమోదు చేసింది. అయితే, కాలానుగుణ ఇన్‌పుట్ వ్యయ హెచ్చుతగ్గులు, పెరిగిన ఫైనాన్స్ ఖర్చులు , ఇన్వెంటరీ సర్దుబాట్ల కారణంగా, కంపెనీ గత సంవత్సరం ఇదే త్రైమాసికంలో నమోదు చేసిన రూ. 3.64 కోట్ల లాభంతో పోలిస్తే ఆర్థిక సంవత్సరం 2026 మొదటి త్రైమాసికంలో రూ. -1.47 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. ఇది స్వల్పకాలిక ప్రభావం అని, వ్యాపార అంతర్లీన ఫండమెంటల్స్ బలంగా ఉన్నాయని యాజమాన్యం నొక్కి చెప్పింది. ఈ ఫలితాలపై చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ చంద్రకాంత్ పి. పటేల్ మాట్లాడుతూ, "మా కస్టమర్ల నిరంతర నమ్మకం మాకు ప్రోత్సాహాన్నిస్తోంది. తాత్కాలిక ఖర్చు సంబంధిత ఒత్తిళ్లు ఉన్నప్పటికీ, మా బహుముఖ విస్తరణ వ్యూహం , రాబోయే నిధుల సేకరణ ప్రణాళికల ద్వారా రాబోయే త్రైమాసికాల్లో లాభదాయక వృద్ధిని అందించగలమని మేము నమ్మకంగా ఉన్నాము" అని అన్నారు.

### గుడ్ల ధరలు

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 4.50 | ₹ 4.52 |

### బంగారం ధరలు (10 గ్రాములు)

హైదరాబాద్

| ₹ 94,450 | ₹ 1,03,040 |
|---|---|
| (22 క్యారెట్లు) | (24 క్యారెట్లు) |

### వెండి ధరలు (కేజీ)

హైదరాబాద్

₹ 1,27,000

# ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక పరిణామం

### రంగంలోకి ట్రంప్.. యుద్ధాన్ని ఆపేస్తాడా?



**జనంసాక్షి:**ఉక్రెయిన్ శాంతి చర్చల్లో కీలక పరిణామం చోటు చేసుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ల భేటీ తేదీ, వేదిక ఖరారు అయ్యింది.ఆగస్టు 15వ తేదీన అలస్కాలో తాను పుతిన్‌తో భేటీ కాబోతున్నట్లు ట్రంప్ స్వయంగా ప్రకటించారు.నాకు, పుతిన్‌కు మధ్య భేటీ కోసం అంతా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఆ సమావేశం వచ్చే శుక్రవారం ఆగస్టు 15వ తేదీన గ్రేట్ అలస్కా స్టేట్‌లో జరగబోతోంది అని ట్రూత్ సోషల్‌లో పోస్ట్ చేశారాయన. మరోవైపు.. క్రెమ్లిన్ వర్గాలు కూడా ఈ విషయాన్ని ధృవీకరించాయి. అయితే ఈ చర్చలతో ట్రంప్ ఏం సాధించబోతున్నారనే విశ్లేషణ ఇప్పటికే మొదలైంది.ఉక్రెయిన్-రష్యా యుద్ధం 2022 ఫిబ్రవరిలో ప్రారంభమైనప్పటి నుంచి శాంతి చర్చలు పలు దఫాలుగా జరిగాయి. ఇస్తాంబుల్(టర్కీ)లో చర్చలు జరిగినా, తన రాయబారితో ట్రంప్ స్వయంగా ఇరు దేశాల మధ్య ట్రంప్ సంప్రదింపులు ఇప్పటివరకు శాంతి ఒప్పందం కుదరలేదు. అయితే ఈ సంక్షోభానికి శాంతియుత పరిష్కారం కనుగొనడం కోసం స్వయంగా ట్రంపే ఇప్పుడు రంగంలోకి దిగబోతున్నారని వైట్‌హౌజ్ అంటోంది. తద్వారా యుద్ధం ముగింపు దిశగా అడుగులు పడనున్నాయని అంటోంది. భౌగోళికంగా తటస్థ ప్రాంతం కావడం వల్ల ఉక్రెయిన్ చర్చలకు అలస్కా ఎంపిక చేసినట్లు చెబుతోంది. కొసమెరుపు ఏంటంటే.. యుద్ధ రుణభారంతో కుంగిపోయిన పూర్వపు రష్యా సామ్రాజ్యపు అధినేత జార్ అలెగ్జాండర్-2 1867లో అలస్కాను అమెరికాకు 7.2 మిలియన్ డాలర్లకు అమ్మేశాడు.

**రష్యా డిమాండ్లు:**క్రిమియా, డోనెత్స్క, లుహాన్స్క వంటి ప్రాంతాలను ఉక్రెయిన్ వదులుకోవాలని రష్యా కోరుతోంది. నాటోలో చేరే ఉక్రెయిన్ ఆలోచనను విరమించుకోవాలని రష్యా పట్టుబడుతోంది.

**ఉక్రెయిన్ వైఖరి:** భూభాగాలపై రాజీకి ఉక్రెయిన్ నిరాకరణ. అంతర్జాతీయ మద్దతుతో శాంతి చర్చలు కొనసాగించాలన్న పట్టుదల ఇప్పటివరకు రష్యా కాల్పుల విరమణకు అంగీకరించింది లేదు. అమెరికా ప్రతినిధులు జెలెన్‌స్కీతో కూడిన త్రైపాక్షిక సమావేశాన్ని ప్రతిపాదించినా, రష్యా ఇంకా స్పందించలేదు. మరోవైపు.. పుతిన్ శాంతి చర్చలు నాటకీయంగా మార్చేశారని జెలెన్‌స్కీ విమర్శిస్తూ వస్తున్న సంగతి తెలిసిందే. అదే సమయంలో.. తమ భాగస్వామ్యం లేకుండా శాంతి చర్చలు జరగడం సరికాదని అంటున్నారాయన. ఈ తరుణంలో.. మొన్నటిదాకా నియంతగా జెలెన్‌స్కీపై మండిపడ్డ ట్రంప్, ఇప్పుడు భేటీ కావడానికి సుముఖత వ్యక్తం చేయడం గమనార్హం.తాను ఈ ఏడాది జనవరిలో అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఉక్రెయిన్ సంక్షోభానికి ముగింపు పలకాలని ట్రంప్ తీవ్రంగా భావిస్తున్నారు. జెలెన్‌స్కీని తన దగ్గరకు రప్పించుకున్నప్పటికీ.. విమర్శించి పంపించారే తప్ప చర్చల్లో పురోగతి సాధించలేకపోయారు. ఆపై అమెరికా రాయబారి స్టీవ్ విట్కాఫ్‌ను ఇరు దేశాలకు పంపించి దౌత్యం నడిపించారు కూడా. ఈ క్రమంలో ఇటు రష్యా డిమాండ్లకు తలొగ్గాలని ఉక్రెయిన్‌కు సూచించడంతో పాటు చర్చల్లో ఉక్రెయిన్‌ను భాగం చేయాలని ట్రంప్ భావిస్తున్నారు. పుతిన్, ట్రంప్ చివరిసారిగా 2018 ఫిన్లాండ్ రాజధాని హెల్సెంకీలో భేటీ అయ్యారు. అలాగే దాదాపు పదేళ్ల తర్వాత పుతిన్ అమెరికాకు రానున్నారు. శాంతి చర్చల్లో ఈ ఇద్దరి భేటీ కీలకం కానుంది. అలాగే ఈ సమావేశం ప్రపంచ రాజకీయాల్లో కీలక మలుపు తిప్పే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు. తనను తాను శాంతికాముకుడిగా ప్రకటించుకున్న ట్రంప్.. ఇప్పటిదాకా పలు దేశాల మధ్య యుద్ధాలను ఆపానంటూ ప్రకటించుకున్న సంగతి తెలిసిందే. ఈ తరుణంలో ఈ యుద్ధాన్ని కూడా ఆపేస్తాడా? అంటూ సోషల్ మీడియాలో కామెంట్లు వినిపిస్తున్నాయి. అలాగే ఉక్రెయిన్ యుద్ధాన్ని తానే ఆపేస్తానంటూ మొదటి నుంచి ట్రంప్ చెబుతూ వస్తున్నారు. అయితే..ట్రంప్ ఉక్రెయిన్ శాంతి చర్చల విషయంలో దూకుడుగానే వ్యవహరిస్తున్నారు. ఆర్థిక ఒత్తిడి, రాయబార చర్చలు, వ్యక్తిగత సంబంధాలు ద్వారా యుద్ధాన్ని ఆపే ప్రయత్నం చేస్తున్నారు. అయితే.. మూడు దేశాల మధ్య సహకారం, నమ్మకం, ప్రామాణిక చర్చలపైనే ఈ సంక్షోభం ముగియడం అనేది ఆధారపడి ఉంటుందన్నది విశ్లేషకుల మాట.



## విజయవంతంగా విక్రమ్-1 బూస్టర్ పరీక్ష

హైదరాబాద్: విక్రమ్-1 అనే తొలి ప్రైవేటు వాణిజ్య రాకెట్ ప్రయోగాన్ని నిర్వహించేందుకు సిద్ధమవుతున్న స్కైరూట్ ఏరోస్పేస్ మరో మైలురాయిని అధిగమించింది. శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్-షార్‌లోని అధునాతన పరీక్షా సముదాయంలో విక్రమ్-1 రాకెట్‌లోని స్టేజ్ 1 కార్బన్ కాంపోజిట్ సాలిడ్ ఫ్యూయల్ బూస్టర్ స్టేజ్‌ను శుక్రవారం విజయవంతంగా నిర్వహించింది. ఇస్రో పర్యవేక్షణలో దీన్ని చేపట్టారు. కలామ్-1200 పేరుతో చేపట్టిన ఈ ప్రయోగంలో మొదటి దశ కార్బన్ కాంపోజిట్ ఘన ఇంధన బూస్టర్‌ను స్థిర పరీక్షలో విజయవంతంగా ప్రదర్శించింది. 11 మీటర్ల పొడవు కలిగిన కలామ్-1200 రాకెట్ మోటార్..భారత అంతరిక్ష రంగంలో ఇప్పటివరకు ప్రైవేట్ రంగం అభివృద్ధి చేసిన అతిపెద్ద ఘన రాకెట్ మోటార్‌గా గుర్తింపు పొందింది. ఇది శూన్యావస్థలో సుమారు 1,200 కిలోన్యూటన్ గరిష్ట థ్రస్ట్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది బోయింగ్ 737 మాక్స్ విమాన ఇంజిన్ శక్తి కంటే దాదాపు 10 రెట్లు ఎక్కువ. సుమారు 110 సెకన్ల పాటు సాగిన ఈ పరీక్షలో మోటార్ అన్ని అంచనా పరిమితులలోనే అవసరమైన థ్రస్ట్‌ను అందించిందని స్కైరూట్ వెల్లడించింది.

## పుణెలో కూలిన విమానం

**జనంసాక్షి:**పుణెలో ఓ శిక్షణ విమానం కూలిపోయింది. బారామతి వి మానాశ్రయం సమీపంలో ఈ ఘటన జరిగింది. అయితే, ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు కాలేదని పోలీసులు తెలిపారు. రెడ్‌బర్డ్ ఫ్లైట్ ట్రైనింగ్ అకాడమీకి చెందిన శిక్షణ విమానం ఈ ప్రమాదానికి గురైంది. విమానాన్ని నడుపుతున్నప్పుడు, టైర్లలో ఒకటి దెబ్బతిన్నట్లు పైలట్ గమనించాడు. పైలట్ ఉదయం 8 గంటల ప్రాంతంలో అత్యవసరంగా ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నించాడు. దీంతో విమానం ల్యాండింగ్ తర్వాత ముందు చక్రం ఊడిపోయింది. విమానం టాక్సీవే నుంచి దారితప్పి విమానాశ్రయంలోని ఒక వైపు పొదల్లోకి దూసుకెళ్లిందని పోలీసులు తెలిపారు. ప్రమాదంలో ఎవరూ గాయపడలేదని.. పైలట్ సురక్షితంగా ఉన్నారని ఆయన తెలిపారు.మరోవైపు, విమానం ల్యాండింగ్ సమయంలో పక్షులు అడ్డురావడంతో పైలట్ ల్యాండింగ్‌ను రద్దు చేయడానికి ప్రయత్నించాడని అయితే, తిరిగి రెండోసారి ల్యాండింగ్ చేయడానికి ప్రయత్నిండంతో ఈ సమయంలో విమానం ముందు చక్రం ఊడిపోయిందనే వాదన కూడా వినిపిస్తుంది.



## కోల్‌కతా హత్యాచార ఘటనకు ఏడాది పూర్తి..

### పెద్ద ఎత్తున నిరసన.. లాఠీచార్జ్

**జనంసాక్షి:**గత ఏడాది దేశ వ్యాప్తంగా పెను సంచలనం రేపిన కోల్‌కతాలోని ఆర్‌జి కర్ మెడికల్ కాలేజ్ అండ్ హాస్పిటల్‌లో 31 ఏళ్ల పోస్ట్-గ్రాడ్యుయేట్ ట్రైనీ డాక్టర్ హత్యాచార ఘటనపై మరోసారి పెద్ద ఎత్తున ఆందోళన చెలరేగింది.ఆ ఘటనలో పూర్తి స్థాయి న్యాయం జరగలేదంటూ ప్రజలు రోడ్డుపైకి వచ్చారు. ట్రైనీ డాక్టర్‌పై హత్యాచారం జరిగి ఏడాది పూర్తైన నేపథ్యంలో 'నబన్న అభియాన్' పేరుతో శనివారం(ఆగస్టు, 9వ తేదీ) మార్చ్ నిర్వహించారు.ఈ నిరసన ర్యాలీలో బాధిత తల్లిదండ్రులతో పాటు ప్రతిపక్ష బీజేపీ, పలు పార్టీల నాయకులు, ప్రజలు పాల్గొన్నారు. పశ్చిమ బెంగాల్ రాజధాని కోల్‌కతాలోని పలు ప్రాంతాలతో పాటు పారిశ్రామిక నగరం హౌరాలో కూడా పెద్ద ఎత్తును నిరసన కార్యక్రమం జరిగింది. ఈ నిరసన కార్యక్రమాన్ని చెదరగొట్టడానికి మమతా సర్కార్ పోలీసుల్ని భారీ సంఖ్యలో ప్రయోగించింది. ఎక్కడికక్కడే నిరసనకారులపై లాఠీ చార్జ్ చేశారు పోలీసులు. ఈ క్రమంలోనే పోలీసులకు నిరసనకారులకు మధ్య రగడ చోటు చేసుకుంది. తాము న్యాయం చేయాలంటూ నిరసన చేస్తుంటే ఎందుకు అడ్డకుంటున్నారని ప్రజలు ప్రశ్నించారు. దీనికి మమతా సర్కార్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

## భారీ వర్షాతో ఢిల్లీ అతలాకుతలం

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ఢిల్లీని భారీ వర్షాలు అతలాకుతలం చేస్తున్నాయి. శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న కుండపోత వర్షం కారణంగా పలు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి. జైత్‌పూర్‌లో శనివారం ఉదయం గోడ కూలిపోవడంతో 8 మంది మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. కొంతమంది శిథిలాల కింద చిక్కుకున్నారు. గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. రంగంలోకి దిగిన పోలీసులు, అగ్ని మాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. దేశ రాజధాని ఢిల్లీలో భారీ వర్షాలకు గోడకూలి ఏడుగురు మృతి చెందారు. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. హస్తినలో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా ఈ ప్రమాదం సంభవించినట్టు- తెలుస్తోంది. ఢిల్లీలోని హరినగర్‌లో ఈ ఘటన చోటు-చేసుకుంది. ఈ ప్రమాదంలో 8 మందిని రక్షించారు, తీవ్రంగా గాయపడ్డ నలుగురుని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. భారీగా కురిసిన వర్షం కారణంగా హరి నగర్‌లోని జైత్‌పూర్ ప్రాంతంలో గోడ కూలిపోవడంతో, పాత ఆలయం పక్కనే ఉన్న జగ్గీలలో నివసిస్తున్న వాళ్లు ఈ ప్రమాదంలో చిక్కుకున్నారు. భవిష్యత్తులో అలాంటి ఘటనలు జరగకుండా జగ్గీలను ఖాళీ చేయించామని సౌత్ ఈస్ట్ అదనపు డీసీపీ ఐశ్వర్య శర్మ తెలిపారు.

## న్యూయార్క్ టైమ్స్ స్క్వేర్‌లో కాల్పుల కలకలం

### ముగ్గురికి గాయాలు.. భయంతో జనం పరుగులు



న్యూయార్క్(జనంసాక్షి):న్యూయార్క్‌లోని ప్రసిద్ధ టైమ్స్ స్క్వేర్‌లో కాల్పుల కలకలం రేగింది. ఈ ఘటనలో ముగ్గురు గాయపడ్డారు. కాల్పులతో ఒక్కసారిగా అలజడి రేగడంతో జనం భయంతో పరుగులు తీశారు.అనుమానితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 17 ఏళ్ల యువకుడు కాల్పులు జరిపినట్లు పోలీసులు వెల్లడించారు. ముగ్గురు గాయపడగా.. వారిలో ఒక యువతి ఉన్నారు. వారిని బెల్లెవ్యూ ఆసుపత్రికి తరలించారు.నిందితుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారణ చేపట్టారు.అతడి వద్ద నుంచి ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు.అతడి వద్ద నుంచి ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు. కాగా, ఈ ఘటనలో ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. నగరంలో గన్ క్రైమ్ తగ్గుతోందన్న పోలీస్ కమిషనర్ ప్రకటించిన కొద్దిరోజుల్లోనే ఇలాంటి ఘటన చోటుచేసుకోవడం గమనార్హం.ఈ ఘటనలు అమెరికాలో గన్ కల్చర్‌కు అమాయకులు బలైపోతున్నారు. గత నెల జులై 29న న్యూయార్క్‌లోని మాన్‌హట్టన్ ఆఫీస్ భవనంలో జరిగిన కాల్పుల్లో ఐదుగురు మృతి చెందారు. ఎన్‌వైపీడీ అధికారి సహా ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. కాల్పులు జరిపిన వ్యక్తిని లాస్ వెగాస్‌కు చెందిన 27 ఏళ్ల షేన్ తమురాగా పోలీసులు గుర్తించారు. నిందితుడు కూడా గాయాలతో మృతిచెందాడని పోలీసులు తెలిపారు.నిందితుడు కూడా గాయాలతో మృతిచెందాడని పోలీసులు తెలిపారు.మరో ఘటనలో మే 27న ఫిలడెల్ఫియాలోని ఫెయిర్‌మౌంట్ పార్క్ కాల్పులు కారణంగా ఇద్దరు మైనర్లు మృతి చెందారు.ఈ ఘటనలో 8 మంది గాయపడ్డారు. మెమోరియల్ డే సందర్భంగా జనసంచారం ఎక్కువగా ఉండగా.. రాత్రి 10:30 సమయంలో కాల్పులు జరిగాయి.

# కావాలనే మాతో మాట్లాడించారు

- వీడియోలు తీసి దుష్ప్రచారం చేయడం సరికాదు: రుద్రంగి మండల రైతులు
- రాష్ట్ర ప్రభుత్వ విప్ సహకారంతో మేము ఎరువులు తీసుకున్నాం




**రుద్రంగి ఆగస్టు 9 (జనంసాక్షి) :** యూరియా కోసం మేము దుకాణానికి వెళ్తే కొందరు వ్యక్తులు వచ్చి మాతో బలవంతంగా మాట్లాడించి.. వీడియో తీశారు ఎరువుల కొరత ఉందని, మిగతా విషయాలు చెప్పాలని ఒత్తిడి చేశారు.. అవే వీడియోలు టీవీ ఛానెల్ లో ప్రసారం చేశారు.. ఇక్కడ మాకు ఎరువుల సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదు.. రాష్ట్ర ప్రభుత్వం, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి సాగులో ఎలాంటి ఇబ్బందులు రాకుంట చూసుకుంటున్నారు.మాతో కావాలని మాట్లాడించి దుష్ప్రచారం చేయడం సరికాదంటూ...పలువురు రైతులు రుద్రంగిలో శనివారం తెలిపారు.రుద్రంగిలో ఎరువుల కొరత ఉందని గంటల తరబడి రైతులు వాటికోసం వేచి చూసి ఇబ్బంది పడుతున్నారని ఓ టీవీ ఛానల్ లో పలువురు రైతులు తమ అభిప్రాయాన్ని చెప్పినట్లు శుక్రవారం రాత్రి ప్రసారాలు చేశారు. కావాలనే ఓ మీడియా సంస్థ రైతులతో బలవంతంగా మాట్లాడించి, వాటిని ప్రసారం చేసింది ఆ రైతులే శనివారం మీడియా ఎదుటకు వచ్చి తమతో కావాలనే మాట్లాడించారని స్పష్టం చేశారు. ఎరువుల కొరత ఉందని కావాలనే టి న్యూస్ ఎలక్ట్రానిక్ మీడియా సంస్థలో దుష్ప్రచారం చేయడం సరికాదని పేర్కొన్నారు.జిల్లాలో సాగుకు అనుగుణంగా అందుబాటులో యూరియా నిలువలు ఉంచామని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా వెల్లడించారు. కావున రైతులు ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రుద్రంగి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చేలుకల తిరుపతి అన్నారు. సూచించారు. రుద్రంగి మండలంలో ఎరువుల కొరత లేదని, రైతులు సంయమనం పాటించాలని కోరారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# ఘనంగా క్విట్ ఇండియా దినోత్సవం

- స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమం
- నగర కాంగ్రెస్ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ జండా ఆవిష్కరించిన నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి



కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 09 (జనంసాక్షి) :
స్వాతంత్ర్య సంగ్రామంలో కీలక ఘట్టం క్విట్ ఇండియా ఉద్యమం అని నగర కాంగ్రెస్ అధ్యక్షుడు, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు. ఆనాడు రెండవ ప్రపంచ యుద్ధంలో భారతదేశాన్ని ఉపయోగించుకోవాలని బ్రిటన్ భావించిందని భారత దేశానికి స్వాతంత్ర్యం ఇస్తేనే యుద్ధానికి మద్దతు ఇవ్వాలని భారతీయులు భావించారని ఇందుకు బ్రిటన్ అంగీకరించలేదని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. భారతీయులను ఒప్పించి యుద్ధంలో దించుటకు సర్ స్రాఫర్డ్ క్రిప్స్ అనే మంత్రిని బ్రిటన్ భారత్ కు పంపించడం జరిగిందని గవర్నర్ జనరల్ కౌన్సిల్ లో రక్షణ సభ్యునిగా భారతీయుడ్ని నియమించాలనే భారత్ ప్రతిపాదనను బ్రిటన్ అంగీకరించక పోవడం వల్ల దౌత్యం విఫలమైందని 1942 ఆగష్టు 8న బొంబాయిలోని వార్దాలో కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశమై బ్రిటిష్ పాలన అంతమవ్వాలని క్విట్ ఇండియా తీర్మానం ఆమోదించడం జరిగిందని నరేందర్ రెడ్డి అన్నారు. ఆగష్టు 9న ఎన్నో నిర్బంధాల మధ్య క్విట్ ఇండియా ఉద్యమం విజయవంతం అయిందని కానీ ఎందరో ఉద్యమకారులు అమరులయ్యారని మరెందరినో జైళ్ళల్లో బంధింపబడ్డారని నరేందర్ రెడ్డి గుర్తు చేశారు. ఆనాటి స్వాతంత్ర్య ఉద్యమం మొత్తం గాంధీ, నెహ్రూ తో పాటు ఎందరో మహానుభావులు కాంగ్రెస్ జండా పట్టుకొని పోరాటం చేశారని అటువంటి కాంగ్రెస్ పార్టీ జండా మోయడాన్ని నిరంతరం కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలుగా గర్వపడుతామని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎండి తాజ్, గుండాటి శ్రీనివాస్ రెడ్డి, కుర్ర పోచయ్య, రవీందర్ గౌడ్, మేరాజ్, అష్రఫ్, సుదర్శన్, షబానా మహమ్మద్, ముల్కల కవిత, జ్యోతిరెడ్డి, మాసూమ్ ఖాన్, యనమల మంజుల, హసీనా, సాయిరాం, బషీర్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

## సిరిసిల్ల సాహితీవేత్తలకు అరుదైన గౌరవం

**బుక్ బ్రహ్మ దక్షిణ భారత సాహిత్యోత్సవంలో డాక్టర్ పత్తిపాక, పెద్దింటి**

**రాజన్న సిరిసిల్ల బ్యూరో ఆగస్టు 9 (జనంసాక్షి):** రాజన్న సిరిసిల్ల జిల్లాకు చెందిన సాహితీవేత్తలకు అరుదైన అవ కాశం లభించింది. బుక్ బ్రహ్మ సాహిత్యంలో భాగంగా ఆగస్టు 8వ తేదీ నుండి 10వ తేదీ వరకు బెంగుళూర్ లో నిర్వహించిన కార్యక్రమాలకు సిరిసిల్లకు చెందిన సాహితీవేత్తలు డాక్టర్ పత్తిపాక మోహన్, పెద్దింటి అశోక్ కుమార్‌లు హాజరయ్యారు. "ప్రాంతీయ అస్తిత్వం" సదస్సులో తెలంగాణ భాష అస్తిత్వం అచేతనులు " అంశంపై పెద్దింటి అశోక్ కుమార్ ప్రసంగించారు. "బాల సాహిత్యం రచన కళ" సదస్సులో సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డాక్టర్ పత్తిపాక మోహన్ పాల్గొన్నారు. సిరిసిల్ల ప్రాంతం నుంచి ఎదిగిన సాహితి వ్యక్తులకు ప్రత్యేకంగా జాతీయస్థాయిలో నిర్వహించి సదస్సులలో ప్రసంగించే అవకాశం రావడం పట్ల సిరిసిల్ల సాహితీవేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

# గిరిజన సంక్షేమానికి రూ.24,028 కోట్లు

- గిరిజన సంస్కృతి ప్రదర్శనలతో హోరెత్తిన కొమరం భీమ్ ఆదివాసి భవన్!





**హైదరాబాద్, ఆగస్టు 9 (జనం సాక్షి) :**
తెలంగాణలో ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కొమరం భీమ్ ఆదివాసి భవన్‌లో ఆదివాసి, గిరిజన, లాంబాడా, కోయ, గోండు, చెంచు, కొలం వంటి వివిధ జాతుల ప్రతినిధులు పాల్గొని, సాంప్రదాయ నృత్యాలు, కళారూపాలు, వృత్తుల ప్రదర్శనలతో సందడి చేశారు. మంత్రి సీతక్క గిరిజనులతో కలిసి బోనం పెట్టి, విల్లు ఎక్కి, నృత్యం చేసి ఆనందంగా గడిపారు. డప్పు చప్పుళ్లు, నృత్యాలతో వేడుక హోరెత్తింది. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ఈ దినోత్సవం గిరిజన హక్కులను కాపాడే పండుగ అని, అందరికీ శుభాకాంక్షలు తెలిపారు. సంయుక్త రాష్ట్ర సమితి సంస్థ ప్రకటించిన ఈ దినాన్ని ప్రతి ఆగస్టు తొమ్మిదిన జరుపుకుంటారని, ఆదివాసి సంస్కృతి, సంప్రదాయాలు, సహజ వనరుల పరిరక్షణలో వారి పాత్రను గౌరవనీయమని చెప్పారు. సజ్జలు, కొర్రలు వంటి గిరిజన ఆహారం ఆరోగ్యకరమని, ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు ఆదివాసి భూములకు జోలికి వెళ్లకుండా, పట్టాలు ఇస్తున్నామని వివరించారు. వచ్చే ఏడాది పది వేల మందితో మరింత ఘనంగా జరుపుతామని చెప్పారు. తెలంగాణలో ముప్పై రెండు గిరిజన వర్గాలు నివసిస్తున్నాయని, జనాభాలో తొమ్మిది శాతం షెడ్యూల్ తెగలవారని, అదిలాబాద్, ఆసిఫాబాద్, భద్రాద్రి కొత్తగూడెం వంటి జిల్లాల్లో ఎక్కువ షెడ్యూల్ ప్రాంతాలు ఉన్నాయని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం డిసెంబర్ రెండు వేల ఇరవై మూడు నుంచి సాహసోపేత నిర్ణయాలు తీసుకుంటోందని, షెడ్యూల్ తెగల అభివృద్ధి నిధికి పదిహేడు వేల ఒకటి వంద అరవై ఎనిమిది కోట్లు, గిరిజన సంక్షేమ శాఖకు ఆరు వేల ఎనిమిది వంద అరవై కోట్లు కేటాయించామని, ఇది రాష్ట్ర చరిత్రలో అత్యధికమని పేర్కొన్నారు. అడవి హక్కుల చట్టం కింద సౌర శక్తి పంపులతో సాగు సౌకర్యం కల్పిస్తున్నామని, మూడేళ్లలో 12600 కోట్లతో రెండు లక్షల రైతులకు ఆరు లక్షల ఎకరాలు కవర్ చేస్తామని చెప్పారు.729.54 కోట్లతో 429 సుదూర గిరిజన ఆవాసాలకు బిటి రోడ్లు, ఇందులో ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పరిధిలో 235 మైదాన ప్రాంతాల్లో 193 సౌకర్యం కల్పిస్తామని వివరించారు. విద్యారంగంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమాలు, గురుకులాలు, ఏకలవ్య పాఠశాలలు ఏర్పాటు చేశామని, మూడు వంద ఇరవై ఆరు ఆశ్రమ పాఠశాలల్లో 2029కి 100శాతం ఫలితాలు వచ్చాయని, జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్ మెయిన్స్‌లో 1027 మంది ఎన్ఐటీలు, 82 మంది ఐఐటీలు, నీట్‌లో 62 మంది మెడికల్ సీట్లు సాధించారని తెలిపారు. ఇంటిగ్రేటెడ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ పరిధిలో 7750 ప్రైమరీ వల్నరబుల్ ట్రైబల్ గ్రూప్స్‌కు పదమూడు వేల రెండు వంద అరవై ఆరు ఇండ్లు, మొత్తం 2216 ఇందిరమ్మ ఇళ్లు కేటాయించామని చెప్పారు. 35 మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు చేశామని, పన్నెండు వేల నాలుగు వంద డెబ్బై ఎనిమిది గిరిజన గ్రామాలకు 100శాతం విద్యుదీకరణ చేశామని వివరించారు. గత ప్రభుత్వాలు గిరిజన సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేశాయని, కాంగ్రెస్ మొదటి ఎనిమిది నెలల్లోనే భూహక్కులు, విద్య, ఆరోగ్యం, సంస్కృతి రంగాల్లో అభివృద్ధి చేస్తోందని అన్నారు. పంచాయతీ రాజ్ మంత్రి సీతక్క మాట్లాడుతూ, ఉన్నత స్థాయికి ఎదిగినా పూర్వ స్థితి, అస్తిత్వం మరవద్దని, గిరిజన ఆహారం గొప్పదని, ఇప్పుడు స్టార్ హోటళ్లలో సూప్‌గా తింటున్నా రని చెప్పారు. ఆదివాసీలు మంచి ఆహారంతో ఆరోగ్యవంతులని, గట్టిగా ఉండాలంటే ఆదివాసి ప్రాంతాల్లో బతకాలని, కరోనా సమ యంలో గ్రామాలవారు తక్కువ చనిపోయారని అన్నారు. ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి డైట్, కాస్మటిక్ చార్జీలు పెంచారని, సౌర శక్తి ఇస్తున్నారని, బడ్జెట్‌లో 15 వేల కోట్లు కేటాయించారని తెలిపారు. ఆదివాసి జాతిని గర్వంగా చెప్పుకోవాలని, ఇంటర్, పది ఫలితాల్లో ములుగు, అసిఫాబాద్, మహబూబాబాద్ జిల్లాలు రాష్ట్రం లో మొదటి, రెండవ స్థానాలు సాధించాయని చెప్పారు. కళారూపా లు పూర్వీకుల జీవనాన్ని తెలిపే అవకాశమని, చదువుతోపాటు సంస్కృతి ముఖ్యమని, పూర్వీకుల ఆహారం శాస్త్రీయమని, ఆయుర్వేద వైద్యంతో వంద ఏళ్లు బతికేవారని వివరించారు. స్థిరపడినా సొంత గ్రామాలు మరవద్దని, గ్రామాల్లో బతికితే శరీరం దృఢమవుతుందని అన్నారు. కళాకారులకు ధన్యవాదాలు తెలిపారు. డిప్యూటీ స్పీకర్ రాం చంద్ర నాయక్ మాట్లాడుతూ, గత పది ఏళ్లు షెడ్యూల్ తెగల సబ్ ప్లాన్ నిధులు దారి మళ్లించారని, ట్రైబల్ శాఖను నిర్వీర్యం చేశారని, మా ప్రభుత్వం సరిచేస్తుందని చెప్పారు. పెండింగ్ నిధులు విడుదల చేయాలని మంత్రి అడ్లూరిని కోరారు. ఆదివాసి క్రీడాకారులను ఆదుకోవాలని, తాండల అభివృద్ధి, ఉపాధి హామీ, పోడు పట్టాలు కాంగ్రెస్‌తోనే సాధ్యమని, డైట్ కాస్మటిక్ చార్జీలు పెంచామని తెలిపారు.అశ్వరావుపేట శాసనసభ్యులు ఆదినారాయణ తన ఆటపాటలతో ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో అశ్వరావుపేట శాసనసభ్యులు జరే ఆదినారాయణ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్, వికలాంగుల చైర్మన్ ముత్తినేని వీరయ్య, గిరిజన సంక్షేమ శాఖ కమిషనర్ డాక్టర్ వి.ఎస్. అలగు వర్షిని, అడిషనల్ డైరెక్టర్ వి. సర్వేశ్వర్ రెడ్డి, ట్రైకార్ జనరల్ మేనేజర్ శంకర్రావు, తెలంగాణ గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్స్టిట్యూషన్స్ సొసైటీ కార్యదర్శి కె. సీతలక్ష్మి, ట్రైబల్ కల్చరల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఇన్స్టిట్యూట్ డైరెక్టర్ డాక్టర్ వి. సముజ్వాల, తెలంగాణ గిరిజన కో ఆపరేటివ్ కార్పొరేషన్ జనరల్ మేనేజర్ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

## నాలుగేళ్ల కుమార్తెపై తండ్రి అఘాయిత్యం

**బంజారాహిల్స్, ఆగస్టు 9 (జనం సాక్షి) :**
బంజారాహిల్స్‌లో నాలుగేళ్ల బాలికపై కన్నతండ్రి లైంగికదాడికి పాల్పడిన ఘటనలో బంజారాహిల్స్ పోలీసులు పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో నివసిస్తున్న ఓ మహిళకు 2017లో అఫాన్ అనే వ్యక్తితో రెండో వివాహం జరిగింది. వారికి నాలుగేళ్ల కుమార్తె ఉంది. గత కొన్ని రోజులుగా బాలిక ముభావంగా ఉండడం, చిన్న విషయానికి బెంబేలెత్తి పోవడం, తీవ్ర భయంతో వణికిపోవడం తల్లి గమనించింది. బాలిక ప్రవర్తనలో విపరీత మార్పులను చూసిన తల్లి ఆరా తీయగా, తండ్రి అఫాన్ తనపై అఘాయిత్యానికి పాల్పడినట్లు బాలిక తెలియని భాషలో వెల్లడించింది. దీంతో బాలికను సైక్రియాటిస్ట్ వద్దకు తీసుకెళ్లగా, ఆమెపై లైంగికదాడి జరిగినట్లు నిర్ధారణ అయింది. నెల రోజుల క్రితం ఇంట్లో ఎవరూ లేని సమయంలో అఫాన్ బాలికపై లైంగికదాడి చేసినట్లు తేలింది. ఈ విషయం తెలిసిన మహిళ తన భర్తను ఇంట్లోకి రానివ్వలేదు. రెండు రోజుల క్రితం అఫాన్ తన తండ్రి, బంధువులతో కలిసి వచ్చి మహిళను తీవ్రమైన పదజాలంతో దూషించాడు. దీంతో ఆందోళనకు గురైన బాలిక తల్లి బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు బీఎన్ఎస్ 65(2), పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## రైతులకు సరిపడా ఎరువులను అందించాలి

**సైదాపూర్, కరీంనగర్, ఆగస్టు 9 (జనం సాక్షి) :**
రైతులకు సరిపడా ఎరువులను అందించాలని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సోమారపు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ రైతులకు ఎరువులను అందించడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయం లో రైతులకు కాళేశ్వరం ద్వారా సాగు నీరు అందిచడం తో పాటు అన్ని సౌకర్యాలు కల్పించారన్నారు. ఒక వైపు ఎరువుల కొరత లేదని అధికారులు చెబుతుంటే రైతులకు మాత్రం ఎరువులు అందడం లేదన్నారు. అధికారులు ఎరువుల పంపిణి కేంద్రాలకు వస్తే వాస్తవ పరిస్థితులు తెలుస్తయాన్నారు. రైతులకు ఎరువులు సకాలంలో అందించకపోతే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చెప్పాడుతామన్నారు. రైతులకు అండగా బీఆర్ఎస్ ఎల్లప్పుడూ ఉంటుందన్నారు. ఈ కార్యక్రమం లో నాయకులు మునిపాలా శ్రీనివాస్, చాడ ఆదిరెడ్డి, హరీష్ రావు, నరేష్ తదితరులు రైతులు పాల్గొన్నారు.

# రెండు దశాబ్దాల కల నెరవేరేనా?

- హైకోర్టు ఆదేశం ప్రభుత్వం అమలు చేసేనా?
- ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని 653 మంది ఉపాధ్యాయులకు మేలు జరిగేనా?




**కామారెడ్డి జిల్లా ప్రతినిది ఆగస్టు 9 (జనం సాక్షి)**
డీఎస్సీ 2003 నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉపాధ్యాయులు పాత పెన్షన్ కి అర్హులేనని తెలంగాణ హైకోర్టు స్పష్టం చేసిన నేపథ్యంలో శనివారం వశిష్ట డిగ్రీ కళాశాలలో డీఎస్సీ 2003 పాత పెన్షన్ పోరాట సమితి కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కొక్కుల శ్రీకాంత్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించడం జరిగింది. 2003 నోటిఫికేషన్ ద్వారా నియామకమైన ఉపాధ్యాయులు పాత పెన్షన్ పథకానికి అర్హులేనని వారికి పాత పెన్షన్ పథకాన్ని అమలుచేయాలని ఇటీవల తెలంగాణ హై కోర్ట్ జడ్జిమెంట్ జారీ చేసిందన్నారు.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 2003 డీఎస్సీ ఉపాధ్యాయుల నియామకం కోసం అప్పటి ప్రభుత్వం నవంబర్ 13, 2003 న నోటిఫికేషన్ జారీ చేసిందని. ఏప్రిల్ 2004 లో రాత పరీక్షలు నిర్వహించి, జూన్ లో ఫలితాలు విడుదల చేసి నవంబర్ 2005 లో నియామకాలు చేశారు. కేవలం పరిపాలనాపరమైన కారణాలతో నియామక ఉత్తర్వులు ఆలస్యంగా జారీచేశారని ఆరోపించారు. అలాంటప్పుడు వీరికి సెప్టెంబర్ 2004లో వచ్చిన నూతన పించన్ విధానాన్ని ఎలా వర్తింపజేస్తారని హైకోర్టు ప్రశ్నించింది.2003 డీఎస్సీ వారికి పాత పెన్షన్ పథకం వర్తింపజేయాలని తీర్పునిచ్చింది.2005 నుంచి జరుగుతున్న డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల పోరాటానికి సరిగ్గా 20ఏళ్ల తర్వాత ఫలితం దక్కడంతో ఉపాధ్యాయుల్లో ఆనందం వ్యక్తం అవుతుందన్నారు.2003 డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి ప్రక్రియ అంతా పూర్తియినప్పటికి అప్పటి ప్రభుత్వము నియామక ఉత్తర్వులు ఆలస్యంగా ఇచ్చింది. ఇరవై ఏళ్లుగా పోరాటం చేస్తున్నాం. ఇలాంటి ప్రత్యేక సందర్భాలు కలిగిన ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ పెన్షన్,ప్రజా సంక్షేమ శాఖ 2020 ఫిబ్రవరి 17, న విడుదల చేసిన 57/4,57/5 ప్రకారం మరియు హై కోర్ట్ తీర్పు ను అనుసరించి 2003 డీఎస్సీ ఉపాధ్యాయినీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ వర్తింపజేయాలని కేంద్ర ప్రభుత్వం కూడా చెప్పిందనీ, ఇప్పటికైన తెలంగాణ ప్రభుత్వం తాత్సారం చేయకుండా 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు హైకోర్టు తీర్పును అనుసరించి పాత పెన్షన్ వర్తింపజేయాలని,జిల్లా అధ్యక్షులు కొక్కుల శ్రీకాంత్ తెలియజేశారు.హైకోర్టు తీర్పు ఆధారంగా పాత పెన్షన్ ను అమలు చేయాలని,కేంద్రప్రభుత్వం 57/4,57/5 మెమోలను దేశం లో 15 రాష్ట్రాలలో అమలుచేస్తున్నాయని,ఆ మెమో ల ఆధారంగా, హై కోర్ట్ తీర్పును అనుసరించి తక్షణమే తెలంగాణ లో 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ సౌకర్యం కల్పించాలని, రాష్ట్ర అసోసియేట్ ప్రెసిడెంట్ కొట్టూరు దుర్గాప్రసాద్ తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా బాధ్యులు విజయ్ వర్ధన్, మండల బాధ్యులు గిరి, అనిల్, రాము, శ్రీను, నరేష్, ఎల్లగౌడ్, దుర్గయ్య, శ్రీధర్, ప్రదీప్, లతో పాటు 35మంది ఉపాధ్యాయులు పాల్గొనడం జరిగింది.

## దొంగ సొత్తు కొనుగోలు
### ఇద్దరు అరెస్ట్... బంగారం ఆభరణాలు స్వాధీనం

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (జనం సాక్షి) :**
జాతీయ రహదారులపై దోపిడీలు, గ్రామాల్లో ఇళ్ల దొంగతనాలకు పాల్పడిన పార్ధి గ్యాంగ్‌లో ప్రధాన నిందితుడు భాస్కర్ బాపూరావు చవాన్ ఎ2 ను గాంధారి పోలీసులు2025 ఆగస్టు 7న అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. విచారణలో, అతను దొంగ సొత్తును మహారాష్ట్రకు చెందిన బీరదర్ అభిషేక్, ఇర్ఫాన్ నూర్ ఖాన్‌లకు అమ్మినట్లు బయటపడింది. దొంగ సొత్తు అని తెలిసి కూడా కొనుగోలు చేసిన ఈ ఇద్దరిని అదుపులోకి తీసుకొని, వారి వద్ద నుండి 8 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం ఈ ఇద్దరినీ రిమాండ్‌కు తరలించారు.జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర, ఐపీఎస్ మాట్లాడుతూ దొంగ సొత్తును ఎట్టి పరిస్థితుల్లోనూ కొనుగోలు చేయరాదని. ఎవరికైనా ఇలాంటి సొత్తు అందినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని. లేకపోతే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.ఈ కేసు ఛేదనలో భాగమైన సదాశివ నగర్ సిఐ బి. సంతోష్ కుమార్, సిసిఎస్ సిఐ శ్రీనివాస్, ఎస్ఐ బి. ఆంజనేయులు, సిసిఎస్ ఎస్ఐ ఉస్మాన్, సిసిఎస్ సిబ్బంది, స్థానిక పోలీసులను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

## సీఎం గారూ.. మా భూములు మాకు ఇప్పించండి

**సుల్తానాబాద్‌కు చేరిన పోడు భూముల రైతుల పాదయాత్ర**




**సుల్తానాబాద్,ఆగస్టు 09(జనంసాక్షి) :** గత 60 సంవత్సరాలుగా సాగు చేసుకుని జీవిస్తున్న మా యొక్క పోడు భూములు మాకు ఇప్పించాలని డిమాండ్ చేస్తూ ఆసిఫాబాద్ జిల్లా చింతన మానేపల్లి మండలం దింద గ్రామ్ గ్రామానికి చెందిన దాదాపు 40 మంది రైతులు పాదయాత్రగా బయలుదేరి సుల్తానాబాద్ కు చేరుకున్నారు. ఈ సందర్భంగా అక్కల రమేష్ మనోహర్లు మాట్లాడుతూ ఆరే బిసి కులానికి చెందిన దాదాపు 40 కుటుంబాలకు చెందిన పోడు భూములు ఫారెస్ట్ అధికారులు దౌర్జన్యంగా లాక్కుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 60 సంవత్సరాలుగా ఇట్టి భూమిని సాగు చేసుకుని వారు జీవిస్తున్నారని రెక్కాడితే గాని డొక్కాడని బతుకులు వారివని ఇప్పటికైనా రాష్ట్ర ముఖ్యమంత్రి స్పందించి వారి భూములు వారికే అప్పగించాలని డిమాండ్ చేశారు. దాదాపు 450 కిలోమీటర్లు పాదయాత్రగా హైదరాబాద్ కు చేరుకొని సీఎం రేవంత్ రెడ్డికి సమస్యను వివరిస్తామని ఏ గ్రామానికి లేని విధంగా ఫారెస్ట్ భూములను ఈ ఒక్క గ్రామానికి చెందిన రైతుల భూములను ఫారెస్ట్ అధికారులు స్వాధీనం చేసుకుంటున్నారో, అర్థం కాని పరిస్థితి ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ అస్పత్రులపై నమ్మకం పెంచండి





**నిజామాబాద్ జిల్లా బ్యూరో ఆగస్టు 09 (జనం సాక్షి) :**
నిజామాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందిస్తూ, ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల నమ్మకాన్ని పెంపొందించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి సూచించారు. శనివారం ఆయన డిచ్పల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. రిసెప్షన్ సెంటర్, ఇన్ పేషంట్, ఫిమేల్, జనరల్ వార్డులు, ల్యాబ్ తదితర విభాగాల పనితీరు పరిశీలించారు. ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్యులు, సిబ్బంది గురించి ఆరా తీసిన కలెక్టర్ అటెండెన్స్ రిజిస్టర్ తనిఖీ చేశారు. ప్రతి రోజు ఎంత మంది పేషంట్లు వస్తున్నారు, స్థానికంగానే కాన్పులు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. సాధ్యమైనంత వరకు సాధారణ ప్రసవాలు జరిగేలా కృషి చేయాలని వైద్యులకు సూచించారు. అన్ని రకాల మందులు అందుబాటులో ఉండేలా చూసుకోవాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల పట్ల ప్రజల్లో నమ్మకాన్ని పెంపొందించేలా అంకిత భావంతో పని చేయాలని హితవు పలికారు. రౌండ్ ది క్లాక్ ఆసుపత్రులలో అన్ని సమయాలలో వైద్యులు, సిబ్బంది విధుల్లో ఉండాలని ఆదేశించారు. ప్రతీ నెల రెండవ శనివారం ప్రత్యేకంగా నిర్వహించే ఆరోగ్యశ్రీ శిబిరానికి అన్ని విభాగాల స్పెషలిస్టు డాక్టర్లు హాజరయ్యేలా చూడాలని, పీ హెచ్ సీ లు, సీ హెచ్ సీల పనితీరును ప్రతి రోజు పర్యవేక్షణ చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీని ఆదేశించారు. అనంతరం కలెక్టర్ డిచ్పల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూభారతి దరఖాస్తుల పరిష్కారానికి చేపడుతున్న చర్యల గురించి తహసీల్దార్ సతీష్ రెడ్డిని ఆరా తీశారు. త్వరితగతిన అర్జీలు పరిష్కరించాలని సూచించారు.

# స్వతంత్ర వీరుల త్యాగాలను.. దేశ ప్రజలు ఎన్నటికీ మరువలేరు

- జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో క్విట్ ఇండియా దినోత్సవం
- పార్టీ పతాకాన్ని ఎగురవేసిన డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి



**కరీంనగర్ జిల్లా బ్యూరో, ఆగస్టు 09 (జనంసాక్షి) :**
క్విట్ ఇండియా దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రోజు కరీంనగర్ డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి డిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రహ్మత్ హుస్సేన్ లతో పాటు పలువురు నేతలు హాజరుకాగా, వర్కింగ్ ప్రెసిడెంట్ కోమటిరెడ్డి పద్మక్క రెడ్డి పార్టీ పతాకాన్ని ఆవిష్కరించినారు. ఈ సందర్భంగా కోమటిరెడ్డి పద్మాకర్ రెడ్డి, రహమత్ హుస్సేన్ మాట్లాడుతూ... రాక్షస పాలన చేస్తున్న బ్రిటిష్ సామ్రాజ్యాన్ని దేశం నుండి తరిమికొట్టాలని భారత దేశంలో స్వాతంత్రం తీసుకురావాలనే ఉద్దేశంతో మహాత్మా గాంధీ 1942 లో క్విట్ ఇండియా ఉద్యమాన్ని చేపట్టడం జరిగింది, దాని కొనసాగింపుగా ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, సత్యాగ్రహాలు, ధర్నాలు, నిరాహార దీక్షలు చేపట్టి 1947 ఆగస్టు 15న మహాత్మా గాంధీ నేతృత్వంలో దేశానికి స్వాతం త్రం రావడం జరిగిందని, ఈ దేశ స్వాతంత్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన అల్లూరి సీతారామరాజు, భగత్ సింగ్, లాల్ బహుదూర్ శాస్త్రి, బాలగంగాధర్ తిలక్ ఇలాంటి ఎంతోమంది మహనీయులను ఈ దేశం యావత్తు స్మరించుకోవడం జరుగుతుందని, కానీ నేడు దేశంలో పరిపాలిస్తున్న బిజెపి కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాల వల్ల క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో మరోసారి ప్రజలు ఉద్యమానికి నాంది పలకవలసిన సమయం ఆసన్నమైనదని రాజ్యాంగ వ్యవస్థ పై, ప్రజాస్వామ్య వ్యవస్థ పై బిజెపి ఉక్కు పాదం మోపడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, బిజెపి అరాచక పాలన బ్రిటిష్ ప్రభుత్వాన్ని తలపిస్తున్నదని అందుకే ప్రజలంతా ఏకమై బిజెపిని ఈ దేశం నుండి తరిమికొట్టాలని భారత దేశాన్ని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యద ర్శి రహమత్ హుస్సేన్, పత్తి మధుసూదన్ రెడ్డి, వెన్న రాజా మల్లయ్య, లింగంపల్లి బాబు, బొబ్బిలి విక్టర్, వంగల విద్యాసాగర్, హైమద్, మాదాసు శ్రీనివాస్, చింతల కిషన్, కుంభాల రాజ్ కుమార్, గంగుల దిలీప్, సిరికొండ శివప్రసాద్, రాచర్ల పద్మ, మల్కాపురం అనిల్ కుమార్, నాత శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# ఆకాశ్ దీప్‌ను నిషేధించాలి

## బెన్ డకెట్ కోచ్ డిమాండ్



భారత్-ఇంగ్లండ్ మధ్య ఇటీవల ముగిసిన టెస్ట్ సిరీస్ 2-2తో డ్రాగా ముగిసి నప్పటికీ, చివరి మ్యాచ్‌లో జరిగిన వివాదం ఇప్పటికీ చర్చనీయాంశంగా మారింది. కెన్నింగ్టన్ ఓవల్‌లో జరిగిన ఐదో టెస్ట్‌లో భారత ఫాస్ట్ బౌలర్ ఆకాశ్ దీప్, ఇంగ్లండ్ ఓపెనర్ బెన్ డకెట్‌ను తొలి ఇన్నింగ్స్‌లో అవుట్ చేశాడు. అనంతరం పెవిలియన్‌కు వెళ్తున్న డకెట్ భుజంపై చేయి వేసి నవ్వుతూ ఏదో మాట్లాడాడు. ఇద్దరూ స్నేహపూర్వకంగా కనిపించినప్పటికీ, ఈ చర్యపై వివాదం మొదలైంది. సిరీస్ అంతటా డకెట్‌ను ఆకాశ్ దీప్ పలుమార్లు అవుట్ చేయడంతో టెన్షన్ పెరిగింది. ఆ సమయంలో భారత వికెట్ కీపర్ కేఎల్ రాహుల్ ఆకాశ్‌ను దూరంగా తీసుకెళ్లాడు. సిరీస్ ముగిసినా ఈ ఘటనపై చర్చలు కొనసాగుతున్నాయి. పలువురు క్రికెట్ పండితులు ఆకాశ్ దీప్ చర్యను తప్పుబట్టారు. అవుట్ అయిన బ్యాట్స్‌మన్ కోపంగా ఉంటాడని, అలాంటి సమయంలో ఇలాంటి చర్యలు చేయకూడదని అభిప్రాయపడుతున్నారు. ఐసీసీ ఇప్పటివరకు ఆకాశ్‌పై ఎలాంటి చర్యలు తీసుకోలేదు. తాజాగా డకెట్ వ్యక్తిగత కోచ్ జేమ్స్ నాట్, టైమ్స్ ఆఫ్ ఇండియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆకాశ్ దీప్‌ను కొన్ని మ్యాచ్‌ల నుంచి నిషేధించాలని ఐసీసీని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు భవిష్యత్తులో పునరావృతం కాకుండా, యువ ఆటగాళ్లు చెడు ప్రేరణ పొందకుండా ఉండాలంటూ ఆయన పేర్కొన్నారు. సిరీస్‌లో డకెట్ అద్భుత ప్రదర్శన చేశాడు. 51.33 సగటుతో 462 పరుగులు సాధించాడు. స్ట్రైక్ రేట్ 82.94గా ఉంది. డకెట్ చాలా ప్రశాంతమైన, పోటీతత్వం ఉన్న బ్యాట్స్‌మన్ అని నాట్ ప్రశంసించారు. ఈ వివాదం క్రికెట్ ప్రపంచంలో మరిన్ని చర్చలకు దారితీస్తోంది.



# జింబాబ్వేను చిత్తు చేసిన న్యూజిలాండ్


సుదీర్ఘ ఫార్మాట్‌లో న్యూజిలాండ్ భారీ విజయాన్ని సాధించింది. రెండో టెస్టులో ఆల్‌రౌండ్ ప్రదర్శనతో ఆతిథ్య జింబాబ్వేను ఇన్నింగ్స్, 369 పరుగుల తేడాతో ఓడించి, సిరీస్‌ను వైట్‌వాష్ చేసింది. బ్యాటర్ల వైఫల్యంతో జింబా బ్వే తొలి ఇన్నింగ్స్‌లో 125 పరుగులకే కుప్ప కూలగా, రెండో ఇన్నింగ్స్‌లోనూ అంతకంటే తక్కువ స్కోరుకే పరిమితమైంది. న్యూజిలాండ్ బ్యాటర్లు రచిన్ రవీంద్ర (165), డెవాన్ కాన్వే (153), హెన్రీ నికోల్స్ (150) శతకాలతో విరుచుకుపడ్డారు. విల్ యంగ్ (74) అర్ధ శతకంతో రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌ను 601/3 వద్ద డిక్లేర్ చేశారు. బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ తొలి ఇన్నింగ్స్‌లో 5/40తో విజృంభించ గా, రెండో ఇన్నింగ్స్‌లో 2/16తో ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్ (0), బ్రెండన్ టేలర్ (7)లను పెవిలియన్ చేర్చాడు. యువ స్పిన్నర్ జకరీ ఫౌల్క్స్ (5/37) మిడిలార్డర్‌ను కుదేలు చేయడంతో జింబాబ్వే మొత్తం 107 పరుగులకే ఆలౌట్ అయింది. నిక్ వెల్చ్ (47 నాటౌట్) మాత్రమే కాసేపు పోరాడాడు. క్వీన్స్ స్పోర్ట్స్ క్లబ్‌లో జరిగిన ఈ మ్యాచ్‌తో ప్రపంచ టెస్టు ఛాంపియన్‌షిప్ 2025-27లో న్యూజిలాండ్ జోరు కొనసాగుతోంది. శాంట్నర్ నాయకత్వం లోని కివీస్ జట్టు తిరుగులేని ఆటతీరుతో జింబాబ్వేకు టెస్టు చరిత్రలో ఘోర పరాజయాన్ని మిగిల్చింది.

## ఐపీఎల్ గడప తొక్కాలని ఏపీఎల్ ప్లేయర్లు తహతహ

తెలుగు గడ్డపై టీ20 ఫీవర్ ప్రారంభమైంది. ప్రతిష్టాత్మక ఆంధ్ర ప్రీమియర్ లీగ్ నాలుగో ఎడిషన్ శుక్రవారం నుంచి ప్రారంభమైంది. అయితే ఈ సీజన్ పై క్రికెట్ ప్రేమికులే కాకుండా ఐపీఎల్ జట్ల స్కౌట్ల బాధ్యులు కూడా దృష్టి సారించారు. గత మూడు ఎడిషన్ల నుంచి బాగా ఆడిన కొంతమంది క్రికెటర్లు ఇప్పటికే ఐపీఎల్ కు ఎంపికయ్యారు. గతేడాది వేలంలో సత్యనారాయణ రాజును ముంబై ఇండియన్స్ కొనుగోలు చేయగా, పైలా అవినాశ్ ను పంజాబ్ కింగ్స్ దక్కించుకుంది. దీంతో ఈసారి సీజన్ లోనూ సత్తా చాటి, ఐపీఎల్ గడప తొక్కాలని ఏపీఎల్ ప్లేయర్లు తహతహ లాడుతున్నారు. ఈసారి ఐపీఎల్ స్కౌట్ల బృందాలు గమనించే వారిలో కింది ముగ్గురు పేసర్లు ఉంటారు అనడంలో ఎలాంటి సందేహం లేదు. సత్తా చాటితే ఐపీఎల్ బెర్త్ దక్కించుకునే అవకాశముంది. భీమవరం బుల్స్ కు ప్రాతినిథ్యం వహించే హరి శంకర్ రెడ్డిపై చాలా ఎక్కువ ఫోకస్ ఉంది. రైట్ ఆర్మ్ పేసరైన ఈ ప్లేయర్ గత మూడు సీజన్ల నుంచి నిలకడగా రాణిస్తున్నాడు. ఇప్పటివరకు 17 గేమ్‌లు ఆడిన ఈ ప్లేయర్.. 25 వికెట్లను తన ఖాతాలో వేసుకున్నాడు. అతని బౌలింగ్ స్ట్రైక్ రేట్ కేవలం 14.9 కావడం విశేషం. ఆరంభంలోనే వికెట్లు తీయగల సామర్థ్యం హరి సొంతం. యార్కర్లు, లెగ్ కట్టర్లు, బ్యాక్ ఆఫ్ హేండ్ బంతులతో బ్యాటర్లను ఇబ్బంది పెట్టగలడు. గతంలో 2021లో సీఎస్కే బృందంలో తను ఉన్నా, అంతగా అవకాశం రాలేదు. అయితే ఈసారి సత్తా చాటి మరోసారి ఐపీఎల్ గడప తొక్కాలని భావిస్తున్నాడు. సింహాద్రి వైజాగ్ లయన్స్ జట్టు తరపున ప్రాతినిథ్యం వహించే యెద్దల రెడ్డి ఆకట్టుకుంటున్నాడు.

# వర్షపు నీటిని భూమిలో ఇంకిద్దాం

## భూగర్భజలాలను పెంపొందిద్దాం!






*మహా హైదరాబాద్‌లో 'వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చేద్దాం... భూగర్భజలాలను పెంపొందిద్దాం' అనే నినాదంతో 'ఇంకుడు గుంతల జలయజ్ఞం-2025'కు జలమండలి సిద్ధమైంది. ఇప్పటికే అమలు చేస్తున్న 90 రోజుల ఇంటింటా ఇంకుడు గుంత' కార్యక్రమంలో భాగంగా 50 రోజుల ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది.*

- ఇక ప్రజా స్థలాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలకు చర్యలు
- వర్షపు నీటి సంరక్షణతోనే నీటి ఎద్దడి సమస్యకు పరిష్కారం
- జీఐఎస్ అనుసంధానంతో డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షణ
- వచ్చే వారంలో ప్రారంభం కానున్న 50 రోజుల ప్రత్యేక కార్యాచరణ
- జలమండలి ఇంకుడు గుంతల జలయజ్ఞం -2025

**హైదరాబాద్, (జనంసాక్షి) :**
నగరంలో సాధారణం కన్నా అధికంగా వర్షపాతం నమోదవుతున్నా... పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా విస్తరిస్తున్న నివాస, వాణిజ్య సముదాయలతోపాటు ఖాళీ స్థలాలు, బహిరంగ ప్రదేశా లన్నింటిని కాంక్రీట్‌తో కప్పేస్తుండటంతో వర్షపు నీరు భూమిలోకి ఇంకే పరిస్థితి లేక భూగర్భ జలాలు అడిగంటిపోతున్నాయి. ఫలితంగా తాగు నీటి కంటే నిత్యావసరాల నీటికోసం ట్యాంకర్ల డిమాండ్ పెరుగుతోంది. నగర తాగు నీటి అవసరాల కోసం జలాలను సుదూర ప్రాంతాల జలాశ యాల నుంచి తరలించి శుద్ధి చేసి సరఫరా చేస్తుందుకు కోట్లాది రూపాయలు ఖర్చు అవుతుండ గా... నగరంలో కురుస్తున్న వర్షపు మిలియన్ కొద్ది చుక్కలు వరద ప్రవాహంగా మారి మురుగు నాలల్లో వృధాగ కలిసి పోతుండడాన్ని జలమండలి త్రీవంగా పరిగణించింది. భూగర్భజలాలను పెంచితే సీజన్‌తో సంబంధం లేకుండా నిత్యావసరాల కోసం సరఫరా చేసే ట్యాంకర్ తాకిడి తగ్గుతుందని జలమండలి భావిస్తోంది. నీటి సంరక్షణలో భాగంగా వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమి లోకి ఇంకేలా చేసేందుకు భూగర్భజలాల పెంపు లక్ష్యంగా వచ్చే వారం నుంచి సెప్టెంబర్ 30 వరకు నాలుగు రకాల 'గ్రౌండ్‌వాటర్ రిచార్జ్' ప్రణాళిక అమలుకు సిద్ధమైంది. ఇప్పటికే జలమండలి ఎండీ ఆశోక్ రెడ్డి జూమ్ మీటింగ్ ద్వారా డివిజన్ జీఎం నుంచి మేనేజర్ల వరకు జారీ క్షేత్ర స్థాయిలో రంగంలోకి దిగేవిధంగా ఆదేశాలు జారీ చేవారు. రోజువారిగా ఇంకుడు గుంతల పురోగతిని జీఓఎస్ ట్యాంగింగ్ ద్వారా మొబైల్ యాప్‌లో అప్‌లోడ్ చేసే విధంగా చర్యలకు ఉపక్రమించారు.


### ప్రతి ఇంట్లో ఇంకుడు గుంత:

వర్షపు నీటి సంరక్షణలో భాగంగా 300 చదరపు మీటర్ల గల ప్రతి ఇంటా భూగర్భ జలాలను రీస్టోర్ చేసుకునే దిశగా ప్రాంగణంలో ఇంకుడుగుంత తప్పని సరి చేస్తూ జలమండలి చర్యలు చేపట్టింది. పాత, కొత్త నివాస, వాణిజ్య సముదాయాలపై దృష్టి సారించింది. నల్లా కనెక్షన్ క్యాన్ నెంబర్ ఆధారంగా సీజన్‌తో సంబంధం లేకుండా ప్రతి నెలా 20 కంటే ఎక్కువ ట్యాంకర్లను బుక్ చేసుకునే ప్రాంగణాలను గుర్తించింది. ఇప్పటికే సుమారు 42,784 క్యాన్ నెంబర్లను గుర్తించి 40,209 నివాససముదాయలపై సర్వే నిర్వహించగా, కేవలం 22,825 నివాసాల్లో నే ఇంకుడు గంతలు ఉన్నట్లు,17,384 నివాసాల్లో ఇంకుడు గుంతలు లేనట్లు బహిర్గతమైంది. దీంతో ఇప్పటి వరకు16,196 గృహాలకు నోటీసులు చేసి ఇంకుండు గుంత తప్పనిసరిగా ఏర్పాటు చేసుకునేవిధంగా చర్యలు చేపట్టింది. ప్రాంగణంలో కాలానుగుణంగా ఒకే ఒక బోర్ బావి పని చేస్తుంటే ఇంజెక్షన్ బావి కోసం 60 మీటర్లు లేదా 200 లోతు వరకు భూమి మట్టానికి దిగువన డ్రిల్లింగ్‌కి కొత్త బోర్ బావి ఏర్పాటు చేసుకునే విధంగా సిఫార్సు చేయాలని నిర్ణయించింది.

### ప్రజా స్థలాల్లో ఇంకుడుగుంత:

భూగర్భజలాల పెంపు కోసం ప్రజా స్థలాలో ఇంకుడు ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రజా స్థలాలు, కాలనీలు, ప్రభుత్వ సముదాయాలు, విద్యా సంస్థలు,రోడ్డు పక్కన గల నివాస, వాణిజ్యసముదాయల రూఫ్ టాప్ నుండి కిందికి పడే వర్షపు నీటిని పైపుల ద్వారా సంరక్షణ కోసం ప్రజా ఇంకుడు గుంతల ఏర్పాటుకు సిద్ధమైంది. ఇప్పటికే జలమండలి బృందాలు ఎన్జీవోల సహకారంతో సర్వే ద్వారా ఎక్కడెక్కడ ఏర్పాటు చేయా లని ప్రాంతాలు గురిస్తోంది. ఇందు కోసం డివిజన్‌కు నిర్దేశిం చిన సంఖ్యను నిర్ధారించి మొత్తం సుమారు 16 వేల వరకు ప్రజా ఇంకుడు గుంతలా ఏర్పాటు చేయాలని లక్ష్యాన్ని పెట్టుకుంది.

### డ్యాష్‌బోర్డు ద్వారా పర్యవేక్షణ:



ప్రజా బహిరంగ స్థలాల్లో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల ను జీఐఎస్ మ్యాపింగ్‌తో డ్యాష్ బోర్డు ద్వారా పర్యవేక్షించాలని నిర్ణయించింది. ఇప్పటికే గుర్తించిన 'ప్రజా ఇంకుడు గుంత'ల ప్రాంతాలను జీయో ట్యాగ్ చేస్తారు. నిర్మాణం ముందు, నిర్మాణం తరువాత తీసిన ఫోటోలను అప్లోడ్ చేసే వీలుగా ఐటీ విభాగం ప్రత్యేక మొబైల్ యాప్ రూపకల్పన చేస్తోంది. ప్రజా ఇంకుడుగుంతల నిర్మాణం పురోగతిని తెలుసుకునే విధంగా మొబైల్ యాప్ అనుసంధానంతో ప్రత్యేకమైన డ్యాష్ బోర్డు ఏర్పాటు చేసి పర్యవేక్షించనుంది

### కమ్యూనిటీ ఇంకుడు గుంత:

**అవుటర్ రింగ్ రోడ్ పరిధిలోని గెటెడ్ కమ్యూనిటీలు, బహు అంతస్తుల భవన సముదాయా ల్లో 'కమ్యూనిటీ ఇంకుడు గంత' ఏర్పాటు చేసుకునే విధంగా ప్రత్యేక అవగాహన కార్యా క్రమాలు ఏర్పాటు చేయనుంది. ఓఆర్ఆర్ లోపల, అవతల గెటెడ్ కమ్యూనిటీలు, బహుళ అపార్ట్ మెంట్లను గుర్తించారు. అయా నివాస సముదాయలకు ఇంకుడు గుంతల ప్రాధాన్యం, వాటి నిర్మాణ ఆవశ్యకతలపై అవగాహన కల్పిస్తారు.**



### హార్వెస్టింగ్ పిట్స్‌గా హ్యాండ్ పంప్స్ :

**నిరుపయోగంలో ఉన్న బోరు బావులను హార్వెస్టింగ్ పిట్‌లతో ఇంజక్షన్ బోర్‌వెల్‌గా మార్చాలని నిర్ణయించింది. ఇప్పటికే సుమారు 3,222 బోర్ వెల్స్‌లను జలమండలి గుర్తించింది. అందులో పవర్ బోర్‌వెల్స్ 1,045 ఉండగా, వాటిలో కోర్ సిటీ పరిధిలో 246, శివారు పరిధిలో 7,99 బోర్లు ఉన్నట్లు గుర్తించింది. హ్యాండ్ బోర్‌వెల్స్ 2,177 ఉండగా వాటిలో కోర్‌సిటీలో 1,665, శివార్లలో 1,557 బోర్లు ఉన్నాయి. మరిన్ని గుర్తింపు కోసం చర్యలు చేపట్టింది.**

### ఇంకుడు గుంతల జలయజ్ఞంలో భాగస్వామ్యం అవసరం :

**అశోక్ రెడ్డి, మేనేజింగ్ డైరెక్టర్, జలమండలి**



భూగర్భజలాల పెంపు కోసం ఇంకుడు గుంతల జలయజ్ఞం-2025లో ప్రతి నివాస సముదాయలు తమ కర్తవ్యంగా భావించి భాగస్వామ్యం అవసరం. నగరంలో నెలను కాంక్రీట్ కప్పేస్తుండటంతో వర్షపు నీరు భూమిలో ఇంకే పరిస్థితి కనిపించడం లేదు. భూగర్భజలాలు దిగవకు పడిపోయి పైకి చుక్క నీరు రావడం లేదు. వర్షపు నీటి సంరక్షణతోనే భూగర్భజలాలు పెంచవచ్చు. వృధాగా పోతున్న వర్షపు నీటిని ఒడిసి పట్టి భూమిలోకి ఇంకేలా చెయ్యాలి. ప్రతి ఇంటింటా ఇంకుడు గుంతలు తప్పని సరి.దీంతో భూగర్భజలాలు పెరుగుతాయి. నిత్యావసర నీటి ఎద్దడి సమస్య తగ్గుతుంది.



# కిక్కిరిసిన ఆర్టీసీ బస్టాండ్లు

- ప్రయాణికులపై ఆర్టీసీ చార్జీల మోత
- హైదరాబాద్‌కు అదనంగా 41-50% టికెట్ల ఛార్జీలు పెంచిన ఆర్టీసీ
- మూడు రోజులపాటు ఇలాగేనే కొనసాగుతాయని తెలిపిన ఆర్టీసీ అధికారులు
- బస్సుల కోసం ప్రయాణికుల పడిగాపులు


Shadnagar Depot
21162A12651 09/08/25 10:32
Service Number: EX08
EXPRESS 1.5
HYD_SUNK Trip No: 4
MGBS TO
SHADNAGAR BS
ADT 1 x 110.00=₹ 110.00
Total ₹ 110.00
Payment Mode: Cash
CND: 152200 DRV: 152526
Waybill: 19495489Bus: TS29Z0022
ETIM No: I022300030
NOT TRANSFERABLE
HAPPY JOURNEY
HELP LINE NO
040 69440000

**రంగారెడ్డిజిల్లా ప్రతినిధి (జనంసాక్షి) :** అదును చూసి దెబ్బ వేయడం అంటే ఇదే... ఓవైపు మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్న ప్రభు త్వం అదే రీతిలో పురుష ప్రయాణికులపై అదనపు భారాన్ని మోపుతూ ఖజానాను నింపుకునేందుకు చర్యలు చేపట్టింది పండుగలు వచ్చాయంటే జేబులకు తూట్లు పడే విధంగా ఆర్టీసీ చార్జీల మోతను మోగిస్తున్నారు ప్రయాణికులు ఊహించని రీతిలో ఏకంగా 41-50% మేరా చార్జీలను పెంచి అదనపు భారాన్ని మోపుతున్నారు. రాఖీ పౌర్ణమి సందర్భంగా ప్రయాణికుల తాకిడి అధికంగా ఉంటుందని భావించిన తెలంగాణ ఆర్టీసీ చార్జీల పెంపుకు తెరలేపింది. షాద్ నగర్, హైదరాబాద్ ల మధ్య ఏకంగా 30 రూపాయలు పెంచారు సాధారణ రోజుల్లో 80 రూపాయలు ఉండగా పండుగ సందర్భంగా ఏకంగా 30 రూపాయలు పెంచడాన్నీ ప్రయాణికులు తీవ్రంగా తప్పుపడుతున్నారు. ఓవైపు ఉచిత ప్రయాణం అంటూనే మరోవైపు చార్జీలను ఇష్టానుసారంగా పెంచడం దేనికి నిదర్శనమని ప్రశ్నిస్తున్నారు రంగారెడ్డి జిల్లాలోని రాజేంద్రనగర్ శంషాబాద్ షాద్ నగర్ ఎల్బీనగర్ చేవెళ్ల మహేశ్వరం శేర్లింగంపల్ల లాంటి ఆర్టీసీ బస్టాండ్లలో జనాలు కిక్కిరిసి పోయారు ఇదిలా ఉంటే రాఖీపౌర్ణమి సందర్భంగా నగర పట్టణ గ్రామీణ ప్రాంతాల నుంచి ఆడపడుచులు తమ రాకపోకలు కొనసాగించడంతో బస్టాండ్ల ఆవరణ ప్రయాణికులతో కిక్కిరిసిపోయాయి బస్సుల కొరతతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు ప్రయాణికులు బస్సుల రాక కోసం గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి నెలకొంది ఇది ఇలా ఉంటే ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా శాఖపరమైన చర్యలు తీసుకుంటున్నామని ఆర్టీసీ అధికారులు తెలిపారు ప్రయాణికుల తాకిడికి తగ్గట్టు బస్సులు కొనసాగుతున్న జనాల రద్దీ ఎక్కువగా ఉంటుందని కొన్ని డిపోలలో ఇప్పటికే ఉన్న బస్సుల కన్నా అదనంగా బస్సులను నడుపుతున్నామని అయినా కూడా ప్రయాణికుల తాకిడి ఎక్కువగా ఉందని తెలిపారు ఆర్టీసీ అధికారులు...

### ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద భారీగా ట్రాఫిక్ జామ్ పండగ ఎఫెక్ట్

**ఉప్పల్ :** ఉప్పల్ రింగ్ రోడ్డు వద్ద రాఖీ పండుగ సందర్భంగా సొంతూళ్లకు వెళ్తున్న వారి సంఖ్య పెరగడంతో హైదరాబాద్-వరంగల్ రహదారిపై తీవ్ర ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.బోడుప్పల్, మేడిపల్లి వరకు ట్రాఫిక్ ఏర్పడింది. దీని వల్ల ఈ ప్రాంతాల్లో వాహనాలు నెమ్మదిగా కదిలాయి .ఉప్పల్ రింగ్ రోడ్ వద్ద సుమారు 30 నిమిషాలు పట్టింది వాహనాలు ముందు కదలడానికి. పండగ రద్దీతో ట్రాఫిక్ స్తంభించింది. దీనివల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి.

# సిరాజే భారత్ బెస్ట్ బౌలర్.. బుమ్రా కాదు

## వసీం అక్రమ్ సంచలన వ్యాఖ్యలు!




భారత జట్టులో అత్యుత్తమ పేసర్ ఎవరు అంటే ఇప్పటివరకు జస్ప్రీత్ బుమ్రా అనే సమాధానమే వచ్చేది. కానీ, ఇకపై అది మారబోతోంది. మహ్మద్ సిరాజ్ ఇప్పుడు టీమిండియా బౌలింగ్ దళానికి నాయకుడిగా మారాడు. ఇంగ్లండ్ పర్యటనలో అతడి అసాధారణ ప్రదర్శనతో ప్రపంచవ్యాప్తంగా ప్రశంసలు అందుకుం టున్నాడు. బుమ్రా వర్క్‌లోడ్ కారణంగా మూడు మ్యాచ్‌లకే పరిమిత మవ్వగా, సిరాజ్ ఐదు టెస్టులు ఆడి 23 వికెట్లు పడగొట్టాడు. ఓవల్ టెస్టులో అతడి ఆక్రమణాత్మక బౌలింగ్‌తో సిరీస్ 2-2తో డ్రాగా ముగిసింది. పాకిస్థాన్ లెజెండ్ వసీం అక్రమ్ సైతం సిరాజ్‌ను ముక్తకంఠంతో ప్రశంసించాడు. ఓవల్ టెస్టు ఐదో రోజు రెప్పవాల్చకుండా చూశానని, సిరాజ్ ఆకలితో ఉన్న సింహంలా బౌలింగ్ చేశాడని అక్రమ్ వెల్లడించాడు. ఐదు మ్యాచ్‌ల్లో 186 ఓవర్లు వేసినా అతడి ఉత్సాహం తగ్గలేదని, ఇకపై సిరాజ్ సపోర్ట్ బౌలర్ కాదు.. పేస్ దళాన్ని ముందుండి నడిపించే లీడర్ అని పేర్కొన్నాడు. నాలుగో రోజు హ్యారీ బ్రూక్ క్యాచ్ మిస్ అయినా సిరాజ్ నమ్మకాన్ని కోల్పోలేదని, అది యోధుడి లక్షణమని అక్రమ్ అన్నాడు. ఈ సిరీస్ తర్వాత టెస్టు క్రికెట్‌కు ఢోకా లేదనిపించిందని చెప్పాడు. మాజీ పేసర్లు, దిగ్గజాలు సిరాజ్‌ను భారత్ బెస్ట్ బౌలర్‌గా కొనియాడు తున్నారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్, హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్‌లకు సిరాజ్ ఉన్నాడనే నమ్మకాన్ని కలిగించాడు. భవిష్యత్ సిరీస్‌లలో బుమ్రా లేకున్నా సిరాజ్ బౌలింగ్ బాధ్యతలు నిర్వహిస్తాడని అందరూ అంటున్నారు. నాలుగో రోజు హ్యారీ బ్రూక్ క్యాచ్ వదిలేసినా సరే మియా భాయ్ నమ్మకాన్ని కోల్పోలేదు. ఒక యోధుడి లక్షణమది. నాకు ఓవల్ టెస్టు చూశాక టెస్టు క్రికెట్‌కు ఇప్పట్లో ఢోకా లేదనిపించింది' అని పాక్ లెజెండ్ వెల్లడించాడు. అండర్సన్ - టెండూల్కర్ ట్రోఫీలో నిప్పులు చెరిగిన సిరాజ్ 23 వికెట్లతో సత్తా చాటాడు. ఓవల్ టెస్టులో అసాధారణ ప్రదర్శనతో జట్టు సిరీస్ సమం చేయడంలో కీలక పాత్ర పోషించాడు.

# ఆదివాసీల హక్కుల కోసం పోరాడాలి

- పోడు భూములకు పట్టాలి ఇవ్వాలి
- లంబాడీలను ఎస్టీ జాబితా నుండి తొలగించాలి
- అటెండర్ నుండి ఐఏఎస్ వరకు ఆదివాసీలకే ప్రాధాన్యత ఇవ్వాలి
- ఆదివాసీ నాయకపోడ్ జిల్లా ఉపాధ్యక్షులు బంక శ్రీనివాస్



**ఇబ్రహీంపట్నం, ఆగస్టు 9, (జనం సాక్షి) :**
నేడు ఆదివాసులు నాగరిక సమాజంలో ఇమడలేక తమ మనుగడ కోసం అస్థిత్వం కోసం అల్లాడిపోతూన్నారు.వీరికి వెనుకబాటు తనానికి ఇతరత్రా గిరిజన జాతులను ప్రభుత్వం షెడ్యూల్ ట్రైబ్స్( ఎస్టి) జాబితాను చేర్చడంతో నిజమైన ఆదివాసులకు అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆదివాసులు అడవి తల్లి ముద్దుబిడ్డలు. పచ్చని చెట్లలో జీవిస్తూ, వన్యప్రాణులతో చెలిమి చేస్తూ, అడవుల్లో జీవిస్తారు. కానీ నేటి ఆధునిక పోటీ ప్రపంచంలో, సమాజంలో ఇమడలేక పోతున్నారు. ప్రపంచ ఆదివాసీల దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నాడు మండలంలోని ఎర్దండి గ్రామంలో కొమురం భీమ్ విగ్రహం వద్ద ఆదివాసీల దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా ఆదివాసీల జిల్లా ఉపాధ్యక్షులు బంక శ్రీనివాస్ పాల్గొని, కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి ఈ సందర్భంగా ఆదివాసుల గురించి మాట్లాడుతూ ఆదివాసీయులు వెనుకబడిన తెగకు చెందిన వారిని, ఏజెన్సీలో ఆదివాసీలను దోపిడీ చేస్తూ ఆదివాసీలపై పెత్తనం చెలాయిస్తున్న గిరిజనేతరులు నేడు ఆదివాసీల రిజర్వేషన్స్ కబ్జా చేయాలని కుట్రలు పన్నుతున్నారని, లంబాడీలను తమ జాబితాను చేర్చడం వల్ల ఆదివాసీలకు పెద్ద ఎత్తున నష్టం కలుగుతుందని, ఉద్యోగ నియామకాల్లో తమకు అన్యాయం జరుగుతుందని అన్నారు.ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొల గించాలని, ఐటిడిఎలో అటెండరు నుండి ఐఎయస్ వరకు ఆదివాసీలనే నియ మించాలని, ఏజెన్సీలో ఆదివాసీలు సాగు చేస్తున్న పోడుభూములకు పట్టాలు ఇవ్వాలని, అలాగే ఏజెన్సీలో గిరిజనేతరుల పట్టాలు రద్దు చేయాలని డిమాండు చేశారు. ఆదివాసుల సంక్షేమం కొరకు వివిధ పథకాలు ప్రవేశా ఎట్టాలని, సామాజికంగా రాజకీయ ఎదుగుదలకు అవకాశాలు ఇవ్వాలని, సర్పంచ్ స్థానిక సంస్థల ఎన్నికలలో ఆదివాసిలకు ఎక్కువ సీట్లు కేటాయిం చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విడిసి అధ్యక్షులు దాసరి చిన్న రాజన్న, గుజ్జుల శ్రీనివాస్, నలిమెల శ్రీనివాస్, రమణ, సంఘం అధ్యక్షులు బంక శ్రీకాంత్, సంఘ సభ్యులు సీమల శ్రీనివాస్, సీమల గంగాధర్, శంకర్ పాల్గొన్నారు.

# ఆదివాసీలు మూలాలను కాపాడుకోవాలి

- మంత్రి సీతక్క





హైదరాబాద్ (జనంసాక్షి) : ఆదివాసీలు తమ మూనాలలను కాపాడుకోవాలని మంత్రి సీతక్క అన్నారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లో ఆదివాసి ఉద్యోగుల సంక్షేమ సాంస్కృతిక సంఘం, ఆదివాసి స్టూడెంట్స్ ఫోరం, ఆదివాసి మహిళా చైతన్య శక్తి ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా మంత్రి సీతక్క హాజరయ్యారు. ఆదివాసీల హక్కులు, అస్తిత్వం కోసం, ఆదివాసీలకు జరుగుతున్న మంచి చెడులను చర్చించుకునేందుకు అంతర్జాతీయ ఆదివాసి దినోత్సవం ఒక మంచి వేదిక అని, మన మూలాలు అడవి జల్ జంగల్ జమీన్ తో ఆటపాటలతో ఉన్నప్పటికీ.. ఉన్నత విద్య అభ్యసించడం కోసం అనేక కష్టాల్లోర్చి ఇంత దూరం వచ్చిన మీరు..ఈరోజు ఉస్మానియా యూనివర్సిటీలో ఇంత పెద్ద ఎత్తున మన హక్కుల దినోత్సవాన్ని జరుపుకుంటున్న అందుకు సంతోషంగా ఉందని, ఎంత ఎత్తుకు ఎదిగిన మన జాతి గొప్పతనం మూలాలు మన సంస్కృతి మన జీవన విధానాలను ఎప్పుడు మర్చిపోకుండా కాపాడుకోవాలని సూచించారు. మన మూలాలు ఉంటేనే మనకు అస్తిత్వమని, అందుకే మన మూలాలను కాపాడుకోవాలని, దేశంలో భారత రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రాజ్యాంగం లేకపోతే మనకు రాజ్యాంగ ఫలాలు అందవని తెలిపారు. దేశవ్యాప్తంగా కార్పొరేట్ కంపెనీలు అటవీ ప్రాంతాల్లో నీళ్లు నిధులు అడవులను ఆక్రమిస్తున్నాయని, దాన్ని ప్రశ్నిస్తే అనేక రూపాల్లో ఆదివాసి బిడ్డలను చంపుతున్నారని తెలిపారు. రాజ్యాంగంలో మనకు కల్పించిన హక్కులు తెలియని వాళ్ళు చాలామంది ఉన్నారని, వారికి వారి హక్కులను తెలియజేయాల్సిన బాధ్యత ఆదివాసి విద్యార్థి ఉద్యోగ సంఘాలేనని సూచించారు. తాను ఈ స్థాయిలోకి రావడానికి ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నానని, ఎన్ని సమస్యలున్నా తాను విద్యను ఆపలేదని, విద్య ద్వారానే విముక్తి సాధ్యమవుతుందని తెలిపారు. అందుకే విద్యా రంగంలో ఆదివాసీలు రాణించాలని, ఎదిగి వచ్చిన ఆదివాసి బిడ్డలు తోటి సమాజం కోసం కొంత సమయాన్ని వెచ్చించాలని సూచించారు. తనతో కలిసి నడవడానికి అప్పుడు ఇప్పుడు కూడా సిద్ధంగానే ఉంటానని, చరిత్రను తవ్వండి, పురాతన ఆనవాలను గుర్తించండి, మన చరిత్ర రికార్డ్ చేయండని, అప్పుడే మన సంస్కృతిని భవిష్యత్ తరాలకు బలంగా తెలియజేయగలమని తెలిపారు. ప్రకృతి మీద ఆధారపడి ఎదిగే జాతి మనదని, ఈ ప్రత్యేకతను మనం కాపాడుకోవాలని సూచించారు. మన జాతులు అంతరించి పోకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత మనదేనని, ఆదిమ జాతుల ఆహార అలవాట్లను కాపీ కొడుతున్నారని తెలిపారు. ఆదిమ సమాజంలో బలమైన ప్రజాస్వామీక వ్యవస్థ ఉందని, ఆదివాసి సమాజానిది సామూహిక శ్రమైక జీవన విధానమని, ఆ సామూహిక జీవన విధానాన్ని పరిరక్షించుకుందామని పిలుపునిచ్చారు.



## ఆత్మీయత.. అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్

- గవర్నర్ జిష్ణుదేవ వర్మ

హైదరాబాద్ (జనంసాక్షి) : ఆత్మీయతకు, అనుబంధానికి ప్రతీక రక్షాబంధన్ అని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. రక్తసంబంధాన్ని, మనుషుల మధ్య మమతను గుర్తు చేసే పవిత్రమైన పండుగ రాఖీ పౌర్ణమి అని అభిప్రాయపడ్డారు. సోదర భావాన్ని పెంపొందించి, కుటుంబ వాతావరణన్ని కాపాడే పండుగ అని అభివర్ణించారు. శనివారం రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాజ్ భవన్‌లో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ గారికి విశ్వహిందూ పరిషత్, మాతృశక్తి, దుర్గావాహిని నాయకులు రాఖీ కట్టారు. మంగళ హారతులు ఇచ్చి దీవెనలు అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ విశ్వహిందూ పరిషత్ మహిళా నాయకులకు శు భాశీస్సులు అందజేశారు. ధర్మకార్యంలో విజయం సాధించాలని దీవించారు. కులమతాలకు అతీతంగా సమస్త మానవాళికి సోదర తత్వాన్ని అందించే పండగ రాఖీ పౌర్ణమి అని గవర్నర్ అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రచార ప్రముఖ్ పగుడాకుల బాలస్వామి, విశ్వహిందూ పరిషత్ మహిళా విభాగం అయిన మాతృశక్తి రాష్ట్ర కన్వీనర్ పద్మశ్రీ, కోకన్వీనర్లు శ్రీవాణి, లక్ష్మీ సరోజ, వాణి దేవి, దుర్గా వాహిని రాష్ట్ర కన్వీనర్ వాణి సక్కుబాయి, రాష్ట్ర బాల సంస్కార ప్రముఖ్ శిరీష, మహంకాళి కన్వీనర్ భవానీ తదితరులు పాల్గొన్నారు.

## గోవాలో తెలుగు జంటపై దాడి

హైదరాబాద్, ఆగస్టు9 (జనంసాక్షి) : గోవాలో మరో దారుణం చోటుచేసుకుంది.. గోవా విహార యాత్రలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన ఓ జంటపై పనాజీ బస్‌స్టాండ్ వద్ద దాడి జరిగింది. బైక్ అద్దె విషయంలో జరిగిన చిన్నపాటి వివాదం ఘర్షణకు దారి తీసింది. వరుసగా సెలవులు రావడంతో.. హైదరాబాద్ కు చెందిన ఈ జంట గోవాలో గడిపేందుకు వెళ్లారు. అక్కడ ప్రయాణానికి బైక్ అద్దెకు తీసుకున్నారు. ఒప్పందం ప్రకారం.. బైక్‌ను సమయానికి తిరిగి అప్పగించినప్పటికీ.. బైక్ అద్దెకు ఇచ్చినవాళ్లు అదనంగా రూ.200 చెల్లించాలంటూ డిమాండ్ చేశారు. దీంతో ఎందుకు చెల్లించాలంటూ వారు.. బైక్ అద్దెకు ఇచ్చిన వారిని ప్రశ్నించారు. ఈ విషయంలో ఇరువురు మధ్య వాగ్వాదం తలెత్తింది.. ఈ క్రమంలో పనాజీ బస్‌స్టాండ్ సమీపంలో ఉన్న కొంతమంది బైక్ అద్దెకు ఇచ్చే వ్యక్తులు గుంపుగా వచ్చి జంటపై దాడికి పాల్పడ్డారు. దాడిలో హైదరాబాద్ వ్యక్తి తలకు గాయాలపాలయ్యారు. గర్భిణి అయిన మహిళకు ముఖం తీవ్రంగా ఉబ్బిపోయింది. గాయాలైన జంటను వెంటనే గోవా మెడికల్ కాలేజ్‌కి తరలించారు. ఘటనపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇలాంటి ఘటనలు గోవాలో పర్యాటకుల భద్రతపై ప్రశ్నలు రేపుతున్నాయి. పోలీసులు పూర్తి విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితుల కుటుంబసభ్యులు డిమాండ్ చేస్తున్నారు. గతంలో కూడా గోవాలో జరిగిన గొడవలో ఏపీకి చెందిన ఓ యువకుడు మరణించిన విషయం తెలిసిందే.. ఇలాంటి ఘటనల నేపథ్యంలో గోవాకు వెళ్లే వారు అప్రమత్తంగా ఉండటం మంచిదని పోలీసులు చెబుతున్నారు.

## దేశంలో ఊపందుకున్న ట్రంప్ వ్యతిరేక ప్రచారం

- అమెరికా ఉత్పత్తులు బ్యాన్ చేయాలన్న డిమాండ్
- ఎక్స్ వేదికగా కోకాకోలా, పిజ్జా,కెఎఫ్‌సిల బహిష్కరణ ఉద్యమం



న్యూఢిల్లీ, ఆగస్ట్9 (జనంసాక్షి) : ట్రంప్ తీరుపై ఆగ్రహంతో ఉన్న భారతీయులు ఆయనకు వ్యతిరేకంగా ఏకమవుతున్నారు. అమెరికా ఉత్పత్తులను నిషేధించాలన్న స్థాయికి ప్రచారం చేస్తున్నారు. ఇది ఒక భారత్‌లోనే కాదు...ప్రపంచ వ్యవప్తంగా వస్తోంది. ట్రంప్‌కు వ్యతిరేకంగా సొంత దేశంతో పాటు అంతటా నిరసనలు వ్యక్తం అవుతున్నాయి. ఇటీవల ట్రంప్‌కు వ్యతిరేకంగా నిర్వహించిన ఆన్‌లైన్ క్యాంపెయిన్లలో భాగస్వాములవుతున్నారు. 1500కు పైగా పోస్టులు 'ట్రంప్ ఈజ్ అన్‌ఫిట్ ఫర్ ఆఫీస్' అనే హ్యాష్‌ట్యాగ్‌తో, 'అరెస్ట్ ట్రంప్' అనే హ్యాష్‌ట్యాగ్, కీలక పదాలతో కూడిన పోస్టులు 1900 ఉన్నాయి. దాదాపు 300 మంది నెటిజన్లు వ్యక్తిగత దూషణలు, అవమానపర్చే పదాలతో 3000కు పైగా పోస్టులు చేశారు. అమెరికా అధ్యక్షుడిని టార్గెట్ చేసుకుంటూ ఇలాంటి పదాలను వినియోగించే ధోరణి ఇటీవల ప్రపంచవ్యాప్తంగా విపరీతంగా పెరిగిపోయింది. అమెరికా ఉత్పత్తులు, వ్యాపారాలను బహిష్కరించాలంటూ భారత్ నుంచి విస్తృతస్థాయిలో పిలుపులు రావటం బహుశా ఇదే మొదటిసారి అని విశ్లేషకులు చెప్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ వ్యవహారశైలిపై భారతీయుల్లో వ్యతిరేకత పెరిగిపోతున్నది. భారత్‌తో పాటు- ఇతర దేశాలపై ఎడాపెడా సుంకాలు విధిస్తున్న ఆయన తీరును వారు తప్పుబడుతున్నారు. ఒకప్పుడు ట్రంప్‌నకు మద్దతిచ్చినవారు, అమెరికాకు ఆయనే మళ్లీ అధ్యక్షుడు కావాలని కోరుకున్నవారు సైతం ఇప్పుడు ఆయన వద్దంటే వద్దు అని తెగేసి చెప్తున్నారు. ఈ మేరకు ఆన్‌లైన్ వేదికగా పలు సామాజిక మాధ్యమాల్లో ట్రంప్‌నకు, అమెరికా ఉత్పత్తులు, కంపెనీలకు వ్యతిరేకంగా ప్రచారం తీవ్రమైంది. అమెరికా కంపెనీలను బాయ్ కాట్ చేయాలని, ట్రంప్ చర్యలను ప్రతిఘటించాలని కొందరు భారతీయులు పిలుపునిస్తున్నారు. భారత్‌లో 'ఎక్స్' వేదికగా ట్రంప్ వ్యతిరేక వైఖరి పెరిగిపోయిందని గుర్తించింది. రష్యా నుంచి చమురు ఉత్పత్తుల కొనుగోలు చేస్తున్నదన్న కారణంతో భారత్‌పై ట్రంప్ ఇప్పటికే 25 శాతం సుంకాన్ని విధించారు. పెనాల్టీగా పేర్కొంటూ ఈనెల 28న మరో 25 శాతం టారిఫ్‌ను విధించేందుకు ట్రంప్ యంత్రాంగం సిద్ధమైన విషయం తెలిసిందే. తాజా విశ్లేషణ ప్రకారం.. భారత్‌పై ఆయన విధించిన టారిఫ్ పెరుగుదల భారతీయుల్లో ఈ ఆగ్రహానికి కారణమైంది. అమెరికా కంపెనీలను టార్గెట్ చేసుకుంటూ వాటిని బాయ్ కాట్ చేయాలన్న క్యాంపెయిన్ 'ఎక్స్'లో తీవ్రమైంది. అమెరికాకు చెందిన ప్రముఖ వ్యాపారాలే లక్ష్యంగా వేలాదిగా ఎక్స్ పోస్టులు వచ్చి పడుతున్నాయి. ఇందులో పది వేల వరకు పోస్టులు కోకా - కోలాను బ్యాన్ చేయాలన్నవే ఉన్నాయి. 9,100కు పైగా పోస్టులు మెటాకు చెందిన ప్రముఖ సామాజిక మాధ్యమం ఫేస్‌బుక్‌ను టార్గెట్ చేసుకున్నాయి. స్టార్‌బక్స్‌ను బాయ్ కాట్ చేయాలని 5,200కు పైగా పోస్టులు డిమాండ్ చేశాయి. ఇక 2,700 పోస్టులు పిజ్జాహట్‌ను, ఐదువేలకు పైగా పోస్టులు కెఎఫ్‌సిని టార్గెట్ చేశాయి. కనీసం పదివేల పోస్టులు 'బాయ్‌కాట్ యుఎస్‌ఎ', 'బాయ్ కాట్ యుఎస్', 'బాయ్ కాట్ అమెరికా' అనే కీలక పదాలను కలిగి ఉన్నాయి. ట్రంప్ టారిఫ్ వార్‌పై భారత్ మాత్రమే కాదు.. ప్రపంచంలోని పలు దేశాలు సైతం ఇదే వైఖరిని అవలంభిస్తున్నాయి. ఈ ఆగ్రహం కెనడాలో మూడు నెలల క్రితమే ప్రారంభమైంది. అమెరికా ఆధిపత్యానికి చెక్ పెట్టాలని నిర్ణయించుకున్నది. ఈ మేరకు అత్యంత ప్రాచుర్యం కలిగిన అమెరికానో కాఫీని 'కెనడియానో'గా పేరు మార్చింది. ఇటు యూరప్‌లో సైతం అక్కడి వినియోగదారులు యూఎస్ అవలంబిస్తున్న విదేశాంగ విధానంపై కూడా ఇదే స్థాయిలో ఆగ్రహం వ్యక్తమవుతున్నది.సుంకాలతో గందరగోళం సృష్టిస్తున్న ట్రంప్ వ్యవహారం విషయంలో ఆయనకు చెందిన 'ట్రంప్ టవర్'పై చర్చ నడుస్తున్నది. ట్రంప్ విధిస్తున్న సుంకాలకు ప్రతిగా హైదరాబాద్‌తో పాటు- గురుగ్రామ్, కోల్‌కతా, ముంబయి, పూణేలలో గల 'ట్రంప్ టవర్' రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో విలాసవంతమైన అపార్ట్‌మెంట్ల కొనుగోళ్లపై భారీ పన్నులు విధించాలని పలువురు సోషల్ మీడియా యూజర్లు అభిప్రాయపడుతున్నారు.

## రాహుల్ అసత్య ఆరోపణలు

### అసోం సిఎం హిమంత బిశ్వశర్మ

గువహటి, ఆగస్టు9(జనంసాక్షి) : బీజేపీ గెలిచిన ప్రతిసారీ ఎన్నికల పక్రియలో తప్పులు జరిగాయని ఆరోపించడం కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీకి అలవా-టైపోయిందని అస్సాం సీఎం హిమంత బిశ్వ శర్మ మండిపడ్డారు. దేశంలో బీజేపీ, ఎన్నికల కమిషన్ కుమ్మక్కయి ఎన్నికల్లో భారీ మోసానికి పాల్పడ్డాయని రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై హిమంత స్పందించారు. రాహుల్ గాంధీ ఎన్నికల్లో గెలిచినప్పుడు.. అంతా బాగానే ఉంటుందని, బీజేపీ గెలిచినప్పుడు మాత్రం తప్పు జరుగుతుందా? అని ప్రశ్నించారు. 'కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్నాటక, తెలంగాణలో 'ఓటు- చోరీ' జరగలేదా? బీజేపీ గెలిస్తే మాత్రం 'ఓటు- చోరీ' జరుగుతుందా' అని ఆయన నిలదీశారు.

## చెట్టుకు రాఖీ కట్టిన కేంద్ర మంత్రి



భోపాల్, ఆగస్టు9 (జనంసాక్షి) : దేశవ్యాప్తంగా శనివారం రాఖీ వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లో జరిగిన వేడుకల్లో పాల్గొన్నారు. ఓ చెట్టుకు రాఖీ కట్టారు మంత్రి శివరాజ్. వృక్షాలు ఆక్సిజన్ అందిస్తాయని, పక్షులు..ఇతర జీవాలు కూడా చెట్లను జీవాధారంగా భావిస్తాయని ఆయన అన్నారు. చెట్టుకు రెండు రాఖీలు కట్టిన ఆయన.. హారతి కూడా ఇచ్చారు. ఆ తర్వాత కొందరు మహిళలు, అమ్మాయిలు.. మంత్రి శివరాజ్‌కు రాఖీ కట్టారు. ఆ ఆడపడుచులను ఆయన ఆశీర్వదించారు.

## కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల కింద ప్రభుత్వానికి లక్షల కోట్లు

- మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాశ్‌రావు

హైదరాబాద్, ఆగస్టు9 (జనంసాక్షి) : కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల కింద రాష్ట్ర ప్రభుత్వానికి లక్షల కోట్ల రూపాయల ఆదాయం వచ్చే అవకాశం ఉందని మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ రావు తెలిపారు. గత ముఖ్యమంత్రులు రాజశేఖర్ రెడ్డి, రోశయ్య ఇతరులకు చెప్పానని.. వారు పట్టించుకోలేదని చెప్పుకొచ్చారు. ఢిల్లీ వేదికగా శనివారం మీడియాతో గోనె ప్రకాష్ రావు మాట్లాడారు. ప్రస్తుత రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి కూడా చెప్పానని.. దీనిపై ఎందుకు దృష్టి పెట్టడం లేదని ప్రశ్నించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అపాయింట్‌మెంట్ కోరానని.. వారిని కలిసి ఈ విషయాన్ని వారి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. ఏఐసీసీ పెద్దలకు కలిసి తన వద్ద ఉన్న వివరాలు అందిస్తానని స్పష్టం చేశారు గోనె ప్రకాష్ రావు.తెలంగాణలో 6 రాజ కుటుంబాల ఆస్తులు, ప్రభుత్వ ఆధీనంలో ఉండాల్సిన ఆస్తులు ప్రైవేట్ వారి చేతుల్లో ఉన్నాయని గుర్తుచేశారు. బ్రిటిష్ చట్టం కాబట్టి దీనిపై ఎవరు ఏమి చేయలేకపోతున్నారని అన్నారు. ల్యాండ్ క్రూజర్ కార్లు, ఇన్నోవా కార్లపై మాత్రమే ముఖ్యమంత్రి, మంత్రుల దృష్టి ఉందని వెల్లడించారు. రేపు ప్రతి మంత్రి హెలికాప్టర్‌లో తిరగాలని ప్లాన్ చేస్తున్నారని చెప్పుకొచ్చారు. ఈ ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూర్చాలని తాను చూస్తున్నానని తెలిపారు గోనె ప్రకాష్ రావు. రెండు రోజుల్లో కాంగ్రెస్ సీనియర్ నేత జానారెడ్డిని కలుస్తానని.. ఆ ఆస్తులను కాపాడాలని కోరుతానని గోనె ప్రకాష్ రావు చెప్పారు. గతంలో ఈ విషయంపై జానారెడ్డి అడ్వకేట్ జనరల్‌తో మాట్లాడారని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రంలో పూర్తయిన తర్వాత కేంద్రంలో కూడా కోర్ట్ ఆఫ్ వార్డ్స్ ఆస్తుల అంశాన్ని బీజేపీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానని చెప్పుకొచ్చారు. ఆదాయాన్ని సమకూర్చుకుంటే రెండు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలు అమలు చేసుకోవచ్చని తెలిపారు. ప్రజా హితం కోసం తన వంతుగా ఈ విసయంపై ప్రయత్నం చేస్తున్నానని గోనె ప్రకాష్ రావు పేర్కొన్నారు.

## తమ్ముడు బాలకృష్ణకు పురందేశ్వరి రాఖీ



హైదరాబాద్, ఆగస్ట్9 (జనంసాక్షి) : రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని నందమూరి బాలకృష్ణకు తన సోదరి దగ్గుబాటి పురందేశ్వరి రాఖీ కట్టింది. ఆ తర్వాత ఇరువురు ఒకరికొకరు స్వీట్స్ తినిపించుకున్నారు. ఆ తర్వాత బాలకృష్ణ తన సోదరి పురందేశ్వరి కాళ్లకు నమస్కరించి ఆశీర్వాదం తీసుకున్నారు. ఇందుకు సంబంధించిన వీడియోను దగ్గుబాటి పురందేశ్వరి సోషల్ మీడియా వేదుకగా పంచుకున్నారు.

## పాకిస్తాన్‌లో రూ.400 కోట్ల నష్టం

- భారత్‌పై ద్వేషంతో శత్రు దేశానికి ఇక్కట్లు




ఢిల్లీ, ఆగస్టు 9 (జనంసాక్షి) : పహల్గాం ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్ దేశాల మధ్య ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. పాకిస్థాన్‌కు వ్యతిరేకంగా భారత్ ఎన్నో నిర్ణయాలు తీసుకుని వాటిని అమల్లోకి తీసుకొచ్చింది. దీంతో పాకిస్థాన్ కూడా భారత్‌కు వ్యతిరేకంగా కొన్ని నిర్ణయాలు తీసుకుంది. భారత్ విమానాలకు గగనతలాన్ని మూసేయడం ఆ వ్యతిరేక నిర్ణయాల్లో ఒకటి. అయితే పాకిస్థాన్ తీసుకున్న ఆ నిర్ణయం ఆ దేశానికి తీవ్ర నష్టం కలుగజేసింది. ఈ నిర్ణయం కారణంగా పాకిస్థాన్ రెండు నెలల్లోనే దాదాపు రూ.400 కోట్లు కోల్పోయింది. భారత్ నుంచి వచ్చే విమానాలను ఏప్రిల్ 24వ తేదీ నుంచి పాకిస్థాన్ తన గగనతలంలోకి అనుమతించడం లేదు. ఈ నిషేధం ఇప్పటికీ కొనసాగుతోంది. నిజానికి భారత్ నుంచి వెళ్లే అంతర్జాతీయ విమానాలు చాలా వరకు పాకిస్థాన్ గగనతలాన్ని వాడుకుంటాయి. పాక్ గగనతలం మీదుగా రోజుకు 100 నుంచి 150 భారతీయ విమానాలు ప్రయాణిస్తుంటాయి. ఇలా గగనతలాన్ని వాడుకున్నందుకు ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను చెల్లించాల్సి ఉంటుంది. ఒక్క బోయింగ్ విమానం పాక్ గగనతలం మీదుగా ప్రయాణిస్తే దాదాపు 580 డాలర్లు చెల్లించాల్సి ఉంటుంది. పాకిస్థాన్ గగనతలం మూసేయడంతో భారత్ విమానాలు వేరే మార్గాల్లో ప్రయాణిస్తున్నాయి. దీంతో ఆ ఓవర్ ఫ్లైయింగ్ ఛార్జీలను పాకిస్థాన్ కోల్పోయింది. ఏప్రిల్ 24 నుంచి జూన్ 20 మధ్యలో పాకిస్థాన్ ఎయిర్ పోర్ట్స్ అథారిటీకి రూ.410 కోట్ల నష్టం వాటిల్లింది. ఈ విషయాన్ని పాక్ రక్షణ మంత్రిత్వ శాఖ అక్కడి అసెంబ్లీలో వెల్లడించినట్లు డాన్ నివేదించింది. ఈ అంక్షల వల్ల పాకిస్థాన్ ఏడాదికి వేల కోట్ల రూపాయలను కోల్పోతుందని ఆర్థికవేత్తలు అంచనా వేస్తున్నారు.

## ధర్మస్థల వ్యవహారంలో కానరాని పురోగతి

- చూపిన చోటల్లా తవ్వుతున్నా బయటపడని ఆనవాళ్లు



బెంగళూరు, ఆగస్ట్9 (జనంసాక్షి) : ధర్మస్థలలో సిట్ దర్యాప్తు ఒకవైపు, తవ్వకాలు మరోవైపు కొనసాగుతున్నాయి. అయితే ఆధారాలు పెద్దగా లభించడం లేదు. తవ్వకాలు, తమకు దొరికిన ఎముకలు, ఇతర అవశేషాలకు సంబంధించి సిట్ అధికారులు వివరాలను వెల్లడించకుండా గోప్యంగా ఉంచారు. తవ్వకాలు చేస్తున్న చోటు-కు ఉప్పుమూటల్ని తీసుకువెళుతున్నారు. దొరికిన వాటిని సంచుల్లో ఉంచుకుని, వాటికి తెల్లవస్త్రాన్ని చుట్టి తీసుకువెళుతున్నారు. బెళ్తంగడి సిట్ కార్యాలయానికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి మణిపాల్ కేఎంసీకి పంపిస్తున్నారు. మణిపాల్ నుంచి బెంగళూరులోని ఫోరెన్సిక్ ప్రయోగశాలకు ఆయా సంచులను చేరవేస్తున్న ఘట్టం నిగూఢంగా సాగుతోంది. ధర్మస్థలలో సిట్ చేపట్టిన కార్యాచరణకు, తమకు సంబంధాన్ని అంటగడుతూ కొన్ని ప్రచార మాధ్యమాలు, యూట్యూబర్లు చేస్తున్న ప్రచారాన్ని అడ్డుకోవాలని కోరుతూ ఆలయ ప్రముఖుడు హర్షేంద్రకుమార్ హెగ్గడే వేసుకున్న అర్జీని సర్వోన్నత న్యాయస్థానం శుక్రవారం తోసిపుచ్చింది. ఉన్నత న్యాయస్థానం ఆదేశాలను ప్రశ్నిస్తూ ధర్మస్థల కార్యదర్శి హర్షేంద్ర కుమార్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ప్రచార మాధ్యమాలను నియంత్రించాలని పదేపదే న్యాయస్థానాలను ఆశ్రయించవలసిన అవసరం ఏముందని జస్టిస్ రాజేశ్ బిందాల్, జస్టిస్ మన్మోహన్ నేతృత్వంలోని పీఠం అనుమానాన్ని వ్యక్తం చేసింది. మీమ్‌లు, అభ్యంతరకరమైన అంశాలపై కర్ణాటకలోని న్యాయస్థానంలో అర్జీ వేసుకోవాలన్నారు. మీకు వ్యతిరేకంగా తప్పుడు ప్రచారం చేయవలసిన అవసరం మాధ్యమ ప్రతినిధులకు ఎందుకు ఉంటుందని ప్రశ్నించారు. ఇకపోతే తాను వందలాది శవాలను పూడ్చి పెట్టానని ప్రకటించిన ఒకప్పటి పారిశుద్ధ్య కార్మికుడు భీమ సహకారంతో ప్రత్యేక దర్యాప్తు దళం సిట్ తవ్వకాలను కొనసాగిస్తోంది. అయిత అక్కడ పెద్దగా ఎలాంటి శవాల ఆనావాళ్లు కానరావడం లేదు. మొదట 13 ప్రాంతాలు, అనంతరం ఒక కొత్త ప్రదేశంతో పాటు, మరో మూడు ప్రాంతాలను ఆ వ్యక్తి చూపించాడు. వాటిలో మొదటి 12 ప్రాంతాల్లో తవ్వకాలు పూర్తిచేయగా, ఆరో ప్రాంతంలో మాత్రమే ఎముకలు లభించాయి. మరో చోట ఉరి వేసుకున్న వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. 13వ ప్రాంతంలో తాను ఎనిమిదికిపైగా మృతదేహాలను పూడ్చి పెట్టానని ఆ వ్యక్తి చెప్పడం గమనార్హం. ఆ ప్రాంతాన్ని కాదని.. గురువారం కొత్తగా గుర్తించిన ప్రాంతంలో తవ్వకాలు చేపట్టినా ఏమీ లభించలేదు. శుక్రవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భీమను సిట్ అధికారులు విచారించారు. అతను కొత్తగా చూపించిన మూడు ప్రాంతాల్లో ఒక చోట సాయంత్రం వరకు తవ్వారు. అయినా తాను మరో 30 ప్రాంతాలను చూపిస్తానని, అక్కడ తవ్వకాలు చేయాలని కోరాడు. జీపీఆర్ కోసం...: భీమ చూపించిన 13వ ప్రాంతంలో తవ్వకాలకు ముందస్తుగా జీపీఆర్ పరికరాన్ని వినియోగించి తవ్వకాలు కొనసాగించాలని సిట్ అధికారులు నిర్ణయించారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాకపోవడం, జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకోవలసిన అవసరం ఉండడంతో ఆ ప్రదేశంలో తవ్వకాలు సాగలేదు. ఎవరూ అక్కడకు రాకుండా సాయుధదళాన్ని భద్రతకు నియమించారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చిన వెంటనే జీపీఆర్ పరికరాన్ని బాడుగకు తీసుకుంటామని సిట్ అధికారి తెలిపారు. మొత్తంగా భీమ చెప్పిన ప్రాంతాల్లో ఎక్కడా బలమైన ఆధారాలు దొరకలేదు. దీంతో ఇప్పుడు భీమపై అనుమానాలు కూడా వస్తున్నాయి.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370